www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Companies driven by speed *Choose AP.*
ANDHRA PRADESH GOVERNMENT
WARMLY WELCOMES
ALL GLOBAL DELEGATES
Summit of Ideas, Impact, and International Partnerships.
For Registration, Visit www.partnershipsummit.com
For Queries, Contact partnership.summit@cii.in

శుక్రవారం | 14-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 248 | గుంటూరు సిటీ

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: దశమి రా.12.50 తదుపరి ఏకాదశి, నక్షత్రం: పుబ్బ రా.9.20 తదుపరి ఉత్తర, వర్జ్యం: తె. 5.12 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8.37-9.22, మ.12.21-1.06, అమృతఘడియలు: మ.2.28-4.11, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.23, సూర్యాస్తమయం: 5.35

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పోర్ట్స్

చరిత్ర సృష్టించిన అనుపమ

వరల్డ్ స్నూకర్ టైటిల్ కైవసం



దోహా: వరల్డ్ స్నూకర్ టైటిల్ నెగ్గిన తొలి భారత మహిళగా అనుపమ రామచంద్రన్ చరిత్ర సృష్టించింది. గురువారం జరిగిన ఫైనల్లో అనుపమ 3-2తో మూడు సార్లు చాంపియన్ ఎన్‌జీ ఆన్ యి (హాంకాంగ్)పై విజయం సాధించింది. సెమీస్‌లో అనుపమ 3-1తో భారత్‌కే చెందిన కీర్తన పాండియన్‌పై గెలిచింది.

సురేఖ డబుల్ ధమాకా



- ‘కాంపౌండ్’లో భారత్‌కు మూడు స్వర్ణాలు
- ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్

ఢాకా: జ్యోతి సురేఖ ముందుండి నడిపించడంతో.. ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్లు మూడు స్వర్ణాలు, రెండు రజతాలు కొల్లగొట్టారు. సీనియర్ ఆర్చర్ సురేఖ టీమ్‌తోపాటు వ్యక్తిగత స్వర్ణంతో రాణించింది. గురువారం జరిగిన మహిళల టీమ్ ఫైనల్లో సురేఖ, దీప్షిక, ప్రతీక ప్రదీప్‌ల త్రయం 236-234తో కొరియాపై గెలిచి పసిడి పతకం సొంతం చేసుకొంది. తొలి సెట్‌లో 59-59తో సమంగా నిలిచినా రెండో సెట్‌లో భారత్ 59-58తో కొరియాపై ఆధిక్యం సాధించింది. మూడో సెట్ 59-59తో సమం కాగా.. నాలుగో సెట్‌లో 59-58తో పైచేయి సాధించిన భారత్ పసిడి పతకాన్ని సొంతం చేసుకొంది. ఇక, మహిళల వ్యక్తిగత విభాగంలో సహచరి, 17 ఏళ్ల ప్రతీకపై జ్యోతిసురేఖ 147-145తో గెలిచి రెండో బంగారు పతకాన్ని దక్కించుకొంది. దీంతో ప్రతీకకు రజతం లభించింది. మిక్స్‌డ్ విభాగం స్వర్ణ పోరులో దీప్షిక-అభిషేక్ వర్మ జోడీ 153-151తో బంగ్లాదేశ్ జంటపై గెలిచింది. అయితే, ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పురుషుల జట్టుకు ఫైనల్లో షాక్ తగిలింది. అభిషేక్ వర్మ, రాజేష్ జాదవ్, ప్రథమేష్‌ల త్రయం 229-230 కజకిస్థాన్ బృందం చేతిలో ఓడి రజతానికే పరిమితమైంది.

ప్రీక్వార్టర్స్‌కు అర్జున్, హరికృష్ణ

చెస్ వరల్డ్‌కప్

పనాజీ: అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణ ఫిడే వరల్డ్‌కప్ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన నాలుగోరౌండ్ టైబ్రేక్‌లోని రెండు గేముల్లోనూ హంగేరీ జీఎం పీటర్ లెకోపై గెలిచిన అర్జున్ 3-1తో విజయం సాధించాడు. ఇక టైబ్రేక్‌లో తొలి గేమ్‌ను డ్రా చేసుకొన్న హరి.. రెండో గేమ్‌లో స్వీడన్ జీఎం గ్రాండ్‌లస్‌పై నెగ్గి 2.5-1.5తో ముందంజ వేశాడు. అయితే, గత వరల్డ్‌కప్ రన్నరప్ ప్రజ్ఞానంద 1.5-2.5తో డబోవ్ చేతిలో పరాజయం పాలయ్యాడు.

ఆఖరాటా కివీస్‌దే.. 3-1తో సిరీస్ కైవసం

డ్యునెడిన్: వెస్టిండీస్‌తో జరిగిన ఆఖరి, ఐదవ టీ20లోనూ నెగ్గిన న్యూజిలాండ్ సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంది. తొలుత విండీస్ 18.4 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటైంది. అనంతరం కివీస్ 15.4 ఓవర్లలో 2 వికెట్లకు 141 రన్స్‌తో లక్ష్యాన్ని ఛేదించింది. జాకబ్ డఫీ (4/35) ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీశాడు.

రుతురాజ్ సెంచరీ

భారత్ ‘ఎ’ విజయం



రాజ్‌కోట్: ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (117) శతకం సాధించడంతో దక్షిణాఫ్రికా ‘ఎ’ జట్టుతో జరిగిన తొలి అనధికార వన్డేలో భారత్ ‘ఎ’ 4 వికెట్ల తేడాతో నెగ్గింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 285 పరుగులు సాధించింది. 53/5 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును లోయరార్డర్‌లో పాట్‌జీటర్ (90), ఫారెస్టర్ (77), ఫోర్టున్ (59) ఆదుకున్నారు. హర్షిత్, అర్ష్‌దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ ‘ఎ’ 49.3 ఓవర్లలో 6 వికెట్లకు 290 పరుగులు చేసి విజయం సాధించింది. కెప్టెన్ తిలక్ వర్మ (39), నితీశ్ కుమార్ రెడ్డి (37), అభిషేక్ శర్మ (31), నిశాంత్ (29) సహకరించారు. ఫోర్టున్, బార్ట్‌మన్, ఫూరెన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. సిరీస్‌లోని మిగిలిన రెండు వన్డే మ్యాచ్‌లు 16, 19 తేదీల్లో రాజ్‌కోట్ వేదికగానే జరుగుతాయి.

సఫారీలతో సవాల్

స్పెషలిస్ట్ బ్యాటర్‌గా జురెల్

స్పిన్ బలంతో దక్షిణాఫ్రికా

ఉ. 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

తొలి టెస్టు బరిలో భారత్



కోల్‌కతా: భారత పర్యటనకు వచ్చే ఏ జట్టయినా ఇక్కడి పిచ్‌లపై స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తడబడుతుంటుంది. కానీ ఇప్పుడు దక్షిణాఫ్రికా రూపంలో భారత జట్టుకే కఠిన పరీక్ష ఎదురుకానుంది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఇరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్టు ఆరంభమవుతోంది. ఈ ఏడాది మొదట్లో న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను టీమిండియా 0-3తో కోల్పోయిన విషయం తెలిసిందే. అందుకు కారణం.. ఆ జట్టులోని స్పిన్నర్లు ఎజాజ్ పటేల్, శాంట్నర్, ఫిలిప్స్. ఇక దక్షిణాఫ్రికా జట్టు సహజంగా పదునైన పేసర్లతో బలంగా ఉంటుందనే అభిప్రాయం ఉంటుంది. కానీ ప్రస్తుతం ప్రపంచ అత్యుత్తమ స్పిన్నర్లతో ఈ టీమ్ కూడా ప్రత్యర్థి జట్లను బెదరగొడుతోంది. ఆ బలంతోనే ఈ టూర్‌కు ముందు పాక్‌తో సిరీస్‌ను 1-1తో సమం చేసుకోగలిగింది. ఇందులో పాక్ కోల్పోయిన 39 వికెట్లలో స్పిన్ త్రయం కేశవ్ మహరాజ్, సైమన్ హార్మర్, ముత్తుస్వామి కలిపి 35 పడగొట్టడం విశేషం. అదే పాక్ స్పిన్నర్లు తమ సొంతగడ్డపైనే ఆడినా 21 వికెట్లు మాత్రమే తీశారు. అందుకే తాజా సిరీస్‌ను భారత ఉపఖండ జట్టుతోనే ఆడబోతున్నట్టుగా ఉందని టీమిండియా సహాయక కోచ్ టెన్ డస్కాటే అభిప్రాయపడ్డాడు. అయితే టెస్టు ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికాకు భారత్‌లో మెరుగైన రికార్డు లేకపోవడం మనకు కాస్త సానుకూలాంశం. ఆ జట్టిక్కడ టెస్టు గెలిచి 15 ఏళ్లు కావడం గమనార్హం. అంతేకాకుండా చివరగా ఆడిన ఏడు టెస్టుల్లో ఆరింటిని కోల్పోయింది. అయినప్పటికీ ఈసారి వరల్డ్ టెస్టు చాంపియన్ హోదాలో ఉన్న సఫారీలను గిల్ సేన ఎలా ఎదుర్కొంటుందో వేచిచూడాల్సిందే.



బ్రెవిస్ స్థానంలో బవుమా

పాక్‌తో సిరీస్‌ను 1-1తో సమం చేసుకుని భారత పర్యటనకు వచ్చిన సౌతాఫ్రికా ఆత్మవిశ్వాసంతో ఉంది. బ్యాటింగ్, బౌలింగ్‌ల్లో సమతూకంగా కనిపిస్తున్న ఈ జట్టు ఎలాగైనా భారత్‌ను ఓడించాలన్న పట్టుదలతో ఉంది. గాయంతో పాక్ పర్యటనకు దూరమైన కెప్టెన్ బవుమా ఇటీవలే భారత్ ‘ఎ’పై బరిలోకి దిగి ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. దీంతో డివాల్డ్ బ్రెవిస్ స్థానంలో తను ఆడనున్నాడు. మార్‌క్రమ్, రికెల్టన్, స్టబ్స్‌లతో టాపార్డర్ భారత పేసర్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. ఐపీఎల్ ద్వారా వీరికి ఇక్కడి పిచ్‌లపై అవగాహన ఉంది. మిడిలార్డర్‌లో జోర్జి, బవుమా, వెరీన్ కీలకం కానున్నారు. యాన్సెన్, రబాడ పేస్ బాధ్యతలు తీసుకోనుండగా.. కేశవ్, హార్మర్, ముత్తుస్వామి స్పిన్‌తో ఇబ్బందిపెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: రాహుల్, జైస్వాల్, సాయి సుదర్శన్, గిల్ (కెప్టెన్), పంత్, జురెల్, జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్/అక్షర్, బుమ్రా, సిరాజ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, రికెల్టన్, స్టబ్స్, జోర్జి, బవుమా (కెప్టెన్), వెరీన్, ముత్తుస్వామి, హార్మర్, యాన్సెన్, కేశవ్ మహరాజ్, రబాడ.

పిచ్-వాతావరణం

ఈడెన్ పిచ్ సహజంగా స్పిన్నర్లకు సహకరిస్తుంటుంది. అయితే ఈసారి పూర్తి టర్నింగ్ వికెట్ కాకుండా పేసర్లకు కూడా అనుకూలించే అవకాశం ఉంది. తొలి రోజు పేసర్లదే ఆధిపత్యం కానుంది. కాస్త ఓపిక పడితే బ్యాటర్లు పరుగులు సాధించే వీలుంటుంది. ఆఖరి రెండు రోజులు మాత్రం స్పిన్‌ను ఎదుర్కోవడం బ్యాటర్లకు పరీక్ష కానుంది. వర్షసూచన లేదు.

కుల్దీప్ ఆడేనా?

భారత్ ‘ఎ’ తరఫున శతకాల మోత మోగించిన కీపర్ ధ్రువ్ జురెల్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడడం ఖాయమే. కీపర్‌గా పంత్ కొనసాగనున్నాడు. ఓపెనర్లుగా రాహుల్, జైస్వాల్‌లతో పాటు వన్‌డౌన్ బ్యాటర్‌గా సాయి సుదర్శన్ ఆ తర్వాత కెప్టెన్ గిల్‌లతో భారత బ్యాటింగ్ ఆర్డర్ పటిష్ఠంగానే కనిపిస్తోంది. అయితే బ్యాటింగ్ డెప్త్ కోసం ఆల్‌రౌండర్‌గా అక్షర్‌ను ఆడించాలా? లేక స్పిన్నర్ కుల్దీప్‌తో వెళ్లాలా? అనే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. ఇటీవలి కాలంలో ఈడెన్ పిచ్ కాస్త పేసర్లకు సహకరిస్తుండడంతో మూడో పేసర్‌ను కూడా ఆడిస్తే ఎలా ఉంటుందన్న యోచనలోనూ ఉన్నారు. ఏదిఏమైనా శుక్రవారం ఉదయం పిచ్‌ను పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామని కెప్టెన్ గిల్ చెబుతున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్లు జడేజా, సుందర్ తుది జట్టులో ఉండనుండగా.. కుల్దీప్ స్థానమే సందేహంలో ఉంది. భారత్ ఆడిన చివరి టెస్టులోనైతే ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లు జట్టులో ఉన్నారు. ఒకవేళ ముగ్గురు పేసర్లు అనుకుంటే బుమ్రా, సిరాజ్‌కు జతగా ఆకాశ్ దీప్‌ను ఆడించవచ్చు.

వెనక్కితగ్గిన లంక క్రికెటర్లు

పాక్ టూర్‌లో కొనసాగడానికి ఓకే..

- టీ20 ముక్కోణపు టోర్నీ రీషెడ్యూల్
- భద్రతపై పాక్ ఆర్మీ చీఫ్ భరోసా



రావల్పిండి: భద్రతాపరమైన భయాలు నెలకొనడంతో.. పాక్, శ్రీలంక, జింబాబ్వేలు తలపడనున్న టీ20 ముక్కోణపు సిరీస్‌ను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) రీషెడ్యూల్ చేసింది. ఆరంభ తేదీని ఈ నెల 17 నుంచి 18వ తేదీకి మార్చింది. ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి నేపథ్యంలో కేవలం రావల్పిండిలోనే టోర్నీ మొత్తాన్ని నిర్వహించనున్నట్టు పీసీబీ ప్రకటించింది. అంతకు ముందు లాహోర్‌లో ఐదు మ్యాచ్‌లతోపాటు ఫైనల్ కూడా నిర్వహించాలనుకొన్నారు. కాగా, ప్రస్తుతం పాక్ పర్యటనలో వన్డే సిరీస్ ఆడుతున్న లంక జట్టు ఈ దాడులతో భయోత్పాతానికి గురైంది. ఈ క్రమంలో కొందరు ఆటగాళ్లు సిరీస్ మధ్యలోనే జట్టును వీడాలన్న నిర్ణయానికి వచ్చారు. అయితే, పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్.. లంక ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి జట్టు భద్రతపై హామీ ఇచ్చినట్టు పీసీబీ చీఫ్ మొహిసిన్ నక్వీ తెలిపారు. లంక బోర్డు కూడా తమ ఆటగాళ్లను గట్టిగా వారించడంతో.. ఈ పర్యటనలో కొనసాగడానికే లంక ప్లేయర్లు నిర్ణయించుకొన్నారు. దీంతో సిరీస్‌లో భాగంగా గురు, శనివారాల్లో నిర్వహించాల్సిన రెండు వన్డేలను ఈ నెల 14, 16కు రీషెడ్యూల్ చేశారు. ట్రై సిరీస్ కోసం జింబాబ్వే జట్టు కూడా పాక్‌కు చేరుకొంది.

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

- ప్రణయ్ ఓటమి
- జపాన్ ఓపెన్

కుమమోటో (జపాన్): భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ జపాన్ ఓపెన్ మాస్టర్స్ టోర్నమెంట్లో క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో తను జియా హెంగ్ జేసన్ (సింగపూర్)పై 21-13, 21-11 తేడాతో వరుస గేముల్లో నెగ్గాడు. క్వార్టర్స్‌లో సింగపూర్‌కే చెందిన లో కీన్ యూతో లక్ష్య సేన్ ఆడనున్నాడు. ఇక హెచ్ఎస్ ప్రణయ్ పోరాటం రెండో రౌండ్‌కే పరిమితమైంది. 46 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్ 18-21, 15-21 తేడాతో రాస్మస్ గెమ్కే (డెన్మార్క్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

ముంబైకి శార్దూల్, రూథర్‌ఫోర్డ్

ఐపీఎల్ ట్రేడింగ్‌లో సొంతం

న్యూఢిల్లీ: భారత ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్, వెస్టిండీస్ ఆటగాడు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్‌లు ముంబై ఇండియన్స్ జట్టులో చేరారు. 2026 సీజన్ కోసం జరిగిన ట్రేడ్ విండోలో వీరిద్దరినీ ముంబై కొనుగోలు చేసింది. మెగా వేలంలో లఖ్‌నవూ దక్కించుకొన్న శార్దూల్‌ను అతడి కొనుగోలు ధర రూ. 2 కోట్లకు ముంబై ఖరీదు చేసింది. గుజరాత్ జెయింట్స్ ఆటగాడు రూథర్‌ఫోర్డ్‌ను అతడి వేలం ధర రూ. 2.6 కోట్లకు ముంబై సొంతం చేసుకొంది. కాగా, లెఫ్టామ్ పేసర్ అర్జున్ టెండూల్కర్‌ను ముంబై వదిలేయనుంది.

ఒలింపిక్స్ క్రికెట్ షెడ్యూల్ వచ్చేసింది!

2028, జూలై 20, 29న పతక మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్-2028లో క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను నిర్వాహకులు విడుదల చేశారు. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ పోటీల్లో ఆరు జట్లు పాల్గొననున్నాయి. మహిళల మ్యాచ్‌లు 2028, జూలై 12 నుంచి 20 వరకు, పురుషుల మ్యాచ్‌లు జూలై 22 నుంచి 29 వరకు జరగనున్నాయి. లాస్ ఏంజిల్స్‌కు 50 కిమీ. దూరంలో నిర్మించే తాత్కాలిక స్టేడియాల్లో రోజుకు రెండు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

బిజినెస్

ఐటీలో నాలుగేళ్ల గరిష్ఠానికి నిరుద్యోగం

కొనసాగుతున్న కొలువుల కోత
మరో 50,000 మందిపై పొంచి ఉన్న వేటు?
ఇన్‌స్టాహైర్ వెల్లడి

న్యూఢిల్లీ: నిన్న మొన్నటి వరకు ఐటీ ఉద్యోగమంటే ఒక క్రేజ్. వారానికి ఐదు రోజుల పని, నెలకు ఐదు లేదా ఆరు అంకెల్లో జీతం. నగరాల్లో కాస్మోపాలిటన్ లైఫ్, వీకెండ్‌లో ఫ్రెండ్స్ లేదా ఫ్యామిలీతో పార్టీలు, విహార యాత్రలు. ఇప్పుడు అదంతా గతం. ప్రస్తుతం ఉన్న ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియని స్థితి. దినదిన గండం నూరేళ్ల ఆయుష్షులా బతకాల్సిన దుస్థితి. ఈ ఏడాది అక్టోబరు నాటికి ఐటీ నిపుణుల్లో నిరుద్యోగం గత నాలుగేళ్లలో ఎన్నడూ లేని విధంగా 7.2 శాతానికి చేరిందని ఐటీ కంపెనీలకు నియామక సేవలు అందించే ఇన్‌స్టాహైర్ అనే సంస్థ తెలిపింది.

అంతా టెక్నాలజీ పుణ్యం: ఐటీ రంగంలో ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) ట్రెండ్ నడుస్తోంది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి డిజిటల్ నైపుణ్యాల్లో పట్టు ఉంటేనే ఉద్యోగం. లేకపోతే ‘మీ సేవలు ఇక చాలు’ అని ఐటీ కంపెనీలు.. ఉద్యోగులకు చావు కబురు చల్లగా చెప్పేస్తున్నాయి. దీనికి తోడు అమెరికా, ఈయూ దేశాల నుంచి వచ్చే ప్రాజెక్టులు తగ్గిపోయాయి. అరకొర ప్రాజెక్టులు వచ్చినా, బిల్లింగ్ పెద్దగా పెరగడం లేదు. దీంతో ఖర్చులు పెరిగిపోయి కంపెనీల లాభాలకూ గండి పడుతోంది. ఈ పరిణామాలతో దాదాపు 24 శాతం కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. టీసీఎస్ వంటి పెద్ద కంపెనీలతో పాటు కోఫోర్జ్ వంటి మధ్య స్థాయి ఐటీ కంపెనీలు ఇప్పటికే పునర్ వ్యవస్థీకరణ పేరుతో ఉద్యోగాల కోత అమలు చేస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ దాదాపు 19,755 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. ఇదే కాలంలో మధ్య స్థాయి ఐటీ కంపెనీ కోఫోర్జ్ కూడా 5,000 మంది ఉద్యోగులను రోడ్డున పడేసింది. ఐటీ కంపెనీలు త్వరలో మరో 50,000 మందిని తొలగించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఫ్రెషర్స్ డీలా

బీఈ, బీటెక్ పూర్తి చేసే వారిలో నూటికి 60-70 శాతం మందికి ఇప్పటి వరకు ఐటీ రంగంలోనే కొలువులు లభించేవి. కంపెనీలు కూడా నేరుగా కాలేజీలకు వెళ్లి ఇంటర్వ్యూలు చేసి తమకు కావాల్సిన నైపుణ్యాలు ఉన్న ఫ్రెషర్లకు ప్లేస్‌మెంట్లు ఇచ్చేవి. ఏఐ పుణ్యమాని ఇప్పుడా పరిస్థితి లేదు. గతంలోలా ఐటీ కంపెనీలు పెద్దగా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు వెళ్లడం లేదు. ఉన్న ఉద్యోగులకే ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి పని కానిచ్చేస్తున్నాయి. దీంతో ఐటీ ఉద్యోగాలపై గంపెడాశలు పెట్టుకున్న ఫ్రెషర్స్ నీరుగారిపోతున్నారు. ఏఐ నైపుణ్యాలపై అవగాహన ఉన్న ఫ్రెషర్లకు మాత్రమే కంపెనీలు కొద్దో గొప్పో అవకాశం ఇస్తున్నాయి.

లాభాల్లోకి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

క్యూ2లో రూ.35 కోట్లుగా నమోదు

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో లాభాల్లోకి అడుగుపెట్టింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ రూ.3,754 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.35 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.2,598 కోట్లుగా ఉండగా నష్టాలు రూ.429 కోట్లుగా ఉన్నాయి. మూడేళ్ల తర్వాత తొలిసారిగా పన్ను చెల్లింపునకు ముందు లాభాల (పీబీటీ)ను నమోదు చేసినట్లు పేర్కొంది. కాగా సమీక్షా త్రైమాసికంలో ఢిల్లీ విమానాశ్రయం ద్వారా 1.76 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించగా హైదరాబాద్ విమానాశ్రయం నుంచి 73 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించినట్లు జీఏఎల్ తెలిపింది. ఈ కాలంలో ఢిల్లీ విమానాశ్రయం ఆదాయం 34% వృద్ధితో రూ.1,849 కోట్లకు చేరుకోగా హైదరాబాద్ విమానాశ్రయం ఆదాయం 17% వృద్ధి చెంది రూ.674 కోట్లకు చేరుకుందని తెలిపింది. కాగా ఏపీలోని భోగాపురం విమానాశ్రయాన్ని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

తగ్గిన రాంకీ ఇన్‌ఫ్రా లాభం

రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.471.60 కోట్ల ఆదాయంపై రూ.75.6 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.527.40 కోట్లుగా ఉండగా లాభం రూ.83 కోట్లుగా ఉంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.444.80 కోట్ల ఆదాయంపై రూ.67.9 కోట్ల లాభాన్ని నమోదు చేసింది.

కార్ల ఉత్పత్తి పెంపు

20-40% మేర పెంచేందుకు కంపెనీల సన్నాహాలు ● టాప్‌గేర్‌లో విక్రయాలు ● జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో బూస్ట్



న్యూఢిల్లీ: దేశీయ కార్ల పరిశ్రమ ప్రస్తుతం మంచి జోరు మీద ఉంది. పండగ సీజన్ గిరాకీ, జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో గత నెలలో కంపెనీల కార్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో 5,57,373కు చేరాయి. దీంతో చాలా మంది డీలర్ల వద్ద స్టాకు లేకుండా పోయింది. ఈ నెల ప్రారంభానికి మారుతి సుజుకీ డీలర్ల వద్ద ఉండే కార్ల నిల్వలు 1.04 లక్షల యూనిట్లకు పడిపోయాయి. ఈ నిల్వలు 19 రోజుల అమ్మకాలకు మాత్రమే సరిపోతాయి. మరోవైపు ఆర్డర్లు మాత్రం 3.5 లక్షల యూనిట్లకు చేరాయి. ఈ గ్యాప్‌ను భర్తీ చేసేందుకు కంపెనీలు ఈ నెల ఉత్పత్తి సామర్థ్యాన్ని సగటున 20 నుంచి 40 శాతం వరకు పెంచాయి. సెప్టెంబరు నెలాఖరు వరకు నెలకు సగటున 1.72 లక్షల కార్లను ఉత్పత్తి చేస్తున్న మారుతి సుజుకీ ఈ నెల రెండు లక్షల కార్లకు పైగా ఉత్పత్తి చేయనుంది. ఇందు కోసం కంపెనీ యూనిట్లు ఆదివారాలు కూడా పని చేస్తున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఒకరు చెప్పారు.

మిగతా కంపెనీలదీ అదే బాట

టాటా మోటార్స్ కూడా తన నెలవారీ కార్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని ఈ నెల 47,000 నుంచి 65,000-70,000కు పెంచుతోంది. హ్యుండయ్ మోటార్‌దీ ఇదే పరిస్థితి. డీలర్ల వద్ద నిల్వలు పెంచేందుకు ప్రస్తుతం ఈ కంపెనీ రెండు షిఫ్టుల్లో పని చేస్తోంది. పండగ సీజన్ గిరాకీతో పాటు జీఎస్‌టీ రేట్ల కోతతో కార్ల డిమాండ్ అమాంతం పెరిగిందని కంపెనీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఈ గిరాకీ ఈ ఆర్థిక సంవత్సరం చివరి వరకు కొనసాగుతుందని టాటా మోటార్స్ భావిస్తోంది. అమ్మకాలు పెరగటంతో ఆటోమొబైల్ కంపెనీలన్నీ ఉత్పత్తిని 20 నుంచి 40 శాతం పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

ఆరు శాతం అప్!

నిజానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం పరిశ్రమకు పెద్దగా కలిసి రాలేదు. అయితే జీఎస్‌టీ రేట్ల కోతతో పండగ సీజన్‌లో కార్ల కొనుగోళ్లు అమాంతం పెరిగాయి. గత ఏడాది ఫెస్టివల్ సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది పండగల సీజన్‌లో అమ్మకాల గిరాకీ రికార్డు స్థాయిలో 25 శాతం పెరిగింది. దీంతో ఈ ఏడాది అక్టోబరు- 2026 మార్చి మధ్య కాలంలో అమ్మకాల డిమాండ్ 6 శాతం పెరిగే అవకాశం ఉందని కంపెనీల అంచనా. కొత్త మోడల్స్ విడుదల, ఉత్పత్తి సామర్థ్య విస్తరణ ద్వారా ఈ గిరాకీని తట్టుకోవాలని కార్ల కంపెనీలు భావిస్తున్నాయి.

‘బీమా’లోకి మహీంద్రా

కెనడా సంస్థ మనులైఫ్‌తో జేవీ ఏర్పాటు ● రూ.7,200 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: మహీంద్రా గ్రూప్ బీమా సేవల రంగంలోకి ప్రవేశిస్తోంది. కెనడాలోని టొరంటో కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మనులైఫ్‌తో కలిసి చెరి సగం భాగస్వామ్యం (జేవీ)తో జీవిత బీమా సంస్థ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) గురువారం ప్రకటించింది. ఈ జేవీలో ఒక్కో భాగస్వామి రూ.3,600 కోట్ల చొప్పున మొత్తం రూ.7,200 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాయి. మొదటి ఐదేళ్లలో ఒక్కో భాగస్వామి రూ.1,250 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉంది. మహీంద్రా ఫైనాన్స్ నుంచి సమకూరే డివిడెండ్ సొమ్ముతో ఈ జేవీలో పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎం అండ్ ఎం తెలిపింది. వచ్చే పదేళ్లలో ఈ జేవీ వ్యాపారాన్ని రూ.18,000 కోట్ల నుంచి రూ.30,000 కోట్ల స్థాయికి పెంచాలనుకుంటున్నట్లు మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ అనీశ్ షా తెలిపారు. కాగా బీమా సేవల లైసెన్సు కోసం ఐఆర్‌డీఏఐకి వచ్చే 2-3 నెలల్లో దరఖాస్తు చేసుకోనున్నట్లు షా వెల్లడించారు. కంపెనీ కార్యకలాపాల ప్రారంభానికి 15-18 నెలలు పట్టవచ్చన్నారు.

మనులైఫ్‌తో ఏడేళ్ల అనుబంధం: మహీంద్రా గ్రూప్, మనులైఫ్ కలిసి ఇప్పటికే దేశంలో మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని సాగిస్తున్నాయి. ఎం అండ్ ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్, మనులైఫ్.. ఏడేళ్ల క్రితమే (2019లో) మహీంద్రా మనులైఫ్ ఎంఎఫ్‌ను ఏర్పాటు చేశాయి. 2020లో కార్యకలాపాలు ప్రారంభించిన ఈ కంపెనీ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) ప్రస్తుత విలువ రూ.31,450 కోట్లకు చేరుకుంది.

పసిడి బాండ్లపై 321% రిటర్నులు

గడిచిన రెండేళ్లలో బంగారం ధరలు భారీగా దూసుకెళ్లడంతో ప్రభుత్వ పసిడి బాండ్లలో పెట్టుబడులు పెట్టిన వారికి లాభాల పంట పండుతోంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఏడో విడతగా జారీ చేసిన గోల్డ్ బాండ్ల గడువు ఈ నెల 13తో ముగిసింది. ఈ బాండ్లను నగదీకరించుకునే వారికి చెల్లించే ధరను ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. యూనిట్ (గ్రాము)కు రూ.12,350గా నిర్ణయించింది. 2017 నవంబరు 13న జారీ చేసిన ఈ బాండ్ల యూనిట్ ధర రూ.2,934తో పోలిస్తే ఇన్వెస్టర్లకు 4 రెట్లకు పైగా (321%) ప్రతిఫలం లభించనుంది.

ఆఖర్లో లాభాల స్వీకరణ

ముంబై: స్టాక్ మార్కెట్లో మూడు రోజుల ర్యాలీకి తెరపడింది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో గురువారం ఇంట్రాడేలో 453 పాయింట్ల మేర పుంజుకున్న సెన్సెక్స్.. ఆఖర్లో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో కేవలం 12.16 పాయింట్ల వృద్ధితో 84,478.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 3.35 పాయింట్ల లాభంతో 25,879.15 వద్ద స్థిరపడింది. రియల్టీ సంస్థ వేలార్ ఎస్టేట్ లిమిటెడ్ నుంచి విడిపోయిన అడ్వెంట్ హోటల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్లను నమోదు చేసింది. బీఎస్ఈలో రూ.310 వద్ద నమోదైన అడ్వెంట్ హోటల్స్ షేరు.. ఆపై 5 శాతం వృద్ధితో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.325.45 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	600	విజయవాడ	600
వరంగల్	602	గోదావరి	610
చిత్తూరు	643	విశాఖపట్నం	595
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	111
వరంగల్	112	గుంటూరు	113
కరీంనగర్	112	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	114
కర్నూలు	112	నెల్లూరు	119
విశాఖపట్నం	110	అనంతపురం	119
గోదావరి	111		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,800 ▲	1,17,150 ▲	1,82,000 ▲
విజయవాడ	1,30,000 ▲	1,22,000 ▲	1,70,000 ▲
విశాఖపట్నం	1,30,580 ▲	1,15,350 ▲	1,82,000 ▲
రాజమండ్రి	1,28,620 ▲	1,17,900 ▲	1,66,000 ▲
ప్రొద్దుటూరు	1,26,400 ▲	1,16,290 ▲	1,67,500 ▲
ముంబై	1,26,554 ▲	1,15,923 ▲	1,62,730 ▲

స్టార్టప్‌ల కోసం రూ.100 కోట్ల నిధి

హైదరాబాద్ ఏంజెల్ ఫండ్

జెనరేటివ్ ఏఐ, గేమింగ్, స్పేస్ టెక్, డ్రోన్ల రంగాల్లో అత్యున్నత సామర్థ్యం గల స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి రూ.100 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు చేసినట్టు హైదరాబాద్ ఏంజెల్ ఫండ్ ప్రకటించింది. వర్ధమాన టెక్నాలజీలు, అధిక వృద్ధి అవకాశాలున్న 15-20 స్టార్టప్‌లలో ఈ సొమ్ము ఇన్వెస్ట్ చేయనున్నట్టు తెలిపింది. పైన పేర్కొన్న రంగాలతో పాటు కన్స్యూమర్ టెక్, ఫిన్‌టెక్, ఎంటర్‌ప్రైజ్ సాస్, సస్టెయినబులిటీ విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న స్టార్టప్‌లను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్టు పేర్కొంది.

జపాన్ కంపెనీ టైజిన్‌తో బయోవరం జట్టు

జపాన్‌కు చెందిన టైజిన్ కంపెనీ ఉత్పత్తులైన రీ జనరేటివ్ వైద్య ఉత్పత్తులు, ఇంప్లాంట్ చేయడానికి అనువైన వైద్య పరికరాల వినియోగంపై సహకారాన్ని విస్తరించుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ కంపెనీ బయోవరం ప్రకటించింది. యూఆర్ అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్స్ (యూఆర్ఏటీ) ప్రైవేట్ లిమిటెడ్‌కు బ్రాండ్‌నేమ్ బయోవరం. ఈ ఒప్పందం కింద టైజిన్‌కు చెందిన మెడికల్ డివైస్‌లు, రీజనరేటివ్ వైద్య ఉత్పత్తులు భారత మార్కెట్లో ప్రవేశపెడితే బయోవరం అడ్వాన్స్‌డ్ ఉత్పత్తులన్నింటినీ జపాన్ మార్కెట్లో ప్రవేశపెడతారు.

● ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీదారు రివర్ మొబిలిటీ.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా కాకినాడలో కొత్త స్టోర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో సంస్థకు ఇది ఆరో స్టోర్. ఈ స్టోర్‌లో కంపెనీ తన ఈవీ స్కూటర్ ఇండీ (ఎక్స్‌షోరూమ్ ధర రూ.1,47,999)ని విక్రయించనుంది.

● ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.148.70 కోట్ల స్టాండ్‌ఎలోన్ ఆదాయంపై రూ.1.45 కోట్ల లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.101.38 కోట్లుగా ఉండగా లాభం రూ.4.89 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో పటిష్ఠమైన రికవరీ కనబరచటంతో జూన్ త్రైమాసికంతో పోల్చితే లాభదాయకత పెరిగిందని పేర్కొంది. కాగా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.147.49 కోట్ల ఆదాయంపై రూ.2.02 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బిహార్ తీర్పు నేడే!

భారీ ఓటింగ్‌తో గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ఎన్డీయేవైపే ఎగ్జిట్ పోల్స్ మొగ్గు 2

విభేదిస్తున్న మహాగఠ్‌బంధన్

తమదే అధికారమంటున్న ఆర్జేడీ 12

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఎవరు?

మధ్యాహ్నం 12 గంటలకల్లా తుది ఫలితం

శుక్రవారం | 14-11-2025

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ



అడవి లోపల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కట్టిన భవంతి

అడవి తల్లికి 'పెద్దిరెడ్డి' పోటు!

మంగళంపేట రిజర్వ్ ఫారెస్ట్‌లో 32.63 ఎకరాలు దురాక్రమణ

ఉమ్మడి సర్వే బృందం నిర్ధారణ

స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ

అటవీ చట్ట ఉల్లంఘనపై నలుగురిపై కేసు..చార్జిషీట్

కోర్టు ఆదేశాలతో తదుపరి చర్యలు: పీసీసీఎఫ్

డిప్యూటీ సీఎం ఆదేశాలతో అటవీ భూముల వివరాలన్నీ వెబ్‌సైట్‌లో చేరుస్తామని వెల్లడి

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కబ్జాల దందా బయటపడింది. అటవీ భూములను కూడా ఆయన ఆక్రమించినట్లు స్పష్టమైంది. దానిని అటవీ శాఖ

మిగతా 10వ పేజీలో...

ఆరంభానికి ముందే అదిరింది!

ఒక రోజు ముందుగానే రూ.3,65,304 కోట్ల ఒప్పందాలు

సీఎం చంద్రబాబు సమక్షంలో సంతకాలు చేసిన 35 సంస్థలు

ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానం విశాఖ

అంచనాలకు మించి పెట్టుబడులు: చంద్రబాబు

నెలాఖరులోగా గూగుల్‌కు శంకుస్థాపన

త్వరలోనే టీసీఎస్, కాగ్నిజెంట్ కార్యకలాపాలు

ఏపీని 'కాలిఫోర్నియా ఆఫ్ ఈస్ట్'గా తీర్చిదిద్దుతాం: లోకేశ్



పెట్టుబడుల సదస్సు ప్రాంగణంలో సీఆర్డీయే స్టాల్, అమరావతి నమూనా

పెట్టుబడుల పండగ

నేడు, రేపు విశాఖలో పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు

ఉప రాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభం

గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తల హాజరు

పూర్తైన ఏర్పాట్లు.. 8 హాళ్లు సిద్ధం

ప్రధాన వేదికముందే ఎంవోయూల వేడుక

మరికొన్ని గంటల్లోనే రాష్ట్రంలో పెట్టుబడుల పండగ మొదలవుతోంది. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల మైదానాన్ని దీనికోసం సర్వాంగ సుందరంగా సిద్ధంచేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే పెట్టుబడుల వాతావరణాన్ని పునరుద్ధరించింది. వైసీపీ హయాంలో రాష్ట్రం వదిలిపోయిన సంస్థలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహంగా ముందుకొస్తున్నాయి. గూగుల్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థ డేటా సెంటరు ఏర్పాటుకు భారీ పెట్టుబడులతో ముందుకు రావడం గేమ్ చేంజర్‌గా మారింది. ఏడాదిన్నరగా సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ దేశ విదేశాల్లో పర్యటిస్తూ, సాగిస్తున్న పెట్టుబడుల వేట ఫలితంగా ఏపీ బ్రాండ్ తిరిగి నిలబడింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తొలిసారి పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు నిర్వహణకు సిద్ధమైంది. సదస్సు విజయవంతానికి ఏర్పాట్లు భారీ స్థాయిలో చేశారు.

10 11



సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలతో రెన్యూ పవర్ కంపెనీ ప్రతినిధులు

రెన్యూ పవర్ 82 వేల కోట్ల పెట్టుబడి!

ఇందులో రూ.22 వేల కోట్ల పెట్టుబడికి గతంలోనే ఓకే

మరో రూ.60 వేల కోట్లు పెట్టేందుకు 4 ఒప్పందాలు

పెట్టుబడులన్నీ పునరుత్పాదక ఇంధన రంగంలోనే..

గూగుల్ డేటా విద్యుత్ అవసరాలు తీర్చేందుకు సిద్ధం

సీఎంతో భేటీలో సంస్థ చైర్మన్ సుమంత్ సిన్హా వెల్లడి

ఏపీ అప్రోచ్ చాలా బాగుందని ప్రశంసలు

32 కార్లు.. 8 మానవ బాంబులు



హరియాణాలోని ఫరీదాబాద్ జిల్లా ఖాండావలిలో.. ఢిల్లీ ఘటనతో సంబంధముందని భావిస్తున్న కారు వద్ద ఫోరెన్సిక్ నిపుణులు

దేశంలో అతి భారీ విధ్వంసానికి ఉగ్రవాదుల కుట్ర

ఐఈడీల తయారీకి 26 క్వింటాళ్ల ఎరువులు కొనుగోలు

దేశంలో 8 చోట్ల ఏకకాలంలో దాడులకు ప్రణాళిక

రూ.20 లక్షలు సేకరించి ఉమర్ నబీకి అందజేత

టర్కీలో ఉకాసా అనే వ్యక్తితో తరచూ సంభాషణ

అరెస్టయిన డాక్టర్లంతా ఆత్మాహుతి బాంబర్లే!

అల్ ఫలాహ్ వర్సిటీ స్థాపకుడి అక్రమాలెన్నో..

న్యాక్ గుర్తింపే లేదు.. 'ఏ' గ్రేడ్ పేరిట ప్రచారం

న్యూఢిల్లీ, నవంబరు 13: దేశంలో కనీవినీ ఎరుగని స్థాయిలో విధ్వంసం సృష్టించేందుకు ఫరీదాబాద్ ఉగ్రవాద ముఠా ప్రణాళిక సిద్ధం చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు గుర్తించారు. ఏకంగా 32 కార్లలో బాంబులు అమర్చి, 8 ప్రధాన ప్రాంతాల్లో ఏకకాలంలో ఆత్మాహుతి దాడులు చేయాలని ఈ మాడ్యూల్ కుట్ర పన్నింది. ప్రధానంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లను లక్ష్యంగా ఎంచుకుంది. వీరి కుట్రకు హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ వేదిక అయ్యింది. ముఖ్యంగా యూనివర్సిటీ క్యాంపస్‌లోని 17వ భవనంలో ఉన్న బాయ్స్ హాస్టల్‌లోని 13వ నంబర్ గదిని ఉగ్ర స్థావరంగా మార్చుకున్నట్లు గుర్తించారు. ఈ ఉగ్రవాద వైద్యులు టర్కీలోని ఉకాసా అనే వ్యక్తితో తరచూ సంభాషించారు. ఆ ఉకాసా ఎవరన్నదానిపై దర్యాప్తు అధికారులు

మిగతా 2వ పేజీలో...

'పోస్టర్' లాగితే ఉగ్రకుట్ర భగ్నం!

పోస్టర్‌పై రాతల ఆధారంగా దర్యాప్తు.. సీసీ కెమెరాల జల్లెడ

హరియాణా, యూపీ పోలీసుల సాయంతో సోదాలు

కశ్మీర్‌లో ఉగ్ర కుట్ర భగ్నంలో తెలుగు అధికారి కీలకపాత్ర

దేశమంతా మార్మోగుతున్న కర్నూలు వాసి చక్రవర్తి పేరు



12

హౌసింగ్ స్కాంలో ఎస్‌ఎల్‌బీసీ కాంట్రాక్టర్ అరెస్టు


మనోజ్ గౌర్

న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ ప్రాజెక్టుల్లో వేల కోట్ల మనీలాండరింగ్ కుంభకోణానికి సంబంధించి జేపీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఎండీ మనోజ్‌గౌర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం అరెస్టు చేసింది. తెలంగాణలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కాంట్రాక్టు పనులను ఇదే మనోజ్‌గౌర్‌కు చెందిన జేపీ గ్రూపు కంపెనీ చేపట్టింది. ఇటీవల ఆ టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో పలువురు కార్మికులు మరణించిన సంగతి తెలిసిందే. గౌర్ నేతృత్వంలోని జేపీ ఇన్‌ఫ్రా సంస్థ ఢిల్లీ, హర్యానాలో జేపీ విష్‌టౌన్, జేపీ గ్రీన్స్ పేరిట పలు హౌసింగ్ ప్రాజెక్టులు ప్రారంభించి వేలాది మంది కొనుగోలుదారుల నుంచి వందల కోట్లను వసూలు చేసింది. ఆ నిధులను గృహ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఉపయోగించకుండా, వాటిని వివిధ ట్రస్టులు, అనుబంధ సంస్థలకు మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. హౌసింగ్ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయకపోవడం, ఫ్లాట్లను అప్పగించకపోవడంతో మోసపోయిన వేలాది మంది పెట్టుబడిదారులు ఢిల్లీ, యూపీలలోని ఆర్థిక నేరాల విభాగం వద్ద అనేక కేసులు నమోదు చేశారు. వాటి ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ జేపీ గ్రూపునకు చెందిన రెండు సంస్థలు జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్), జేపీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ (జేఐఎల్) గృహ కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన రూ. 14,599 కోట్ల భారీ మొత్తాన్ని జేపీ సేవా సంస్థాన్ (జేఎస్ఎస్), జేపీ హెల్త్‌కేర్ లిమిటెడ్ (జేహెచ్ఎల్), జేపీ స్పోర్ట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (జేఎస్ఐఎల్) వంటి అనుబంధ సంస్థలకు మళ్లించినట్లు గుర్తించింది. మే 23న ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ముంబైలోని సంస్థ కార్యాలయాల్లో సోదాలు చేసిన ఈడీ భారీ మొత్తంలో ఆర్థిక పత్రాలు, డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకుంది. నిధుల మళ్లింపులో గౌర్ కీలక పాత్ర పోషించినట్లు నిర్ధారించింది.

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడే

పట్నా, నవంబరు 13: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. ఈవీఎంల్లో ఓటర్లు నిక్షిప్తం చేసిన తీర్పు శుక్రవారం వెలువడనుంది. 243 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీగా 67.13% పోలింగ్ నమోదైంది. 2020 ఎన్నికల్లో 57.29 శాతం ఓటింగ్ జరిగింది. దరిదాపుగా పది శాతం అధికంగా పోలింగ్ నమోదు కావడంతో.. విజయంపై పాలక ఎన్‌డీఏ, విపక్ష మహాగఠ్‌బంధన్ ధీమాతో ఉన్నాయి. సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్‌డీఏదే మళ్లీ గెలుపని ఎగ్జిట్ పోల్ సర్వేలు పేర్కొన్నాయి. ప్రతిపక్షాలు మాత్రం తోసిపుచ్చుతున్నాయి. 2,616 మంది అభ్యర్థులు పోటీచేయగా.. సుమారు 7.45 కోట్ల మంది ఓటర్లలో 67.13 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

తులం బంగారం @ 1.3 లక్షలు

న్యూఢిల్లీ, నవ ంబర్ 13: బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకున్నాయి. గురువారం ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఒక్క రోజులోనే రూ. 3వేలకు పెరిగి రూ. 1,30,900 మార్కును దాటింది. వెండి కిలోకు రూ. 7,700 పెరిగి ఏకంగా లక్షా 69వేల రూపాయలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 4,236 డాలర్లు, వెండి ఔన్సు 54.41 డాలర్లకు ఎగబాకడంతో ఆ ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపించింది. దీంతో, పదిహేను రోజుల క్రితం లక్షా 22వేల దిగువకు పడిపోయిన బంగారం ధర మళ్లీ క్రమంగా పెరుగుతూ వస్తోంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల ఒక గ్రాము పసిడి ధర రూ. 12,780కు చేరగా, 18 క్యారెట్ల బంగారం ధర రూ. 9,585 పలుకుతోంది. అమెరికాలో 40రోజులకు పైగా కొనసాగిన షట్‌డౌన్ ముగియడంతో పాటు అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలహీనపడటం వంటి అంశాలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచి.. బంగారం, వెండి ధరల ర్యాలీకి కారణమయ్యాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

వలస డ్రైవర్లపై అమెరికా వేటు

వాషింగ్టన్, నవంబరు 13: వలస డ్రైవర్ల విషయంలో అమెరికా కఠిన వైఖరి ప్రదర్శిస్తోంది. వలస డ్రైవర్లలో ఏకంగా 17వేలమందికి చెందిన కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్సులను రద్దుచేయాలని యోచిస్తున్నట్టు కాలిఫోర్నియా ప్రకటించింది. రహదారులపై భారీ వాహనాలు నడిపే వలస డ్రైవర్ల సంఖ్య పెరిగిపోతోందని, వారిలో చాలామంది అక్రమమార్గాల్లో లైసెన్సులు పొందారంటూ ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలోనే కాలిఫోర్నియా ఈ నిర్ణయానికి వచ్చినట్టు వార్తలు వస్తున్నాయి. అమెరికాలో వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో అక్కడి వలస డ్రైవర్ల విషయంలో ట్రంప్ ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. వారిలో అక్రమంగా దేశంలోకి ప్రవేశించినవారిని గుర్తించేందుకు ఇటీవలే జాతీయస్థాయిలో ఆడిట్ మొదలుపెట్టింది. ఒక అంచనా ప్రకారం అమెరికాలో ప్రస్తుతం 2లక్షల మంది వలస డ్రైవర్లు ఉండగా, కొత్త నిబంధనల ప్రకారం వారిలో పది వేలమందే అర్హులుగా తేలే అవకాశం ఉంది.

మావాళ్లకు శిక్షణ ఇచ్చి మీ దేశానికి వెళ్లిపోండి!

» అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వ్యాఖ్యలు

న్యూయార్క్/ వాషింగ్టన్, నవంబరు 13: అమెరికన్లకు శిక్షణ ఇచ్చి స్వదేశానికి తిరిగి వెళ్లిపోయే నిపుణులైన విదేశీ కార్మికులను తీసుకురావడమే హెచ్-1బీ వీసా విషయంలో కొత్త విధానమని ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెట్ అన్నారు. అమెరికాలో తగినంత మంది ప్రతిభావంతులు లేరని, వివిధ విభాగాల్లో పనిచేసేందుకు నిపుణులైన విదేశీ ఉద్యోగులను తీసుకురావాల్సిన అవసరం ఉందని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు స్పష్టతనిచ్చారు. "అమెరికన్ కార్మికులకు శిక్షణ ఇవ్వడానికి మూడేళ్లు, ఐదేళ్లు, ఏడేళ్ల సమయం పట్టినా సరే.. శిక్షణ పూర్తయిన తర్వాత వారు స్వదేశానికి వెళ్లిపోవచ్చు. ఆ ఉద్యోగ బాధ్యతలను అమెరికన్లు చేపడతారు" అని ఆయన పేర్కొన్నారు. తగిన శిక్షణ లేకుండా కీలక స్థానాల్లో అమెరికన్లను నియమించలేమన్నారు.

అమెరికాలో ముగిసిన 43 రోజుల షట్‌డౌన్

వాషింగ్టన్, నవంబరు 13: అమెరికాలో రికార్డు స్థాయిలో 43 రోజుల పాటు కొనసాగిన సుదీర్ఘ షట్‌డౌన్‌కు ముగింపు పలుకుతూ ప్రభుత్వ ఫండింగ్ బిల్లుపై అధ్యక్షుడు ట్రంప్ బుధవారం రాత్రి సంతకం చేశారు. అంతకుముందు షట్‌డౌన్ ఎత్తివేతకు సంబంధించిన బిల్లును ప్రతినిధుల సభ ఆమోదించింది. 222-209 ఓట్ల తేడాతో ఈ బిల్లు ఆమోదం పొందింది. షట్‌డౌన్‌ను ముగించేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సెనేట్ ఇంతకుముందే ఆమోదించింది. తాజా బిల్లు వచ్చే ఏడాది జనవరి 30 వరకూ నిధులను పొడిగించనుంది. షట్‌డౌన్ మొదలైన తర్వాత ఉద్యోగాలు కోల్పోయిన ఫెడరల్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం, వారికి జీతాలు చెల్లించడం వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నాయి.

పాక్ త్రివిధ దళాధిపతిగా ఆసిం మునీర్

ఇస్లామాబాద్, నవంబరు 13: తమ దేశ ఆర్మీ చీఫ్ అధికారాల విస్తరణకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పాకిస్థాన్ పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు పార్లమెంట్‌లోని దిగువసభ మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మెజారిటీతో బుధవారం నాడు ఆమోదం తెలిపింది. కేవలం నలుగురు సభ్యులు మాత్రమే బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. ఇది ప్రజాస్వామ్యానికి హాని అంటూ ఆ సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి బాయ్‌కాట్ చేశారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యక్షుడి సంతకంతో అది చట్ట రూపం దాల్చనుంది. దీంతో ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎఫ్)గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇకపై నౌకా దళం, వాయుసేన కూడా ఆయన ఆధీనంలో ఉంటాయి. ఈ రాజ్యాంగ సవరణతో సుప్రీంకోర్టుకు ఉన్న అధికారాలకు అడ్డుకట్టపడింది. రాజ్యాంగ కేసులకు సంబంధించిన విచారణకు కొత్తగా ఫెడరల్ కాన్‌స్టిట్యూషనల్ కోర్టును ఏర్పాటు చేయనున్నారు.

2 కంటెయినర్ల మధ్య కారు నుజ్జు..8 మంది మృతి

పుణె, నవంబరు 13: పుణెలో రెండు భారీ కంటెయినర్ల మధ్య కారు ఇరుకున్న దుర్ఘటనలో ఎనిమిది మంది మరణించగా, 15 మంది గాయపడ్డారు. గురువారం స్థానిక నవాలే వంతెన వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెనక నుంచి వస్తున్న కంటెయినర్ అదుపు తప్పి ముందున్న పలు వాహనాలను ఢీకొట్టింది. అనంతరం కారును, దాని ముందున్న మరో కంటెయినర్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో మధ్యలో ఉన్న కారు నలిగిపోగా, దాని ముందున్న కంటెయినర్ బాగా దెబ్బతిని మంటలు వ్యాపించాయి.

8 మానవ బాంబులు
32 కార్లు..

(మొదటి పేజీ తరువాయి)

దృష్టి సారించారు. హ్యాండ్లర్‌తోపాటు ఈ ముఠా సభ్యులు పరస్పరం సంభాషించుకునేందుకు స్విట్జర్లాండ్‌కు చెంది న త్రీమా యాప్‌ను ఉపయోగించినట్లు గుర్తించారు. కాగా, సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడిలో మృతుల సంఖ్య13కు చేరిం ది. ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో గురువారం ఒకరు మరణించాడు.


గురువారం పుల్వామాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భద్రతా బలగాలు

బాంబుల కోసం 26 క్వింటాళ్ల ఎరువు

ఫరీదాబాద్ ఉగ్రవాదులు మహా విధ్వంసానికే కుట్ర పన్నారు. 8 మంది నాలుగు గ్రూపులుగా విడిపోయి, ఏక కాలంలో 32 కార్లలో బాంబులు అమర్చి పేల్చివేయాలని ప్రణాళిక వేశారు. అందుకోసం మొత్తం పాత కార్లనే కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే నాలుగు కార్లను సమకూర్చుకున్నారు. ఎర్రకోట వద్ద పేలింది అందులో ఒకటే. ఎరుపు రంగు ఎకోస్పోర్ట్ కారును బుధవారం హరియాణాలోని ఓ గ్రామంలో స్వాధీనం చేసుకున్నారు. అందులో నిద్రిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ముజమ్మిల్ వాడిన బ్రెజా (హెచ్ఆర్87 యూ9988) కారును యూనివర్సిటీ క్యాంపస్‌లో కనుగొన్నారు. డాక్టర్ షహీన్ సయీద్ వాడిన స్విఫ్ట్ డిజైర్ కారును గతంలోనే స్వాధీనం చేసుకోగా, అందులో ఓ అసాల్ట్ రైఫిల్ లభించింది. ఈ కార్లలో అమర్చేందుకు ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్ (ఐఈడీ) బాంబులను తయారు చేసేందుకు రూ.3 లక్షలతో గురుగ్రామ్, నూహ్ తదితర చోట్ల నుంచి 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఎరువులను కొనుగోలు చేసినట్లు తేలింది. బాంబుల తయారీ, దాడుల కోసం డాక్టర్ ముజమ్మిల్, డాక్టర్ అదీల్, డాక్టర్ షహీన్ సయీద్, డాక్టర్ ఉమర్ నబీ కలిసి రూ.20 లక్షలు సేకరించి, ఆ డబ్బును నబీ వద్ద దాచినట్లు గుర్తించారు. ఎర్రకోట బాంబు దాడిలో అతడు కూడా మర ణించిన విషయం తెలిసిందే. ఈ డబ్బు విషయంలో ముజమ్మిల్, ఉమర్ మధ్య అభిప్రాయ బేధాలు వచ్చినట్లు కూడా అధికారుల విచారణలో తేలింది. అరెస్టయిన డాక్టర్లంతా ఆత్మాహుతి బాంబర్లుగా మారాలని నిర్ణయించుకున్నట్లు గుర్తించారు.

అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో

జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పోస్టర్లు వేసి దొరికిపోయిన ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్ వెనుక అత్యంత ప్రమాదకరమైన అంతర్జాతీయ ఉగ్ర నెట్‌వర్క్ ఉన్నట్లు భారత దర్యాప్తు, నిఘా వర్గాలు గుర్తించాయి. మొదట ఈ మాడ్యూల్‌ను తేలిగ్గా తీసుకున్న పోలీసులు.. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడి తర్వాత లోతుగా శోధిస్తుండటంతో నిఘా వర్గాలే ఉలిక్కిపడే కుట్ర బయటపడుతోంది. టర్కీలో తిష్ట వేసిన పాకిస్థాన్ జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ నాయకులు.. అక్కడి నుంచి ఫరీదాబాద్ మాడ్యూల్‌ను నడిపించినట్లు గుర్తించారు. ముఖ్యంగా ఉకాసా అనే పేరుతో ఉన్న వ్యక్తి ఈ మాడ్యూల్‌కు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చినట్లు తేలింది. అరబ్బీలో ఉకాసా అంటే సాలీడు అని అర్థం. ఢిల్లీలో ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీతోపాటు ఈ వైద్యుల ముఠాను తయారుచేసిన జమ్ముకశ్మీర్‌కు చెందిన ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ గతంలో టర్కీలో రెండువారాలు ఉండి వచ్చినట్లు గుర్తించారు. వారు ఉకాసాను కలిసి ఉంటారన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

రూమ్ నంబర్ 13.. ఉగ్రడెన్

హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీలో జరుపుతున్న సోదాల్లో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దాదాపు 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ వర్సిటీని ఉగ్రవాదులు తమ డెన్‌గా మార్చుకున్నట్లు తేలింది. ముఖ్యంగా 17వ భవనంలో ఉన్న బాయ్స్ హాస్టల్‌లో 13వ నంబర్ గది ఉగ్ర స్థావరంగా మారింది. పోలీసులు అరెస్టు చేసిన డాక్టర్ ముజమ్మిల్ ఆ గదిలో ఉండేవాడని గుర్తించారు. ఈ ఉగ్రముఠా మొత్తం ఈ గదిలోనే తరచూ సమావేశమై దాడులకు ప్రణాళిక రూపొందించినట్లు తేలింది. ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీ ఇదే హాస్టల్‌లో 4వ నంబర్ గదిలో ఉండేవాడని, ఆ గ దిలో కూడా ఈ ఉగ్ర డాక్టర్లు సమావేశం అయ్యేవారని పోలీసులు తెలిపారు. క్యాంపస్‌లో ఇంకా ఎవరెవరు ఈ ముఠాలో సభ్యులుగా చేరారన్నదానిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు అరెస్టు చేసిన మహిళా ఉగ్రవాది, అల్ ఫలాహ్ వర్సిటీ మెడికల్ కాలేజీ డాక్టర్ షహీన్‌కు పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు స్పష్టమైంది.

అల్ ఫలాహ్ వర్సిటీ స్థాపకుడి అక్రమాలెన్నో..

దేశవ్యాప్తంగా భారీగా పేలుళ్లకు కుట్ర పన్నిన ఉగ్ర వైద్యులకు అడ్డాగా మారిన అల్ ఫలాహ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు జావేద్ అహ్మద్ సిద్ధిఖీ అక్రమాలు బయటికి వస్తున్నాయి. భారీగా లాభాలు వస్తాయంటూ రూ.7.5 కోట్లు డిపాజిట్లు సేకరించి, మోసం చేసిన కేసులో ఆయన మూడేళ్లు జైలుకు వెళ్లిన అంశం చర్చనీయాంశంగా మారింది. అల్ ఫలాహ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి.. ఆ సొమ్మును వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించారు సిద్ధిఖీ. దీనిపై నమోదైన కేసులో 2001 మార్చిలో అతడు అరెస్టయ్యారు. బాధితులకు సొమ్ము తిరిగిస్తానని ఢిల్లీ హైకోర్టుకు హామీ ఇవ్వడంతో 2004 ఫిబ్రవరిలో బెయిల్‌పై విడుదలయ్యారు. డిపాజిట్ల సేకరణ వ్యవహారంపై ఈడీ కూడా దర్యాప్తు చేపట్టింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా అంబేద్కర్ నగర్‌కు చెందిన సిద్ధిఖీ.. అల్ ఫలాహ్ చారిటబుల్ ట్రస్టు కింద తొమ్మిది సంస్థలను స్థాపించారు. ఇవన్నీ కూడా ఢిల్లీలోని జామియా నగర్‌లో అల్ ఫలాహ్ హౌజ్ పేరిట ఉన్న ఒకే భవనం చిరునామాతో రిజిస్టర్ చేశారు. ఇందులో యూనివర్సిటీ తప్ప మిగతా సంస్థలన్నీ 2019 ఏడాది వరకే కొనసాగాయి. తర్వాత కొన్నింటిని మూసేయగా, మరికొన్నింటిని పక్కనపెట్టేశారు. ఇదిలా ఉండగా, అల్ ఫలాహ్ ప్రైవేటు యూనివర్సిటీకి 'న్యాక్ (జాతీయ మదింపు, గుర్తింపు మండలి)' నోటీసులు జారీ చేసింది. వర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్, ఉపాధ్యాయ విద్య కాలేజీలకు న్యాక్ నుంచి ఎలాంటి గుర్తింపు లేకున్నా.. న్యాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు ఉన్నట్టుగా వెబ్‌సైట్లో పేర్కొన్నారని వెల్లడించింది.

లోకం తీరు



1000 అడుగుల దూరం ఎగిరిపడిన చేయి

ఎర్రకోట వద్ద బాంబు పేలుడు ధాటికి కొందరి శరీరాలు తునాతునకలైపోయాయి. అందులో ఒకరి చేయి భాగం పేలుడు జరిగిన ప్రాంతానికి సుమారు 1000 అడుగుల దూరంలోని ఓ షాపు పైభాగంలో గురువారం లభ్యమైంది. వేళ్ల నుంచి మోచేతి కింద వరకు ఉన్న ఈ చేయి భాగాన్ని సేకరించిన పోలీసులు.. డీఎన్ఏ పరీక్షల కోసం ఫోరెన్సిక్ నిపుణులకు పంపించారు. ఇంకా ఏమైనా అవశేషాలు ఉన్నాయా అన్నదానిపై పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నారు. కాగా, పేలుడు జరిగిన ప్రాంతంలో సేకరించిన పలు శరీర భాగాల డీఎన్ఏ ఉగ్ర వైద్యుడు ఉమర్ నబీ తల్లి డీఎన్ఏ శాంపిళ్లతో సరిపోలాయని.. దీనితో ఆ కారును నడుపుతున్నది అతడేనని కచ్చితంగా తేలిందని పోలీసు వర్గాలు గురువారం వెల్లడించాయి.

మరో వైద్య విద్యార్థి అరెస్టు

ఫరీదాబాద్ ముఠాతో సంబంధం ఉన్న మరో వైద్య విద్యార్థిని ఉత్తరప్రదేశ్ ఏటీఎస్ పోలీసులు కాన్పూర్‌లో అరెస్టు చేశారు. ప్రభుత్వం నడుపుతున్న గణేశ్ శంకర్ విద్యార్థి మెమోరియల్ మెడికల్ కాలేజీలో కార్డియాలజీ ఫస్టియర్ చదువుతున్న డాక్టర్ మొహమ్మద్ ఆరిఫ్ (32)ను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. జీఎస్ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫరూక్ ను కూడా అరెస్టు చేశారు. పరారీలో ఉన్న జమ్ముకశ్మీర్‌కు చెందిన మరో వైద్యుడు ముజఫర్ ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ఇంటర్‌పోల్ సహాయం కోరారు. కాగా, ఢిల్లీ బాంబు దాడిని సమర్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన 15మందిని అసోం పోలీసులు అరెస్టు చేశారు. బాంబు దాడి నేపథ్యంలో తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎర్రకోట మెట్రో రైల్ స్టేషన్‌ను మూసి ఉంచుతున్నట్లు ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ ప్రకటించింది. అల్ ఫలాహ్ వర్సిటీ ఆర్థిక లావాదేవీలపై ఈడీని కేంద్రం ఆదేశించింది.

ఏసీబీకి చిక్కిన ముంబై జడ్జి, కోర్టు క్లర్క్

» అనుకూల తీర్పునిచ్చేందుకు ముంబైలోని సివిల్ సెషన్స్ కోర్టు అదనపు న్యాయాధికారి రూ.25 లక్షల లంచం డిమాండ్

» అతని తరఫున కోర్టు క్లర్క్ వసూళ్లు.. 15 లక్షలకు బేరం

ముంబై, నవంబరు 13: ఓ భూవివాద కేసులో అనుకూల తీర్పునిచ్చేందుకు బాధితుడి నుంచి లంచం తీసుకున్న వ్యవహారంలో మజగావ్ సివిల్, సెషన్స్ కోర్టు అదనపు జడ్జి ఎజాజుద్దీన్ సలావుద్దీన్ కాజీతో పాటు కోర్టు క్లర్క్ చంద్రకాంత్ వాసుదేవ్‌పై ఏసీబీ కేసులు నమోదు చేసింది. రూ.15 లక్షలు లంచం తీసుకుంటుండగా వాసుదేవ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడగా.. జడ్జిని కూడా నిందితుడిగా చేర్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఓ కంపెనీ యాజమాన్యం తమ భూమిని ఆక్రమించిందని ఆరోపిస్తూ ఫిర్యాదుదారుడి భార్య 2015లో బాంబే హైకోర్టును ఆశ్రయించింది. 2016లో ఈ వివాదాస్పద భూమిపై థర్డ్ పార్టీ హక్కుల సృష్టిని నిరోధిస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ భూమి విలువ రూ.10 కోట్ల కంటే తక్కువ ఉండటంతో 2024లో కేసును మజగావ్‌లోని సివిల్ కోర్టుకు వాణిజ్య దావాగా బదిలీ చేసింది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది సెప్టెంబరు 9న ఫిర్యాదుదారుడు కేసు విచారణకు హాజరైనప్పుడు.. కోర్టు క్లర్క్ వాసుదేవ్ తనని కలవమని చెప్పాడు. అనుకూల తీర్పునిచ్చేందుకు జడ్జికి రూ.15 లక్షలు, తనకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇది ఇష్టం లేని ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈనెల 11న ఫిర్యాదుదారుడి నుంచి వాసుదేవ్ రూ.15 లక్షలు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

డబ్బులిచ్చి మనుషుల్ని వేటాడారు!

బోస్నియాలో ఇటాలియన్ సంపన్నుల వారాంతపు స్నైపర్ టూరిజం

» 1992-95 నడుమ నాలుగేళ్లపాటు సాగిన దారుణ మారణకాండ


సారయేవోలో 1995 ఏప్రిల్ 20న స్నైపర్ల నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు పరుగెత్తుతున్న పిల్లలు

మిలాన్, నవంబరు 13: చుట్టూ కొండలు.. మధ్యలో ఊరు! కొండల మధ్యన రైఫిళ్లతో మాటువేసిన స్నైపర్లు. గుక్కెడు మంచినీళ్లు తెచ్చుకోవాలన్నా.. బుక్కెడు బువ్వ కోసం పనికి వెళ్లాలన్నా.. రోడ్డుమీదకు వెళ్లాల్సిందే! కానీ.. అలా వెళ్తే ఏ పక్క నుంచి ఏ రైఫిల్ తూటా వచ్చి ఒంట్లో దిగబడుతుందో తెలియదు. 1992లో యుగోస్లావియా నుంచి బోస్నియా స్వతంత్ర దేశంగా విడివడ్డ తర్వాత.. ఆ దేశ రాజధాని సారయేవోలో ప్రజలు అనుభవించిన నరకం ఇది! బోస్నియా అలా స్వతంత్ర దేశంగా ఏర్పడడాన్ని జీర్ణించుకోలేని ఆర్థోడాక్స్ సెర్బులు.. సారయేవో నగరాన్ని 1425 రోజులపాటు(దాదాపు 4 సంవత్సరాలపాటు) ముట్టడించి ఆ నగరంలోని ప్రజలపై సాగించిన దారుణ నరమేధమిది! ఇంకా దారుణం ఏంటంటే.. సారయేవో ప్రజలపై సెర్బులు సాగించిన మారణకాండలో ఇటలీకి చెందిన అత్యంత సంపన్నులు కూడా పాలుపంచుకున్నారని ఇటీవల వెల్లడైంది. బోస్నియన్లను స్నైపర్లతో కాల్చి చంపే అవకాశం కోసం వారు పెద్ద ఎత్తున డబ్బులు కూడా ముట్టజెప్పేవారని(ఇలా వెళ్లడాన్ని స్నైపర్ టూరిజంగా వ్యవహరించేవారు), సరదా కోసం వారాంతాల్లో మనుషులను వేటాడేవారని ఎజియో గవజెనీ అనే పాత్రికేయుడి ఫిర్యాదు మేరకు.. ఇటలీలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం దీనిపై తాజాగా దర్యాప్తు చేపట్టింది. ఇటాలియన్లతోపాటు.. అమెరికా, రష్యా ఇతర దేశాలకు చెందిన ధనవంతులు కూడా ఈ అకృత్యానికి పాల్పడేవారని సమాచారం. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడ్డ సోషలిస్ట్ ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ యుగోస్లావియా నుంచి.. 1992మార్చిలో బోస్నియా-హెర్జెగోవినా స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. అయితే, బోస్నియాలోని ఆర్థొడాక్స్ క్రిస్టియన్ సెర్బులు దీన్ని వ్యతిరేకించారు. బోస్నియా ఉంటే యుగోస్లావియాలో ఉండాలి లేదా సెర్బియాలో కలవాలి అని కోరుకున్నారు. రాడోవాన్ కరాడ్జిచ్ నేతృత్వంలో 1992 ఏప్రిల్ 5న సారయేవోను ముట్టడించారు. నగరం చుట్టూ ఉన్న కొండల్లో మాటువేసి పౌరులపై స్నైపర్‌తో కాల్పులు జరిపేవారు. ఆ నగరానికి విద్యుత్తు, నీరు, ఆహారం అందకుండా చేశారు. దీంతో సారయేవో పౌరల జీవితం నరకప్రాయమైంది. తిండి కోసమో, పనికోసమో బయటకు వెళ్లాలంటే.. నగరంలోని రెండు ప్రధాన రహదారుల గుండా వెళ్లాల్సి వచ్చేది. వాటిలో ఒకటి డ్రాగన్ ఆఫ్ బోస్నియా స్ట్రీట్.. రెండోది మోసా సెలిమోవిక్ బొలివర్డ్. దీంతో.. సెర్బు స్నైపర్లు ఈ వీధులనే లక్ష్యంగా చేసుకుని మాటువేసేవారు. వాటి గుండా వెళ్లే పౌరులను.. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా తమ గురికి చిక్కే ప్రతి ఒక్కరినీ తూటాలు దింపి చంపేసేవారు. ఆ వీధుల్లో వెళ్లాలంటే పౌరులు ఐక్యరాజ్యసమితి వాహనాలు వచ్చేదాకా ఆగి.. వాటి వెనుక నక్కినక్కి వెళ్లేవారు. నాలుగేళ్లపాటు ఆ నరకప్రాయమైన జీవితాన్ని గడిపారు. ఇలా వెళ్లే వారిని చంపడానికే ఇటాలియన్ సంపన్నులు పెద్ద ఎత్తున (ఇప్పటి లెక్కల ప్రకారమైతే.. రూ.కోటి దాకా) డబ్బులిచ్చి మరీ అక్కడికి వెళ్లేవారు. అక్కడికెళ్లాక.. చిన్నారులను చంపడానికి ఈ సంపన్నులు ఎక్కువ మొత్తంలో డబ్బు చెల్లించేవారని.. వృద్ధులను ఉచితంగా కాల్చేందుకు సెర్బులు అనుమతించేవారని చెబుతారు. బోస్నియాకు చెందిన సైనిక నిఘా అధికారి ఒకరు ఇటీవలే ఈ మేరకు సాక్ష్యం ఇచ్చారు. నిజానికి ఆ అధికారి ఆ విషయాన్ని 1994 మొదట్లోనే ఇటలీ సైనిక నిఘా అధికారులకు తెలపగా.. ఇటలీ సైన్యం స్నైపర్ టూరిజానికి చెక్ పెట్టింది. కాగా.. సారయేవో ముట్టడిలో 11,500 మందికిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అందులో 1600 మందికి పైగా పిల్లలున్నారు. ఎట్టకేలకు 1995 చివర్లో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఆధ్వర్యంలో కుదిరిన డేటన్ శాంతి ఒప్పందం ద్వారా సారయేవో ముట్టడికి తెరపడింది.

మాస్కులేం సరిపోతాయ్?

» ఢిల్లీలో కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన



న్యూఢిల్లీ, నవంబరు 13 : దేశ రాజధాని న్యూఢిల్లీలోని వాయు కాలుష్యం తీవ్రతపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో నెలకొన్న కాలుష్య తీవ్రతకు ముఖానికి మాస్కులు ధరించినా ఫలితం ఉండదని, సీనియర్ న్యాయవాదులు కేసుల విచారణలకు వ ర్చువల్‌గా హాజరు కావాలని సూచించింది. ఢిల్లీలో వా యు కాలుష్యం తీవ్ర ఆందోళనకరంగా ఉందన్న అత్యున్నత న్యాయస్థానం.. వీడియో కాన్ఫరెన్స్ విధానం అందుబాటులో ఉన్నప్పటికీ సీనియర్ న్యాయవాదులు స్వయం గా విచారణలకు ఎందుకు హాజరవుతున్నారని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ సీనియర్ న్యాయవాదులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఢిల్లీలోని కాలుష్యం శాశ్వత నష్టాన్ని కలిగిస్తుంది. విచారణలకు వర్చువల్‌గా హాజరయ్యే విధానం మనకు ఉంది కదా. కాలుష్యంపై ప్రధాన న్యాయమూర్తితోనూ చర్చిద్దాం' అని జస్టిస్ పీఎస్ నరసింహ వ్యాఖ్యానించారు.

రాత్రిపూట కౌంటింగ్ కేంద్రంలోకి.. ఈవీఎం పెట్టెల లారీ!

» బిహార్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ముందు కలకలం

» ఈవీఎంలు మార్చేందుకేనంటూ ఆర్జేడీ ఆందోళన

పట్నా, నవంబరు 13: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముందు 'ఓట్ చోరీ' అంశం మరోసారి మంటలు పుట్టించింది. ఆ రాష్ట్రంలోని చెనారి అసెంబ్లీ నియోజకవర్గంలోని ససారాంలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం ఉన్న ప్రాంగణంలోకి బుధవారం రాత్రి పెద్ద సంఖ్యలో ఇనుప పెట్టెలున్న లారీ ప్రవేశించడం కలకలం రేపింది. ఈవీఎంలను మార్చి ఓటు చోరీకి పాల్పడేందుకే లారీలో ఈవీఎంలను తెచ్చారని ఆర్జేడీ శ్రేణులు బుధవారం అర్ధరాత్రి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. స్ట్రాంగ్ రూమ్ లోపల, బయట సీసీ కెమెరాలను ఆఫ్ చేశారని ఆరోపించాయి. పలువురు ఆర్జేడీ ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా అక్కడికి చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి చేసి, అందరినీ చెదరగొట్టారు. అయితే కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చిన లారీలో ఉన్నవి ఖాళీ పెట్టెలని.. కౌంటింగ్ తర్వాత ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని తరలించేందుకు తీసుకువచ్చారని జిల్లా ఎన్నికల అధికారి ఉదితా సింగ్ ప్రకటించారు. అధికారులు ఆ లారీలోని పెట్టెలన్నింటినీ అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో తెరిచి చూపించారని వెల్లడించారు. సీసీ కెమెరాలేవీ నిలిపివేయలేదని, పూర్తి ఫుటేజీ ఉందని తెలిపారు. కాగా, ససారాం గొడవ నేపథ్యంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ చెనారి అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి లలిత్ భూషణ్‌ను ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ రాష్ట్ర ఎన్నికల అధికారి వినోద్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు.

పార్టీ ఫిరాయించిన బెంగాల్ ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు

» గెలిచిన నెలకే బీజేపీ నుంచి టీఎంసీలోకి ముకుల్ రాయ్



కోల్‌కతా, నవంబరు 13: బీజేపీ టిక్కెట్‌పై గెలిచి తృణమూల్ కాంగ్రెస్‌లోకి మారిన సీనియర్ నాయకుడు ముకుల్ రాయ్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ గురువారం కలకత్తా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఫిరాయింపుల నిషేధం చట్టం కింద నిర్ణయాన్ని వెలువరించింది. ఈ కారణంగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కృష్ణనగర్ (ఉత్తర) స్థానం ఖాళీ అయింది. అయితే ఉప ఎన్నికలు జరిగే అవకాశాలు మాత్రం లేవు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండమే ఇందుకు కారణం. 2021 మే నెలలో బీజేపీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన కొద్ది సమయంలోనే అంటే.. జూన్ నెలలో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. ముకుల్‌పై అనర్హత వేటు వేయాలని బీజేపీకి చెందిన ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి స్పీకర్ బిమన్ బెనర్జీని కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించలేదు. దాంతో సువేందు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ధర్మాసనం స్పీకర్‌కు మరో అవకాశం కల్పించింది. అయినా స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ముకుల్ రాయ్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది. హైకోర్టు తనకు సంక్రమించిన రాజ్యాంగపర అధికారాలను ఉపయోగించుకొని ఫిరాయింపుల నిషేధం చట్టం కింద ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించడం ఇదే తొలిసారి అని సువేందు అధికారి తరఫు న్యాయవాది బిల్వదళ బెనర్జీ చెప్పారు. తీర్పుపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందిస్తూ ఇది రాజ్యాంగ విజయమని అన్నారు.



విశేష అలంకరణలో సత్యసాయి మహాసమాధి

సత్యసాయి శతజయంతి వేడుకలు ప్రారంభం

▸ ప్రశాంతి నిలయంలో ప్రత్యేక కార్యక్రమాలు



సత్యసాయి చిత్రపటానికి హారతి ఇస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల వేద పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. వేలాదిమంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో పాల్గొంటున్న భక్తులకు నారాయణ సేవను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ప్రారంభించారు. నారాయణ సేవ కింద రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తారు. పుట్టపర్తిలో 20 అడుగుల పొడవు, 26 అడుగుల వెడల్పు ఉన్న సత్యసాయి శత జయంతి ఉత్సవాల గ్యాస్ బెలూన్‌ను ఆర్జే రత్నాకర్ ఎగురవేశారు. బెంగళూరు బృందావనంలో ప్రారంభమైన సత్యసాయి విద్యార్థుల సైకిల్ ర్యాలీ గురువారం సాయంత్రం పుట్టపర్తికి చేరుకుంది.

సత్తా చాటిన ఏకలవ్య స్కూల్స్

▸ ఐఐటీ జేఈఈ, నీట్‌లో 597 మంది ఉత్తీర్ణత

న్యూఢిల్లీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) నుంచి 597 మంది విద్యార్థులు 2024-25లో ఐఐటీ జేఈఈ, నీట్‌లో ఉత్తీర్ణత సాధించారని కేంద్రం తెలిపింది. సీట్లు పొందిన వారిలో అత్యధికంగా గుజరాత్(213), మధ్యప్రదేశ్(176)కి చెందినవారు కాగా మూడో స్థానంలో ఉన్న తెలంగాణ నుంచి 94 మంది ఎంపికయ్యారు. ఏపీ నుంచి 18 మంది ఎంపికయ్యారు. 2022-23లో ఏకలవ్య స్కూల్స్ నుంచి కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాగా రెండేళ్లలో వీరి సంఖ్య 597కి చేరడం గమనార్హం. కాగా, 2023-24లో ఏకలవ్య స్కూల్స్ నుంచి 24 మంది విద్యార్థులు ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు.

తిరుమలకు నేడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

▸ రేపు నూతన సీజేగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్ రాక

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ కుటుంబ సమేతంగా శుక్రవారం తిరుమలకు రానున్నారు. ఢిల్లీ నుంచి తిరుపతి విమానాశ్రయానికి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి తిరుమలకు వెళ్లి అక్కడే బస చేస్తారు. శనివారం శ్రీవారిని దర్శించుకుని విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు. ఇక, సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగానియమితులైన జస్టిస్ సూర్యకాంత్ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రాంచీ నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. రోడ్డు మార్గాన నేరుగా తిరుమల వెళ్లి పద్మావతి అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుని స్వామివారిని దర్శించుకోనున్నారు. రాత్రికి అక్కడే బస చేసి, ఆదివారం తిరిగి శ్రీవారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

పేదల ఇళ్లు..

జగన్ సొల్లు!

25 లక్షల పక్కా ఇళ్లు కట్టిస్తామని నాడు గొప్పలు..
వైసీపీ దిగిపోయే నాటికి వాటిలో 5 శాతమే పూర్తి



3 లక్షల ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో భాగంగా బుధవారం అన్నమయ్య జిల్లా దేవగుడిపల్లెలో లబ్ధిదారుకు ఇంటి తాళం అందజేస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్ ఫొటో)

▸ 95 శాతంఇళ్లు పునాది, వివిధ దశల్లోనే..

▸ 17 నెలల్లోనే 3 లక్షల ఇళ్లు నిర్మించిన కూటమి

▸ సీఎం సమక్షంలో సామూహిక గృహ ప్రవేశాలు

▸ ఆ ఘనత తనదే అంటున్న జగన్‌పై సర్వత్రా విమర్శల వెల్లువ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మూడు లక్షల గృహ ప్రవేశాల ఘనతంతా తనదేనని, తనకు రావాల్సిన గొప్పతనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చోరీ చేస్తున్నారంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్ 'ఎక్స్' వేదికగా చేసిన ట్వీట్‌పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జగన్ హయాంలోనే ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ఉంటే.. ఆయనే గృహ ప్రవేశాలు ఎందుకు చేయించలేకపోయారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. 'పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు చూడకుండా రాష్ట్రంలో ఇల్లు లేని పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టిస్తాం. ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు కట్టిస్తాం. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తాం' అంటూ గొప్పలు చెప్పిన జగన్ తాను అధికారం నుంచి దిగిపోయే నాటికి అందులో 5 శాతం ఇళ్ల నిర్మాణాన్ని మాత్రమే పూర్తి చేయించగలిగారు. నిరుపేదలకు సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి.. జగనన్న కాలనీల పేరుతో ఏకంగా ఊళ్లే నిర్మిస్తామంటూ వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి రాష్ట్రవ్యాప్తంగా లే-అవుట్లు వేశారు. అవి ఎక్కువగా ఊరికి కొన్ని కిలోమీటర్ల దూరంగా.. నివాసయోగ్యం కాని లోతట్టు ప్రాంతాల్లో ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా ఆ లే-అవుట్లు చెరువులుగా మారుతున్నాయి. దీంతో ఆ లే-అవుట్లలో ఇళ్లు నిర్మించుకోడానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. 'మీ ఇళ్లకే దండం' అంటూ రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో లబ్ధిదారులు జగన్ ప్రభుత్వం ఇచ్చిన సెంటు పట్టాలను తిరిగిచ్చేశారు. దీంతో ఇప్పుడు ఆ లే-అవుట్లన్నీ ఎందుకూ కొరగాకుండా మిగిలిపోయాయి. పేదల ఇళ్ల నిర్మాణం ముందుకు సాగకపోవడంపై కేంద్ర ప్రభుత్వం కూడా నాటి జగన్ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తిని, అసహనాన్ని వ్యక్తం చేసింది.

జగన్ దిగిపోయే నాటికి ఇళ్ల నిర్మాణ పరిస్థితి ఇదీ..

జగన్ హయాంలో తొలివిడతగా 2020లో చేపట్టిన 15.6 లక్షల ఇళ్లలో 60,783 ఇళ్లు (5 శాతం) మాత్రమే పూర్తి చేయగలిగారు. మిగిలిన 8 లక్షలకుపైగా ఇళ్లు పునాది దశకు కూడా చేరలేదు. మరో 2 లక్షలకు పైగా ఇళ్లు పునాది దశలో ఆగిపోయాయి. ఇంకో 58 వేల ఇళ్లు గోడల వరకు(రూఫ్ లెవెల్) పూర్తికాగా.. మరో 3 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణం ప్రారంభమే కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు కట్టిస్తామన్న ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కసరత్తు చేస్తున్నారు. అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే గడచిన 17 నెలల కాలంలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 3 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన గృహనిర్మాణ సంస్థ అధికారులు బుధవారం సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సామూహిక గృహ ప్రవేశాలు చేయించారు. దీనిని జీర్ణించుకోలేకపోతున్న జగన్... కూటమి ప్రభుత్వ ఘనతను తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తుండటంపై లబ్ధిదారులు నవ్వుకుంటున్నారు.

అదనపు సాయంతో గృహనిర్మాణానికి ఊపు

పేదలకు 25 లక్షల ఇళ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చిన నాటి జగన్ ప్రభుత్వం కనీసం 5 శాతం కూడా పూర్తి చేయలేక చేతులెత్తేయడంతో.. వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిన ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంది. ఇందుకోసం విడతల వారీగా నిధులు విడుదల చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆ నిర్మాణాలను పరుగులు పెట్టిస్తోంది. ఇదే క్రమంలో ముందుకొచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకునేందుకు వీలుగా సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని అదనపు సాయాన్ని కూడా అందజేస్తున్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఆదివాసీ లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున అదనపు సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.202 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ అదనపు సాయంతో రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతోంది. దీంతో గత ప్రభుత్వంలో వివిధ దశల్లో నిలిచిపోయిన తమ ఇళ్లను పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు వస్తున్నారు. ఫలితంగా పేదల గృహ నిర్మాణ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఏడాదిన్నర కాలంలోనే మూడు లక్షల ఇళ్లు పూర్తిచేసి, సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టడంపై జీర్ణించుకోలేక 'ఎక్స్' వేదికగా అక్కసు వెళ్లగక్కిన జగన్ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గృహ ప్రవేశాల క్రెడిట్ అంతా నాదే!

▸ కూటమి పాలనలో ఒక్కలబ్ధిదారునికీ స్థలం ఇవ్వలేదు: జగన్

▸ 3 లక్షల గృహప్రవేశాలపై 'ఎక్స్' వేదికగా అక్కసు

▸ చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నారని విమర్శ

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు లక్షల గృహ ప్రవేశాల ఘనతంతా తనదేనని, తనకు దక్కాల్సిన ఆ క్రెడిట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు చోరీ చేస్తున్నారని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ లబ్ధిదారులతో కలసి 3,00,092 గృహ ప్రవేశాలు చేశారు. దీనిపై జగన్ గురువారం 'ఎక్స్' వేదికగా అక్కసు వెళ్లగక్కారు. 'చంద్రబాబుగారూ.. మీ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా సాగిస్తున్న క్రెడిట్ చోరీ స్కీమ్ చాలా బాగుంది. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో ఒక్క లబ్ధిదారునికి కూడా ఇంటి స్థలం ఇవ్వని చంద్రబాబు మూడు లక్షల గృహాలు నిర్మించేశారా?' అంటూ అసహనం వ్యక్తం చేశారు.

ఆరు గంటలపాటు సీదిరి విచారణ

▸ మాజీ మంత్రిపై పది కేసులు నమోదు



కాశీబుగ్గ పోలీసుల ఎదుట విచారణకు హాజరైన మాజీ మంత్రి అప్పలరాజు

పలాస, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును కాశీబుగ్గ పోలీసులు గురువారం సాయంత్రం 3.45 గంటల నుంచి రాత్రి 9.45 గంటల వరకూ ఆరు గంటల పాటు విచారించారు. ఆయనపై పది కేసులు నమోదయ్యాయి. చివరిగా 30 పోలీసు యాక్ట్‌ను ఉల్లంఘించి సమావేశం నిర్వహణ, పోలీసు విధులకు ఆటంకం కలిగించడం, పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేక వ్యాఖ్యలు, మహిళా కానిస్టేబుల్‌పై దాడి కేసుల్లో ఆయన నిందితుడిగా ఉండడంతో గురువారం విచారించారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ మొత్తం 12 కేసులు ఎదుర్కొంటున్నానని తెలిపారు.

ఆంధ్రా నుంచి చెన్నైకి గంజాయి తరలింపు

▸ యువకుడి అరెస్ట్

చెన్నై, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం పెరంబూరు రైల్వేస్టేషన్‌లో యువకుడు అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్యాగుల్లో గంజాయి బయల్పడడంతో స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. అతన్ని కడలూరు జిల్లాకు చెందిన జీవేంద్రన్ (24)గా గుర్తించారు.

కట్టుకున్నవాడే కడతేర్చాడు!

పట్టపగలు నడిరోడ్డుపైనే భార్యను కత్తితో పొడిచి హత్య

▸ చనిపోయిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫోన్

▸ విజయవాడలో దారుణం, కేసు నమోదు



భార్యను హత్య చేసి అక్కడే ఉన్న విజయ్

విజయవాడ (వన్‌టౌన్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.. మూడేళ్ల వైవాహిక జీవితంలో మనస్పర్థలు ప్రారంభం కావడంతో విడిగా ఉంటున్నారు. ప్రస్తుతం విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆమె పనిచేసే హాస్పిటల్ వద్దే భార్యను కత్తితో కిరాతకంగా హత్యచేశాడు. ఆ తర్వాత నేరుగా పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. పోలీసులు వెంటనే అక్కడకి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విజయవాడలో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన మట్టకొయ్య సరస్వతి (30) విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన విజయపాల విజయ్ కూడా విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. వీరిద్దరి పరిచయం ప్రేమగా మారి సుమారు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో విజయ్ భార్యపై అనుమానంతో తరచూ గొడవపడేవాడు. అతని వేధింపులు తాళలేక సరస్వతి కుమారుడిని తీసుకుని నూజివీడులో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ప్రతిరోజూ అక్కడ నుంచే విజయవాడ సూర్యారావుపేటలోని విన్స్ హాస్పిటల్‌కు డ్యూటీకి వస్తోంది. ప్రస్తుతం ఈ దంపతుల విడాకుల కేసు కోర్టులో నడుస్తోంది. గురువారం ఉదయం సరస్వతి హాస్పిటల్‌కు డ్యూటీకి వచ్చింది. మధ్యాహ్నం సుమారు 2.30 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లటానికి బయటకు వచ్చింది. అదే సమయంలో విజయ్ ఆమెను అడ్డుకుని వెంటతెచ్చుకున్న కత్తితో సరస్వతిని పొడిచి పీక కోయడంతో అక్కడికక్కడే పడిపోయింది. స్థానికులు విజయ్‌ను అడ్డుకోవటానికి ప్రయత్నించగా దగ్గరకు రావద్దని కత్తితో బెదిరించాడు. సరస్వతి చనిపోయిందని నిర్ధారించుకున్నాక తాపీగా అక్కడ నుంచే పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి భార్యను హత్య చేశానని చెప్పాడు. సౌత్ ఏసీపీ పవన్ కుమార్, సీఐ ఆలీ ఘటనా ప్రాంతానికి చేరుకుని విజయ్‌ను స్టేషన్‌కు తరలించారు. అనంతరం సమాచారాన్ని నూజివీడులో ఉన్న సరస్వతి తల్లిదండ్రులకు తెలియజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానంతో వేట కొడవలితో నరికేశాడు




శాంతి, ఆంజనేయులు దంపతులు

బెళుగుప్ప, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా బెళుగుప్పకు చెందిన శాంతికి గుంతకల్లుకు చెందిన ఆంజనేయులుతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు బెళుగుప్పలోనే కాపురం ఉంటున్నారు. ఆంజనేయులు లారీ డ్రైవర్ కాగా, శాంతి కూలి పనులకు వెళ్లేది. వీరి కుమారుడు మహేంద్ర పదో తరగతి చదువుతున్నాడు. కూతురు లహరికి ఇటీవల వివాహం చేశారు. కొన్ని నెలలుగా భార్యపై అనుమానం పెంచుకున్న ఆంజనేయులు.. ఆమెతో గొడవపడేవాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో తలుపులు వేసుకుని తీవ్ర స్థాయిలో గొడవపడ్డారు. ఆగ్రహానికి గురైన ఆంజనేయులు ఇంట్లో ఉన్న వేటకొడవలితో శాంతి(35) తలపై నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆ తరువాత చేతిలో వేటకొడవలిని పట్టుకుని బయటకు వచ్చిన ఆంజనేయులు.. తన భార్యను చంపేశానని కేకలు వేసుకుంటూ వెళ్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

గజ దాడిలో రైతు దుర్మరణం

▸ పరామర్శించిన ఎమ్మెల్సీ శ్రీకాంత్, డీఎఫ్ఓ

▸ తక్షణ సాయంగా 5 లక్షల చెక్కు అందజేత



కృష్ణప్ప

అమరావతి, కుప్పం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఒంటరి ఏనుగు ఓ రైతు ప్రాణాలు తీసింది. కుప్పం మండలం ఉర్లఓబనపల్లె పంచాయతీ కూర్మానపల్లె సమీపంలో రైతు కృష్ణప్ప రాగి, జొన్న పంటలను సాగు చేస్తున్నాడు. బుధవారం రాత్రి పొలం వద్ద కాపలా ఉన్నాడు. అటుగా వచ్చిన ఏనుగు కృష్ణప్ప ఉన్న గుడిసెను తోసి, తొక్కిపడేయడంతో రైతు దుర్మరణం పాలయ్యాడు. ఉదయం కృష్ణప్ప ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లా రు. కృష్ణప్ప మృతదేహాన్ని చూసి కన్నీళ్లపర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు డీఎఫ్ఓ శ్రీనివాసులు మృతుడి భార్య, పిల్లలను పరామర్శించారు. తక్షణ సాయంగా ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చెక్కును అందించారు. మరో రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తామని హామీ ఇచ్చారు.

ఏనుగుల కదలికలపై ముందస్తు హెచ్చరికలు పెంచాలి: పవన్

అటవీ ప్రాంతాలను ఆనుకుని ఉన్న గ్రామాల్లోకి ఏనుగులు ప్రవేశించే పరిస్థితులు ఉత్పన్నమైతే ముం దస్తు హెచ్చరికలు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కుప్పం మండలంలో ఏనుగు దాడిలో మృతి చెందిన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన పవన్... ఘటనపై గురువారం అధికారులతో చర్చించారు. పరిహారాన్ని వీలైనంత త్వరగా అందించాలని ఆదేశించారు.



సీఎం చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈఎన్‌సీ చీఫ్ సంజయ్ భల్లా

నేవీకి పూర్తి సహకారం

▸ ఈఎన్‌సీ చీఫ్‌తో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేవీ కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనడానికి విశాఖపట్నం వచ్చిన సీఎంను తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ జిల్లాలో నేవీ ప్రాజెక్టులను సీఎంకు వివరించారు. రక్షణ రంగంలో నేవీకి ఉపయోగపడే కంపెనీలు, స్టార్టప్‌లను రాష్ట్రానికి ఆహ్వానించే అంశాలపై చర్చ జరిగింది. త్వరలో నేవీ విశాఖలో నిర్వహించే ఫ్లీట్ రివ్యూ, మిలాన్ కార్యకలాపాల వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. నేవీ ప్రాజెక్టులకు అవసరమైన భూమిని ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు.

భరత్‌రామ్ నుంచి ప్రాణహాని ఉంది

▸ మాజీ ఎంపీ చీకటి దందాలకు నేనే సాక్ష్యం

▸ నా కుటుంబానికి రక్షణ కల్పించండి: రామశర్మ



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, రాజమహేంద్రవరం మాజీ ఎంపీ భరత్‌రామ్, అతని ప్రధాన అనుచరుడు పీతా రామకృష్ణ నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆయన అనుచరుడు రామశర్మ ఆరోపించారు. తమకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఆయన రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. భరత్‌రామ్ చీకటి దందాలకు తానే సాక్ష్యం కాబట్టి తనను చంపాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తనకు గానీ, తన కుటుంబానికి గానీ ఏం జరిగినా భరత్ రామ్, పీతా రామకృష్ణ కారణమన్నారు. 'భరత్ కోసం నేను చాలా చేశాను. టీడీపీ నాయకుడు యిన్నమూరి దీపును బెదిరించి వైసీపీలోకి వచ్చేలా చేశాం. టీఎన్‌టీయూసీ, ఏపీ పేపర్ మిల్లు యూనియన్ నాయకుడు చిట్టూరి ప్రవీణ్ చౌదరిని వైసీపీలోకి తీసుకెళ్లాం. రెడ్ గ్రావెల్ మైనింగ్, ఇసుక ర్యాంప్, బుర్రిలంక ఇసుక ర్యాంప్‌నకు సంబంధించి నెలవారీ మామూళ్లు సుమారు రూ.5 కోట్ల వరకు భరత్‌కు ఇచ్చాను. వైవీ. సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి వంటి వారు పర్యటనకు వస్తే ఖర్చులన్నీ భరత్ నా చేతే పెట్టించేవారు. ఆయన వల్లే అప్పులపాలై అజ్ఞాతంలోకి వెళ్లిపోయాను. పీతా రామకృష్ణకు డబ్బులు బాకీ ఉండడంతో.. నా తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తున్నారు. రామకృష్ణ ఫోన్ చేసి డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. దీనిపై రాజమహేంద్రవరం ప్రకాశ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా రామకృష్ణ తీరు మారలేదు' అని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వైఫల్యం – విషాదం

ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. పదమూడుమందిని పొట్టనబెట్టుకొని, తీవ్ర గాయాలతో అనేకులను ఆస్పత్రిపాల్జేసిన ఈ దారుణంలో కుట్రదారులను, కార్యకర్తలనూ వెతికిపట్టుకొనే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. పదిమందిని అనుమానితులుగా అరెస్టు చేయడంతో పాటు, ఢిల్లీ పోలీసులు కొన్ని ప్రాంతాల్లో హోటళ్ళనూ, నివాసగృహాలను ఇంకా జల్లెడపడుతున్నారు. కశ్మీర్‌లోనూ గాలింపు కొనసాగుతోంది. ఆర్డీఎక్స్ స్థానంలో అతి సులువుగా అందుబాటులో ఉండే అమ్మోనియం నైట్రేట్‌తో ఆ దుర్మార్గులు ఇంతటి ఘోర విధ్వంసాన్ని సృష్టించారు. వీరి ఉన్మాదానికి సామాన్యులు, ఆటోడ్రైవర్లు, దుకాణదారులు బలైపోయారు. కొన్ని వందలమీటర్ల దూరంవరకూ శరీర అవయవాలు తెగినపడిన ఆ భీతావహదృశ్యాలు మనలను దీర్ఘకాలం వెంటాడతాయి.

జవాబులేని ప్రశ్నలు అనేకం మిగిలే ఉన్నాయి. ఈ విస్ఫోటనానికి ముందు కశ్మీర్‌లో ఏడుగురు అరెస్టుకావడం, ఫరీదాబాద్‌లో భారీగా పేలుడుపదార్థాలు దొరకడం వంటి పలు పరిణామాలను గుదిగుచ్చే ప్రయత్నం సాగుతోంది. ఇటువంటి ఘటనలు జరగ్గానే, విధ్వంసం తీవ్రత, విధానాలను బట్టి దర్యాప్తు సంస్థలు కొద్దిగంటల్లోనే దానిని ఉగ్రవాదచర్యగా గుర్తించడం, ఏ సంస్థ ఉన్నదో అంచనాకట్టడం జరిగిపోతుంది. ఎర్రకోట ఘటనలో ఢిల్లీ పోలీసులు, ఎన్ఐఏ నోరువిప్పడంలేదు. దీంతో తనకు అనధికారికంగా తెలిసినదానినో, ఊహించినదానినో మీడియా చెప్పుకుంటోంది. డిసెంబరు 6న ముప్ఫైకిపైగా వరుస పేలుళ్ళతో విధ్వంసాన్ని సృష్టించడానికి ఈ మతోన్మాదులు సర్వం సిద్ధం చేసుకున్నారని వార్తలు వస్తున్నాయి. ఒక్కకారుతో, అదీ హడావుడిలోనే ఇంతటి వినాశనం కలగచేయగలిగిన ఆ దుర్మార్గుల అసలు లక్ష్యం నెరవేరినపక్షంలో ఎంతటి ప్రాణనష్టం జరిగివుండేదో తలుచుకుంటేనే భయం కలుగుతుంది. జమాతే ఇస్లామీ, జైషే మహ్మద్ వంటి సంస్థలతో పాటు, తుర్కియే తోడ్పాటు కూడా ఉన్నట్టు వింటున్నాం.

దారుణం జరగ్గానే కుట్ర, భయానకం వంటి మాటలు మాత్రమే వాడిన పాలకులు రెండురోజులకు గానీ ఉగ్రచర్యగా గుర్తించలేదు. ఇంతలోగా ప్రధాని మోదీ భూటాన్ కూడా వెళ్ళి, కుట్రదారులను వదిలేది లేదని అక్కడ ఓ భీషణ ప్రతిజ్ఞచేశారు. ఎన్ఐఏకు కేసు అప్పగించడం, ఊపావంటి చట్టాలను ప్రయోగించడం కుట్రదారులమీద వదిలిపెట్టకుండా ఉండటానికే. క్రమంగా పాక్‌పాత్ర, జైషే హస్తం, ముంబైతరహా మరో విధ్వంసానికి విస్తృతమైన ప్రణాళిక ఇందులో స్పష్టం కావడంతో ఉగ్రవాదం అనకతప్పలేదు. ఆపరేషన్ సిందూర్ జోరుగా సాగుతూండగా, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అది ఆగిపోయిందని ముందే ప్రకటించి మన పాలకులను ఇరకాటంలో పడేశారు. ఆ తరువాత ఆయన ఓ యాభైసార్లు తానే యుద్ధాన్ని ఆపాననీ చెప్పుకున్నారు. ఇక చాలు మహాప్రభో అని పాక్ మిలటరీ అధికారులు ప్రాధేయపడడంతో తామే సిందూర్‌ను ఆపామని మన నాయకులు చెప్పుకున్నారు. ఇకపై ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వబోమన్న కనీస హామీ కూడా లేకుండా, కేవలం శత్రువు బతిమాలితే యుద్ధం ఆపేయడమేమిటని విపక్షాలు నిలదీశాయి. ఇకపై ఉగ్రచర్యలన్నీ యుద్ధచర్యలుగానే పరిగణిస్తామని స్వయంగా ప్రధాని ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ఎర్రకోట ఘటనను ఉగ్రచర్యగా గుర్తించడం ప్రభుత్వానికి ఒక విధంగా ఇబ్బందే. ట్రంప్‌తో వీసమెత్తు సయోధ్యలేని స్థితిలో, ఆయన పూర్తిగా పాకిస్థాన్ పక్షాన, మార్షల్ మునీర్ ప్రేమలో తేలుతున్న తరుణంలో గతంలో మాదిరిగా సిందూర్‌లు సాధ్యం కాదు. పాలకులు కూడా కుట్రదారులకు ప్రభుత్వ ఏజెన్సీలు తగిన గుణపాఠం చెబుతాయని మాత్రమే అంటున్నారు.

ఒక మహా విధ్వంసం దిశగా సాగుతున్న కుట్ర ముందుగానే ఎర్రకోటవద్ద బద్దలుకావడం ఒక విధంగా ఉపశమనం కలిగించేదే. అయితే, రోజంతా భారీ పేలుడుపదార్థాలతో ఒక వ్యక్తి కీలకమైన ప్రాంతాల్లో సంచరించగలగడం మన నిఘావైఫల్యానికి నిదర్శనం. దీనికి పదిరోజుల ముందే కశ్మీర్, ఫరీదాబాద్‌లో ఉగ్రచర్యలను పోలీసులు భగ్నం చేసినా, దూరదృష్టి, సమన్వయం, సమాచార లోపంతో ఈ దారుణాన్ని నిలువరించలేకపోవడం అతిపెద్ద విషాదం. శక్తిమంతమైన లెఫ్టినెంట్ గవర్నర్ ఉన్న జమ్మూకశ్మీర్, బీజేపీ పాలిత హర్యానా, యూపీ, ఢిల్లీలమీదుగా ఈ ఉగ్రకుట్ర సాగడంతో విపక్షాలు పుల్వామా, పహల్గాం వైఫల్యాలను కూడా గుర్తుచేస్తూ కేంద్రాన్ని ఘాటుగా విమర్శించడం సహజం.

వార్షిక 'వాతావరణ' ప్రహసనాలు!

శీతవేళ ఆగమిస్తోంది. ఏటా ఈ తరుణంలో ప్రభుత్వాల ప్రతినిధులు, పౌర సమాజ క్రియాశీలురు, పర్యావరణ వైజ్ఞానికులు, పారిశ్రామిక, వ్యాపార సంస్థల సీఈఓలు వాతావరణ మార్పుపై చర్చలకు సమావేశమవుతారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశం ఈ ఏడాది బెలెమ్ (అమెజాన్ వర్షారణ్యం అంచున ఉన్న బ్రెజీలియన్ నగరం)లో జరుగుతోంది. సరిగ్గా ఇదే రోజులలో ఢిల్లీ, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో గాలి ధూళి దూసరమయిపోతుంది. ఊపిరి పీల్చుకోవడం ఢిల్లీ వాసులకు మహాకష్టంగా ఉంటుంది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఈ ఏడాది వాతావరణ మార్పు సంబంధిత మార్పులు ఎప్పటిలానే మహా ఆందోళనకరంగా ఉన్నాయి. మనిషిపై ప్రకృతి పగ సాధిస్తున్నట్టుగా వాతావరణ పోకడలు ఉంటున్నాయి. హరిత గృహ వాయు ఉద్గారాలు ఘోరంగా పెరిగిపోతున్నాయి. వచ్చే దశకం (2030లు) తొలి సంవత్సరాలలోనే భూతాపం పెరుగుదల పరిమితి 1.5 డిగ్రీల సెల్సియస్‌ను ప్రపంచం ఖాయంగా ఉల్లంఘించనున్నదని రోజురోజుకీ మరింతగా విదితమవుతోంది. ఇది వినాశనకరమైన పరిణామం, సందేహం లేదు. భూ ఉష్ణోగ్రతలు 1.2 డిగ్రీల సెల్సియస్ పెరిగితేనే ఈ విశాల అవని ఎల్లెడలా భయంకరమైన ప్రాకృతిక విపత్తులకు లోనవుతుంది కదా. వాతావరణ మార్పు వైపరీత్యాల తాకిడి మన దైనందిన జీవితాలపై ఎంత తీవ్రంగా ఉంటుందో మరి చెప్పనవసరం లేదు. వాతావరణ మార్పును నివారించే, లేదా నియంత్రించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తోన్న వార్షిక శిఖరాగ్ర సదస్సులు ముంచుకొస్తోన్న వాతావరణ ముప్పునకు ప్రభుత్వాలను జవాబుదారీగా చేయడంలో విఫలమవుతున్నాయి. చర్చలు నిరర్థకమవుతున్నాయి.

శీత రుతువు రాకడతో ఉత్తర భారతావనిలో గాలివేగం తగ్గుతుంది. చల్లని గాలులు దట్టంగా వీస్తూ భూమిని అదే పనిగా స్పృశిస్తుంటాయి. కాలుష్యం మన కళ్ల ఎదుట కరాళ నృత్యం చేస్తుంది. మన నయనేంద్రియాలు ఎర్రబారుతాయి. మన ఊపిరితిత్తులు ఊపిరి పీల్చుకోలేకపోతాయి. కొద్ది నెలల పాటు కాలుష్యం, కాలుష్య కారక ఘటనలు మీడియా పతాక శీర్షికలవుతాయి. ప్రజలకు దాపురించిన వాతావరణ వెతలకు రాజకీయవేత్తలు పరస్పరం నిందించుకుంటారు. సమస్య నిమ్మళిస్తుందా? లేదు. శాసన నిర్మాతలు శ్రద్ధ చూపుతారా? లేనే లేదు. అయినా రాజకీయ పక్షాలు వాతావరణ వైపరీత్యాలపై వాదోపవాదాలు చేస్తుంటాయి. తమ శ్రేయస్సుకు మేలు చేయని ఈ వ్యర్థ ప్రలాపాలను సగటు పౌరులు జుగుప్సా భావంతో వింటూంటారు. శీతాకాలంతో పాటు కాలుష్యమూ వీడిపోతుందా? పోదు. అది మరింతగా తీవ్రమవుతుంది. ఏటేటా ఇదే కథ. ఈ ఏడాది ఈ పాత కథకు ముగింపు పలకాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించుకున్నది. ఎలా? కృత్రిమ వర్షాలు కురిపించడం ద్వారా! అందరూ అబ్బురపడుతూ ఆకాశం వర్షించబోయే అమృత ధారల కోసం ఆశావహ దృక్కులతో ఎదురుచూశారు. అయితే ఢిల్లీ సర్కార్‌కు దైవశక్తులు లేవని అంతిమంగా ప్రతి ఒక్కరికీ విదితమయింది. అయితేనేం, ఆ అట్టహాస వైఫల్యం, ఢిల్లీ సర్కార్ ప్రజల బాధలను ఉపేక్షించలేదని చెప్పేందుకు పనికి వచ్చింది మరి.



బ్రెజిల్‌లో ఐక్యరాజ్యసమితి వార్షిక వాతావరణ సదస్సూ, ఢిల్లీలో వార్షిక వాయు కాలుష్య బెడదను నివారించేందుకు 'కృత్రిమ వర్ష' ప్రయోగం రెండూ సమస్యను పరిష్కరించేందుకు సరిపోని, నిబద్ధత లేని చర్యలను ప్రదర్శించేందుకు మాత్రమే తోడ్పడుతున్నాయి.

బెలెమ్‌లో ఐక్యరాజ్యసమితి వార్షిక వాతావరణ సదస్సూ, ఢిల్లీలో వార్షిక వాయు కాలుష్య బెడదను నివారించేందుకు 'కృత్రిమ వర్ష' ప్రయోగం రెండూ సమస్యను పరిష్కరించేందుకు సరిపోని, నిబద్ధత లేని చర్యలను ప్రదర్శించేందుకు మాత్రమే తోడ్పడుతున్నాయి. ఈ ప్రహసనప్రాయ కార్యాచరణల గురించే నేను నిజంగా ఆందోళన చెందుతున్నాను. ఐక్యరాజ్యసమితి ఏటా నిర్వహిస్తున్న కాప్ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) శిఖరాగ్ర సదస్సులో దేశ దేశాల ప్రతినిధులు, నిపుణులు వాతావరణ మార్పును నిరోధించే చర్యల పురోగతి ఏ స్థాయిలో ఉన్నదీ సమీక్షించి, తీసుకోవల్సిన తదుపరి చర్యల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు.

సరే, స్థిరమైన అభివృద్ధికి దోహదపడే విధంగా వాతావరణ మార్పులకు అనుగుణంగా అన్ని దేశాల సామర్థ్యాన్ని పెంచడమనేది ప్రస్తుతం బెలెమ్‌లో జరుగుతున్న కాప్ 30 అజెండా ప్రధాన లక్ష్యంగా ఉన్నది. వాతావరణ మార్పుల నెదుర్కొనేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందుతున్న ఆర్థిక సహాయం రుణాలు, ఈక్విటీల రూపేణా ఉంటోంది. అయితే ఇవి పేద దేశాల రుణ భారాన్ని మరింతగా పెంచడమే కాని అసలు లక్ష్య సాధనకు తోడ్పడడం లేదు. ఈ ఏడాది వాతావరణ మార్పు వైపరీత్యాలకు నష్టపోయిన అనేక దేశాలు అందుకున్న అంతర్జాతీయ ఆర్థిక సహాయం కంటే తమ రుణాలపై చెల్లించిన వడ్డీల మొత్తమూ అధికంగా ఉన్నది. అసలే వాతావరణ విపత్తులకు కుదేలయిపోయిన ఈ దేశాలు అభివృద్ధి సాధనకు అవసరమైన ఆర్థిక వనరులు కొరవడి అన్ని విధాల కృశించిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో హరిత గృహ వాయు ఉద్గారాల తగ్గింపునకు తోడ్పడే వాతావరణ చర్య (క్లైమేట్ యాక్షన్)కు అవి సమర్థంగా ఎలా పూనుకోగలుగుతాయి?

చెప్పవచ్చినదేమిటంటే నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో చిత్తశుద్ధి కొరవడి, ప్రయోజనరహితంగా సాగుతున్న వార్షిక వాతావరణ సదస్సులకు స్వస్తి చెప్పాలి. ఢిల్లీలో ఏడాది పొడుగునా కాలుష్యాన్ని తగ్గించేందుకు ఒక కార్యాచరణ పథకం ఉన్నది. అయితే దాన్ని అమలుపరచడం లేదు. మాటలే కాని, చేతలు లేనప్పుడు జరిగే మేలు ఏమిటి? ప్రభుత్వాల క్రియారాహిత్యాన్ని కప్పిపుచ్చేందుకు మాత్రమే చర్చలు, సమావేశాలు తోడ్పడుతున్నాయి. నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు దోహదం చేసే కార్యాచరణలకే తొలి, మలి, తుది, నిరంతర ప్రాధాన్యమివ్వాలి. అవును, మనం సదా లక్ష్య సాధక కార్యచరణలో ఉండాలి. అది మాత్రమే ముఖ్యం. అంతేగాని చేతలకు దిగకుండా మాటలకు పరిమితమైతే సమస్య నుంచి ఎలా బయటపడగలుగుతాము? అసలు సమస్య నుంచి బయటపడేందుకు మాట్లాడే అర్హతను సైతం కోల్పోతాము సుమా!

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

సంపదల్లో సమానత్వం ఎందుకు?

మానవ సమాజంలో అసమానతలపై వచ్చిన వివరణలూ, సమర్థనలూ ఇంకే విషయం పైనా రాలేదు. మతాలు ప్రబోధాలనూ, తత్వశాస్త్రాల చర్చలనూ తరచిచూస్తే అవే ఎక్కువగా కనపడతాయి. అన్ని సందర్భాల్లో అవి ప్రత్యక్షంగా వ్యక్తంకాకపోవచ్చు. విశ్వవిద్యాలయాల్లో నిష్ణాతుల మధ్య చర్చల్లా అవి ఉండకపోవచ్చు. ఈనాటి వాదప్రతివాదాల్లాగా స్పష్టంగా వెల్లడి కాకపోవచ్చు. కానీ మన సంప్రదాయ కథల్లో, పురాణాల్లో, కావ్యాల్లో, పాపపుణ్యాల వివేచనల్లో, ధర్మాధర్మ ఆలోచనల్లో.. అంతస్తుల్లో ఎక్కువ తక్కువలను వివరించి తాత్విక సమర్థనలు ఇవ్వటమే ప్రధానంగా ఉంటుంది. మన కర్మ సిద్ధాంతమే ఇందుకు నిదర్శనం. గతజన్మలో చెడు కర్మలు చేసినవారు కష్టాలను అనుభవిస్తున్నారనీ, మంచి కర్మలు చేస్తే వచ్చే జన్మలో ఉన్నత స్థాయికి వెళతారన్న భరోసా ఇవ్వటమే అందులో కనపడుతుంది. ఆ భరోసాతోనే సర్దుకుపోయే మనస్తత్వం ఏర్పడుతుంది. అన్ని దేశాల్లోనూ ఇలాంటి సిద్ధాంతాలు ఉన్నాయి. 'ధనికులను పేదలు చంపకుండా మతమే నిలువరిస్తోంది' అని నెపోలియన్ రెండు వందల ఏళ్ల క్రితమే చాలా నిక్కచ్చిగా చెప్పాడు. సాధారణ ప్రజలను నిశ్శబ్దంగా ఉంచటానికి అదొక అద్భుత సాధనమని కూడా నెపోలియన్ వ్యాఖ్యానించాడు.

ఈ అద్భుత సాధనం ఇప్పటికీ ఉన్నప్పటికీ ఒకనాటి పదునును కోల్పోతోంది. ఆధునిక సమాజంలో అసమానతలను ప్రశ్నించటం పౌరహక్కుగా మారిపోతోంది. ఒక స్థాయి వరకే అసమానతలను సహించే పరిస్థితి నెలకొంటోంది. మితిమీరిన అసమానతలపై ప్రపంచ వ్యాప్తంగా ఏదో ఒకరూపంలో అలజడులు, ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్యానికీ, ఆర్థికాభివృద్ధికీ, పర్యావరణానికీ అసమానతలు తీవ్ర ఆటంకాలుగా పరిణమించటంపై ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. అసమానతలు కలిగిస్తున్న విపరిణామాల విషయమై అంతర్జాతీయ వేదికలపై చర్చలూ మొదలయ్యాయి. ఈ నెల 22, 23 తేదీల్లో దక్షిణాఫ్రికాలోని జోహానెస్‌బర్గ్‌లో జరిగే జీ–20 సదస్సులో అసమానతల అంశాన్ని కూడా ప్రధాన అజెండాలో చేర్చారు. జీ–20 కూటమికి అధ్యక్షత వహిస్తున్న దక్షిణాఫ్రికా సారథ్యంలో అసమానతలపై నివేదికను ఇవ్వటానికి స్వతంత్ర నిపుణులతో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన జోసెఫ్ స్టిగ్లిట్స్ నేతృత్వంలో ఏర్పడిన ఆ కమిటీ అసమానతలను పలుకోణాల్లో విశ్లేషించి నివేదికను రూపొందించింది.



తీవ్ర అసమానతల కారణంగా వివిధ కీలక రంగాలకు ప్రమాదం ఎలా పొంచి ఉందో నివేదికలో స్పష్టంగా వివరించారు. సంపద, ఆదాయాల పరంగా పెరిగిపోతున్న అసమానతలను లోతుగా విశ్లేషించారు. గత 40 ఏళ్లల్లో 50శాతం ప్రజల సగటు వాస్తవ ఆదాయం 358 డాలర్లు మాత్రమే పెరిగింది. ఒక శాతమున్న బడా ధనికుల సగటు ఆదాయం అదే కాలంలో 191,000 డాలర్లకు చేరింది. సంపదలో అసమానతలు ఇంకా దారుణంగా తయారయ్యాయి. 2020–2024 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన మొత్తం సంపదలో 41శాతం ఒక శాతంగా ఉన్న శ్రీమంతుల చేతుల్లోకి వెళ్లింది. దిగువనున్న 50 శాతం ప్రజలకు పెరిగిన సంపదలో లభించిన వాటా 1 శాతం మాత్రమే. శ్రీమంతులకు సగటున 13 లక్షల డాలర్ల సంపద లభిస్తే అట్టడుగునున్న 50శాతం ప్రజలకు సగటున 585 డాలర్ల సంపదే దక్కింది. అంటే 2,655 రెట్లు ఎక్కువ సంపద 1 శాతం శ్రీమంతుల చేతుల్లోకి వెళ్లింది. ప్రపంచ వస్తు, సేవల విలువలో (జీడీపీ) 16శాతానికి సమానమైన సంపద 3,000 మంది కుబేరుల చేతుల్లో పోగుపడింది. ఇప్పటివరకూ బిలియనీర్లను మాత్రమే మనం చూశాం. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరో పదేళ్లల్లో ట్రిలియనీర్లు రంగంపైకి వచ్చేస్తారు. బిలియనీర్లు అందరూ సొంతంగా పరిశ్రమలూ, కంపెనీలూ పెట్టి కిందా మీదా పడి సంపదను కూడబెట్టినవాళ్లు కాదు. వారసత్వంగా సంపదను పొందినవాళ్లే ఎక్కువ.

అసమానతలు తీవ్రంగా ఉన్న దేశాల్లో ప్రజాస్వామ్య క్షీణత ఏడు రెట్లు ఎక్కువగా ఉంది. పెరిగిపోతున్న అసమానతల వల్ల 2020ల నుంచి దారిద్ర్యం నుంచి ప్రజలను గట్టెక్కించే ప్రక్రియల్లో వేగం తగ్గింది. దీంతో 230 కోట్ల మంది ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. సగం ప్రపంచ జనాభాకు అత్యవసర ఆరోగ్యసేవలు అందటం లేదు. వైద్య ఖర్చులకు సొంత డబ్బులు చెల్లించాల్సి రావటంతో 130 కోట్ల మంది ఆర్థిక పరిస్థితి దిగజారింది. అసమానతల వల్ల ప్రజాస్వామ్య సంస్థల్లో నమ్మకం తగ్గిపోతోంది. విభజన రాజకీయాలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఉన్మాద రాజకీయాల ప్రాబల్యం విస్తరిస్తోంది. ప్రజాస్వామిక ప్రక్రియల్లో పాల్గొనాలనే ఆసక్తిలోనూ క్షీణత కనపడుతోంది. అసమానతలు ఎక్కువగా ఉన్న 23 దేశాల్లో 22 చోట్ల ప్రజాస్వామ్యం అన్ని రకాలుగా దిగజారింది. చట్టసభలు, న్యాయవ్యవస్థల పనితీరు కూడా మందగిస్తోంది. అసమానతలు కలిగించిన అసంతృప్తిని ఆసరా చేసుకుని విపరీత పోకడలతో, జనాకర్షక నినాదాలతో, నియంతృత్వ లక్షణాలతో ఎన్నికల్లో గెలిచే నాయకుల సంఖ్యా ఎక్కువైంది. సంపన్న వర్గాల ప్రత్యక్ష, పరోక్ష ప్రభావంతో రాజకీయాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. రాజకీయ అధికారాన్ని శాసించటం ద్వారా సంపన్న వర్గాలు తమ అనుకూల విధానాలనే అమలయ్యేలా చూస్తున్నాయి. సంపద బలం నుంచి రాజకీయ ప్రాబల్యం... మళ్లీ ఈ ప్రాబల్యం అండతో సంపదను పెంచుకునే మార్గాలను సుస్థిరపరచుకోవటం... ఇట్లా ఎడతెగని బంధం ఒకటి ఏర్పడుతోంది.



■ రాహుల్ కుమార్

ప్రభుత్వ జోక్యం లేకుండా మార్కెట్‌కే అన్నీ వదిలేస్తే ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందనే భావన ఎంత తప్పో అనేక దేశాల్లో పరిణామాలను చూస్తే అర్థం అవుతుంది. అసలు ప్రభుత్వం జోక్యం తగ్గిన తర్వాతే అసమానతలు ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయాయి. 1990ల నుంచి ఇదింకా స్పష్టంగా కనపడుతోంది. అసమానతలు ఆర్థికాభివృద్ధికి ఆటంకాలు ఎలా అవుతున్నాయో ఏడు విషయాలను పరిశీలిస్తే తేలికగా అర్థం అవుతాయి. 1) అసమానతల వల్ల తగినంత డబ్బు కింది వర్గాల్లో లేకపోవటంతో వస్తు, సేవలకు గిరాకీ తగ్గిపోతుంది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థకు కావాల్సిన వస్తు–సేవల డిమాండ్ ఉండదు. కింది వర్గాలు తమ దగ్గర ఉన్న మొత్తం డబ్బుని ఖర్చుచేసినా వారు సృష్టించే డిమాండు తక్కువగానే ఉంటుంది. పై వర్గాల చేతుల్లో డబ్బు ఉన్నా కొనుగోళ్లు పరిమితం అవ్వటం వల్ల అవసరమైన డిమాండును సృష్టించలేరు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ తన సామర్థ్యానికి అనుగుణంగా పని చేయలేదు. 2) ఆదాయం అంతంత మాత్రంగా ఉండటం వల్ల సరైన పోషకాహారాన్ని ఎక్కువ మంది పొందలేరు. అవసరమైన వైద్యాన్నీ పొందలేరు. పిల్లల చదువుకూ ఇబ్బందులు ఏర్పడతాయి. అంతర్గత శక్తులు పూర్తిగా విప్పారని వారిగా ఆ పిల్లలు తయారవుతారు. దాంతో తక్కువ ఉత్పాదకత (లెస్ ప్రడక్టివ్) జీవులుగా మారతారు. దీని ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపై ఉంటుంది. 3) ఉద్యోగ భద్రత లేకుండా అసంఘటిత రంగంలో పనిచేసేవారు ఆర్థికరంగంలో వచ్చే ఒడిదుడుకులకు తీవ్రంగా ప్రభావితం అవుతారు. ప్రభుత్వపరంగా వీరిని ఆదుకోటానికి సామాజిక భద్రతా పథకాల్లేని చోట పరిస్థితి దారుణంగా తయారవుతుంది. ఆందోళన చుట్టుముడుతుంది. దీంతో సరిగా పనిచేయలేరు. వాళ్ల ఉత్పాదకతా తగ్గిపోతుంది. మరోవైపు పిల్లల విద్యపై పెట్టే ఖర్చునీ తగ్గించివేస్తారు. కొత్త నైపుణ్యాల కోసం ఖర్చుపెట్టి మరో ఉద్యోగాన్ని పొందటమూ కష్టమవుతుంది. భవిష్యత్తు కోసం నిర్ణయాలు తీసుకోలేని అశక్తతలో కూరుకుపోతారు. 4) తక్కువ ఆదాయం ఉన్నవాళ్లకు మంచి విద్య, వైద్యం లభించదు. ఇక వాళ్ల పిల్లలకు వయస్సుతో పాటు అందాల్సిన పోషకాహారం లభించకపోవటంతో వాళ్ల మేధో సామర్థ్యం పూర్తిగా వికసించదు. దీంతో పెద్దయ్యాక కూడా వాళ్లు పోటీలు పడి మంచి ఉద్యోగాలను సాధించలేరు. సామాజికంగా పై మెట్టును ఎక్కలేరు. అసమానతల వల్ల పేదరికం తరాలపాటు కొనసాగుతుంది. సామాజిక పురోగతి స్తంభించిపోతుంది. ప్రభుత్వాలు ఆరోగ్య ఖర్చుని 1 శాతం పెంచితే తరాల మధ్య అసమానత 14 శాతం తగ్గుతుంది. కానీ అదే చాలాచోట్ల జరగటం లేదు. 5) అసమానతలు మెజారిటీ ప్రజలను అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తాయి. దీంతో ఆర్థిక స్థిరత్వానికి ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుంది. 6) సంపద అధికంగా ఉన్న వర్గాలు తమ దగ్గరున్న డబ్బును ఉత్పాదకతను పెంచే రంగాల్లో పెట్టుబడులు పెట్టకుండా కూడా సమాజానికి హాని కల్గిస్తారు. సహజవనరులపై గుత్తాధిపత్యం సాధించి లాభాలను సంపాదించాలని చూస్తారు. కొత్త పరికరాల సృష్టికో, అదనపు విలువను జోడించటానికో ప్రయత్నించకుండా ప్రభుత్వ యంత్రాగాన్ని ప్రభావితంచేసి లాభాలను (రెంట్ సీకింగ్) గడించాలని చూడటం ఆర్థిక వ్యవస్థకే కాకుండా ప్రజలకూ తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతుంది. గనులు, చమురు, సహజ వాయువు వనరులపై ప్రభుత్వ నియంత్రణ తక్కువ ఉండేలా చూసి లాభాలను అధికం చేసుకుంటారు. స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణ నాశనం, భవిష్యత్తు తరాల సంక్షేమం పట్టకుండా వ్యవహరిస్తారు. 7) ఇక ఒక దేశంలో ఉన్న అసమానతలు ఆ దేశానికే పరిమితం కావు. ఆరోగ్యసేవలు బలహీనంగా ఉన్నచోట వ్యాధులు వేగంగా వ్యాపించి ఇతర దేశాలకూ చేరతాయి. ఒక దేశంలో కాలుష్యం ఇతర దేశాలకూ వ్యాపిస్తుంది. ధనికుల అతి విలాసాల వల్ల అధిక కార్బన్ వినియోగం జరిగి వాతావరణం విపరీత మార్పులకు లోనవుతోంది. అమెరికా, యూరపుల్లో ధనికుల జీవనశైలి వల్ల పేద దేశాల ప్రజలు అతివృష్టి, అనావృష్టిని ఎదుర్కొంటున్నారు. అందుకే దేశాల మధ్యా, దేశాల లోపలా అసమానతలను కట్టడిచేయకపోతే అస్థిరతలు, సంక్షోభాలు, తిరుగుబాట్లు, ప్రజాస్వామ్యం ముసుగులో నియంతల వీర విహారాలు చేయటం సర్వసాధారణం అవుతాయి.

ప్రపంచ వస్తు, సేవల విలువలో (జీడీపీ) 16 శాతానికి సమానమైన సంపద 3000 మంది కుబేరుల చేతుల్లో పోగుపడింది. ఇప్పటివరకూ బిలియనీర్లను మాత్రమే మనం చూశాం. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరో పదేళ్లలో ట్రిలియనీర్లు రంగంపైకి వచ్చేస్తారు. బిలియనీర్లు అందరూ సొంతంగా పరిశ్రమలూ, కంపెనీలూ పెట్టి కిందా మీదా పడి సంపదను కూడబెట్టినవాళ్లు కాదు. వారసత్వంగా సంపదను పొందినవాళ్లే ఎక్కువ.

అసమానతలు ఉన్నచోటే.. పైకి ఎదగాలన్న ఆర్తి రగులుతున్న చోటే.. ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందన్న సిద్ధాంతమే ఇప్పటికీ చెలుబాటు అవుతోంది. ప్రభుత్వ నియంత్రణలు తక్కువగా ఉంటే కొత్త ఆవిష్కరణలతో, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలతో, ప్రయోగశీల మనస్తత్వంతో ఆర్థిక వ్యవస్థ కొత్తదారులు పడుతుందన్నది స్థూలంగా నిజమే కావచ్చు! కానీ ఆ కొత్తదారులతో అసమానతలు విపరీతంగా పెరిగి ప్రజాస్వామ్యానికీ, పర్యావరణానికీ, ఆర్థికాభివృద్ధికీ అడ్డంకులుగా మారుతున్న దృశ్యం ప్రపంచవ్యాప్తంగా కనపడుతోంది. అసమానతలు కలగచేసే విపరిణామాలపై ప్రసరిస్తున్న కొత్తవెలుగులతోనైనా వాటిని కట్టడి చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోతే మానవాళి మనుగడే ప్రమాదంలో పడిపోతుంది. సామాజిక జీవితం సాఫీగా నడవాలంటే ఆ జీవితంలో భాగస్వాములైన వారి మధ్య పరస్పరం మంచి జరుగుతుందనే నమ్మకం ఉండాలి. సమానత భావం ఎంతో కొంత ఉండాలి. సౌహార్దత నెలకొనాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలూ, సంస్థలూ మనకోసం పనిచేస్తాయనే భరోసా ఉండాలి. మితిమీరుతున్న అసమానతలు వీటన్నిటినీ దెబ్బతీస్తున్నాయి. అందుకే అన్ని అనర్థాలకు మూలం అసమానతలేనన్న భావం బలపడుతోంది!

"సామాజిక జీవితం సాఫీగా నడవాలంటే ఆ జీవితంలో భాగస్వాములైన వారి మధ్య పరస్పరం మంచి జరుగుతుందనే నమ్మకం ఉండాలి. సమానత భావం ఎంతో కొంత ఉండాలి. సౌహార్దత నెలకొనాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలూ, సంస్థలూ మనకోసం పనిచేస్తాయనే భరోసా ఉండాలి. మితిమీరుతున్న అసమానతలు వీటన్నిటినీ దెబ్బతీస్తున్నాయి. అందుకే అన్ని అనర్థాలకు మూలం అసమానతలేనన్న భావం బలపడుతోంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)


రాజకీయలబ్ధి కోసమే రాహుల్ కుట్రలు

"పరిపాలన చేస్తున్నప్పుడు– 'ప్రజల్ని ఎదగనివ్వకూడదు, ఎదిగితే ఎదురు తిరుగుతారు.' పరిపాలనలో లేనప్పుడు– 'ఎదగలేకపోయారు' అని రెచ్చగొట్టి మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేయాలి." ఈ సింపుల్ లాజిక్‌తో దేశాన్ని ఏడు దశాబ్దాలుగా నాశనం చేస్తూ వచ్చిన నెహ్రూ పరివారం ఇప్పటికీ మారలేదు. 'దేశమంటే మా ఆస్తి' అనుకునే ఆ పరివారంలో తెలివి మీరిన వారసుడు రాహుల్‌గాంధీ. నాడు తమ పూర్వీకులు చేసిన కుట్రల్నే నేడు ఆయన దేశంపై చేస్తున్నారు. కానీ చేతిలో అధికారం లేదు. కాబట్టి ప్రజల మధ్య చిచ్చు పెట్టి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కులాన్ని ఆయుధంగా ఎంచుకున్నారు.

బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ 'సైన్యానికి, న్యాయవ్యవస్థ'కు కులాన్ని అంటగట్టేశారు. 'పదిశాతం జనాభా ఉన్న కులాలే ఆయా వ్యవస్థల్ని నడిపిస్తున్నాయని, బడుగు, బలహీన వర్గాలకు అవకాశం రాలే'దని మొసలి కన్నీళ్లు కార్చారు. అదే నిజమైతే ముందుగా ఆ బడుగు, బలహీనవర్గాలన్నీ కలిసి నిర్దాక్షిణ్యంగా శిక్షించాల్సింది రాహుల్‌తో సహా నెహ్రూ పరివారాన్నే. ఎందుకంటే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రెండు తరాల పాటు వారే దేశాన్ని పరిపాలించారు. దేశ ప్రజలందర్నీ సమానంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తీసుకున్న కాంగ్రెస్ పార్టీ అత్యంత ఘోరంగా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను ఎదగనీయకుండా చేసింది. ఎప్పటికీ వారిని ఆశలపల్లకిలో ఉంచి ఓటు బ్యాంకుగా మార్చుకుంది. ఫలితంగా వారు ఏడు దశాబ్దాల తర్వాత కూడా వెనుకబడే ఉన్నారు. ఇప్పుడు ఆ వెనుకబాటునే చూపించి రాహుల్‌గాంధీ మరోసారి వారిని రెచ్చగొట్టి రాజకీయలబ్ధి పొందాలనుకుంటున్నారు.

కాంగ్రెస్ పాలనలో డా. బి.ఆర్. అంబేడ్కర్ (1950లో మొదటి చట్టం) ప్రభావంతో ఎస్సీ ఎస్టీలకు 22.5శాతం రిజర్వేషన్లు (విద్య, ఉద్యోగాలు) అమలు చేశారు. 1990లో మండల్ కమిషన్ (OBCలకు 27శాతం)ను వీపీ సింగ్ (కాంగ్రెస్ మద్దతు) అమలు చేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఆ అరవై ఏళ్లలో ఈ వర్గాల స్థితిగతుల్లో పెద్ద మార్పేమీ లేదు. నాటి కాంగ్రెస్ నాయకత్వంలో అగ్రవర్ణాల ఆధిపత్యం ఎక్కువగా ఉండేది. నెహ్రూ, ఇందిరా పాలనలో ఎస్సీలకు మంత్రి పోస్టులు కేవలం 5 శాతం మాత్రమే. కాంగ్రెస్ పాలనలో RTE (2009) వంటి చట్టాలు వచ్చినా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సమాన విద్య అందలేదు. 1991 సంస్కరణల తర్వాత ఆర్థికవృద్ధి అర్బన్ ఎలైట్‌కు మాత్రమే పరిమితమైంది. ఇవన్నీ కాంగ్రెస్‌కు తెలియక కాదు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను కాంగ్రెస్ ఎదగకుండా చేసింది. ఎప్పటికీ వారిని ఆశల పల్లకిలో ఉంచి ఓటు బ్యాంకుగా మార్చుకుంది. ఫలితంగా వారు ఏడు దశాబ్దాల తర్వాత కూడా వెనుకబడే ఉన్నారు. ఇప్పుడు ఆ వెనుకబాటునే చూపించి రాహుల్‌గాంధీ మరోసారి వారిని రెచ్చగొట్టి రాజకీయలబ్ధి పొందాలనుకుంటున్నారు.



'సామాజిక న్యాయం' పేరు చెప్పి, కార్పొరేట్ లాబీలకు తమ పార్టీ మొగ్గు చూపిందని రాహుల్‌గాంధీ గత ఏడాది స్వయంగా ఒప్పుకున్నారు. నాడు కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే 'వెనుకబడిన వర్గాల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా'ను అమలు చేయలేదు. 2004 నుంచి 2014 మధ్యకాలంలో పదేళ్లపాటు రాహుల్ రాజ్యాంగేతరశక్తిగా అధికారంలో ఉన్నారు. ఏకంగా తమ సొంత ప్రభుత్వ కేంద్ర కేబినెట్ నిర్ణయాల పత్రాలను మీడియా సమావేశంలో చించి, చెత్తబుట్టలో వేసి అధికారం చెలాయించారు.

కానీ... బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ప్రజలందర్నీ సమానంగా అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంది. 70 ఏళ్ల పాటు కొనసాగిన వివక్షను తొలగించి, అందర్నీ సమాన స్థాయికి తీసుకురావడానికి ఓ యజ్ఞమే చేస్తోంది. నేడు చీఫ్ జస్టిస్ స్థాయికి ఓ దళిత బహుజనుడు ఎదిగారంటే దానికి కారణం ఎవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత EWSకు 10 శాతం రిజర్వేషన్, SC/ST సబ్ ప్లాన్ అమలు, PM కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్, స్కాలర్‌షిప్స్... వంటి చర్యలతో ఈ వర్గాల లిటరసీ రేటు 10–15 శాతానికి పెరిగింది. ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం 20శాతానికి చేరింది. NSSO 2023 రిపోర్ట్ ప్రకారం, ఈ వర్గాలు GDPలో కంట్రిబ్యూషన్ 12శాతానికి పెరిగింది (2014లో ఇది కేవలం 8శాతం). సుప్రీంకోర్టు జడ్జిల్లో 4/34 (12 శాతం), IASలో ఓబీసీ 18శాతం, ఎస్సీ 15శాతం, ఎస్టీ 6శాతం– మొత్తం 39శాతం ప్రాతినిధ్యం లభిస్తోంది. ఈ ప్రగతి 'సబ్‌కా సాథ్–సబ్‌కా వికాస్' అజెండాతో జరిగింది. నీతి ఆయోగ్ 2024 రిపోర్ట్ ప్రకారం 2014–24 మధ్య ఈ వర్గాలు 2.5 కోట్ల పీఎం ఆవాస్ ఇళ్లు, 10 కోట్ల ఉజ్వల కనెక్షన్లు పొందాయి. ఆయా వర్గాల్లో ఆర్థిక అభివృద్ధి 8.5శాతం పెరిగింది.

బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్ల అమలు మెరుగుపడింది. DoPT ప్రకారం 2023లో ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ నియామకం రేటు 85శాతంగా ఉన్నట్లుగా ప్రకటించింది. 2014లో ఇది 70శాతం శాతమే. విద్యలో PM విద్యాలక్ష్య, 6,000 PM శ్రీ విద్యాలయాలు – ASER 2024: SC/ST లిటరసీ 72శాతం (2014లో 62శాతం), OBC 78శాతం (నాడు 68శాతం). ఆర్థికంగా చూస్తే... జన్‌ధన్ యోజన (50 కోట్ల అకౌంట్లు, 70శాతం– SC/ST/OBC), ముద్రా లోన్‌లు (60శాతం ఈ వర్గాలకే) ఇచ్చారు. RBI 2024 రిపోర్టు ప్రకారం ఈ వర్గాలు MSMEలలో 45శాతం లబ్ధి పొందుతున్నాయి (2014లో ఇది 30శాతం మాత్రమే). 2014–24 మధ్య ఈ వర్గాలు 15 మిలియన్ల ఉద్యోగాలు పొందాయని.. పేదరికం 25శాతం నుంచి 12శాతానికి తగ్గిందని నీతి ఆయోగ్ స్పష్టంగా తెలిపింది. మోదీ ప్రభుత్వం చేపట్టిన 102వ రాజ్యాంగ సవరణ చట్టం, 2018 ద్వారా 'వెనుకబడిన వర్గాల జాతీయ కమిషన్ (NCBC)కు రాజ్యాంగ హోదా' కల్పించడం భారత ప్రజాస్వామ్యంలో చరిత్రాత్మక అడుగుగా నిలిచింది. ఈ సవరణతో Article 338B కింద NCBC ఒక స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా రూపుదిద్దుకుంది.

ఈ వివరాలను విశ్లేషించుకుంటే ఇప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అరవై ఏళ్ల పాటు వారిని ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం తొక్కిపెట్టింది. ఇప్పుడు వారిని బీజేపీ పైకి తీసుకువస్తూంటే.. కులగణన పేరుతో రెచ్చగొట్టి వారిని మరోసారి ఎదగకుండా చేసేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారు. నెహ్రూ పరివారంలో చివరి వారసుడి తెలివితేటలను ఇప్పుడు అందరూ గమనిస్తున్నారు. నెహ్రూ చేసిన తప్పులే దేశానికి రాచపుండ్లుగా మారాయి. వాటన్నింటినీ బీజేపీ ప్రభుత్వం మాన్పుతూ వస్తోంది. ఇప్పటికైనా కాంగ్రెస్ తాము ఒప్పుకున్న తప్పిదాలను గుర్తు చేసుకుని.. వాటిని సరిదిద్దుకునేలా రాజకీయాలు చేయాలి. లేకపోతే ప్రజాస్వామ్యంలో మనుగడ సాగించడం అసాధ్యం.

● ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి
బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

మాతృ మరణాలను నివారించాలి

- గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి
- వైద్యాధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశాలు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాతృ మరణాల నివారణే ప్రాధాన్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్ష కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. 2025 మే నుంచి అక్టోబరు వరకు జరిగిన 8 మాతృ మరణాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతృ మరణాలు సంభవించకుండా గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య అధికారులు ఆరోగ్య, ఆశా, ఎంఎల్‌హెచ్‌పీలు సమన్వయంతో నిరంతరం విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. హైరిస్కు గర్భిణులను డాక్టర్లు, సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆరోగ్య పరీక్షలు, పౌష్టికాహారం, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించాలన్నారు. రక్త పోటు విషయంలో గర్భవతులను చైతన్యం చేయాలన్నారు. హైరిస్క్ ఏఎన్‌సీల జాబితాలను జిల్లా స్థాయి ఆస్పత్రులకు కీ షేర్ చేయాలన్నారు. చికిత్సకు సంబంధించిన డాక్యుమెంట్లు సక్రమంగా నిర్వహణ, పర్యవేక్షణ చేయాలని, తప్పులు లేకుండా నివేదికలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఏఎస్ శ్రావణ్‌బాబు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు డాక్టర్ అరుణ, డాక్టర్ రాధికారాయుడు, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ భార్గవ్, శ్రీధర్ రెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పార్కులు, చెరువుల అభివృద్ధికి రూ.18 కోట్లు

- పనులను పరిశీలించిన ఏపీజీబీసీ ఎండీ శ్రీనివాసులు

మంగళగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో ఆహ్లాదాన్ని పంచే పచ్చదనాన్ని కనువిందు చేసేలా రూ.18 కోట్లతో పార్కులు, చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ ఎంకేవీ శ్రీనివాసులు తెలిపారు. ఆయా అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. కాజ చెరువు చుట్టూ అభివృద్ధి చేస్తున్న వాకింగ్‌ట్రాక్‌ను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో తొమ్మిది పార్కులు, మూడు చెరువు లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందులో ఎనిమిది పనులను తమ కార్పొరేషన్ చేపట్టగా, మిగతా రెండు పనులను అమరావతి అభివృద్ధి సంస్థ చేపట్టిందన్నారు. ఏడీసీ ఆధ్వర్యంలో టిడ్కో కాలనీ వద్ద రూ.9 కోట్లతో పార్కు, నులకపేట చెరువును రూ.3 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులు రూ.2.7 కోట్లతో కాజ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామికాలనీలో ఇప్పటికే రూ.1.06 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పార్కు నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించామన్నారు. కొండపనేని టౌన్‌షిప్‌లో రూ.1.23 కోట్లతో పార్కు నిర్మాణం జరిగిందన్నారు. తాడేపల్లి నవోదయకాలనీలో రెండు పార్కుల నిర్మాణాన్ని తమ కార్పొరేషన్ చేపట్టిందన్నారు. ఇప్పటం చెరువు అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. త్వరలోనే మంగళగిరి అందమైన పార్కులతో కళకళలాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనరు ఆలీబాషాఖాన్, ఉద్యాన శాఖాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.



పార్కులో పరికరాలను పరిశీలిస్తున్న శ్రీనివాసులు, తదితరులు



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న పట్టాభి, పక్కన ఎమ్మెల్యే నసీర్

టీడీపీకి కార్యకర్తలే బలం.. బలగం

నాయకులను తయారు చేసే కర్మాగారం

తూర్పు కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో పట్టాభి

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం, బలగమని స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం పార్టీ విజన్ కమిటీ, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జి కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పట్టాభి మాట్లాడుతూ నాయకులను తయారు చేసే కర్మాగారం టీడీపీ అని తెలిపారు. సీఎం చంద్రబాబు చెప్పిన మాట చెప్పినట్లు అమలు చేయడంతోనే ధైర్యంగా ప్రజల మధ్యకు వెళ్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఒకటో తేదీన పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నట్లు తెలిపారు. అన్న క్యాంటీన్లతో పేదలు తృప్తిగా భోజనం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నామని తెలిపారు. మౌజన్లు, ఇమామ్‌ల గౌరవ వేతనం రూ.90 కోట్లు విడుదల చేసిన సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఐసీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, టీడీపీ సీనియర్ నాయకుడు రాజామాస్టర్, చిట్టాబత్తిన చిట్టిబాబు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు.

రూ.1.30 కోట్ల పనులకు శంకుస్థాపన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో అభివృద్ధి శకం ఆరంభమైందని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. స్థానిక హస్సేన్‌నగర్‌లో రూ.1.30 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఈ ప్రాంతాలకు రావాలంటే కనీసం ఆటోవాలాలు కూడా భయపడే పరిస్థితి ఉండేదన్నారు. ఏడాది కాలంలోనే అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.

- నగదు కోసం రైతుల ఎదురుచూపులు
- కొనుగోళ్లు నిలుపుదల చేసిన మార్క్‌ఫెడ్
- నాలుగు నెలలుగా పలువురు రైతులు నిరీక్షణ
- మొంథా నష్టం.. అదనపు కొనుగోళ్లపై రాని స్పష్టత

బర్లీ బకాయిలు రూ.38 కోట్లు



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు తమ గోడు వెళ్లబోసుకుంటున్న బర్లీ రైతులు (పాత చిత్రం)

ఆందోళనలో ఉన్న బర్లీ పొగాకు రైతులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేసింది. నిధులకు ఇబ్బంది లేకుండా రూ.250 కోట్లు కూడా కేటాయించింది. ఆత్మహత్యలే శరణ్యమనే భావనలో ఉన్న బర్లీ సాగుదారులు ప్రభుత్వ చర్యలపై ఆనందం వ్యక్తం చేశారు. అయితే నాలుగు నెలలు అవుతున్నా పలువురు రైతుల ఖాతాల్లో బర్లీ నగదు జమ కాలేదు. మార్క్‌ఫెడ్ కొనుగోళ్లను కూడా నిలిపేసింది. అయినా ఇంకా బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాతో పాటు ప్రకాశం జిల్లాకు సంబంధించి ఇంకా రూ.38 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని సమాచారం. కొనుగోళ్లు ప్రారంభంలో పొగాకును మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో విక్రయించినా తమకు ఇంకా నగదు జమ కాలేదని కొందరు రైతులు వాపోతున్నారు. కాగా ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిగా బర్లీ పొగాకు నిల్వలను కొనుగోలు చేస్తామని ప్రకటించింది. కానీ పలువురు రైతుల వద్ద ఇంకా పొగాకు నిల్వలు ఉన్నా కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ నిలిపేసింది. ఈ పరిస్థితుల్లో కొనుగోళ్లను కొనసాగించాలని ఒకవైపు రైతులు అభ్యర్థిస్తుండగా ప్రభుత్వం ఎటూ తేల్చలేదు. పైగా ఇటీవల వర్షాలతో బర్లీ రైతులు నష్టపోగా పరిహారంపై స్పష్టత లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

మూడు వారాల క్రితం బర్లీ పొగాకు కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ నిలుపుదల చేసింది. అయితే బకాయిల జమ విషయం, రైతుల వద్ద ఇంకా నిల్వ ఉన్న పొగాకు విషయంపై అటు ప్రభుత్వం, ఇటు మార్క్‌ఫెడ్ ఎటూ తేల్చడంలేదు. కొనుగోళ్ల ప్రారంభం నుంచి కూడా పలువురు రైతులకు నగదు జమ కాలేదని సమాచారం. మొత్తంగా చూస్తే బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో రూ.38 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కాగా ఇందులో ఒక్క బాపట్ల జిల్లాకు సంబంధించే రూ.30 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. అయితే రూ.100 కోట్ల వరకు రైతుల (మిగతా 6వ పేజీలో)

తాజాగా కలెక్టర్ దృష్టికి...

బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి డబ్బులు ఇంకా తమ ఖాతాల్లో జమ అవలేదని పర్చూరు పర్యటనలో భాగంగా పలువురు బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. తుఫాన్ తమను మరింతగా కుంగదీసిందని బర్లీకి జరిగిన నష్టంపై కూడా పరిహారం అందించాలని రైతులు కలెక్టర్‌ను అభ్యర్థించారు. పంట నష్టం జాబితాలో బర్లీకి చోటు కల్పించడానికి కొన్ని సాంకేతిక పరమైన చిక్కులు అవరోధంగా ఉన్నాయని, బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.

రాజధాని లేఅవుట్లకు మహర్దశ



- రూ.1863 కోట్లతో మౌలిక సదుపాయాలు
- జోన్-8లోని గ్రామాల లేఅవుట్లకే ఈ నిధులు
- పరిపాలన అనుమతితో త్వరలో టెండర్లు నిర్వహణ

సౌకర్యాలు ఇలా..

- రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, డ్రెయినేజి వ్యవస్థ, పవర్, ఐసీటీ యుటిలిటీ డక్ట్స్, పునర్ వినియోగ నీటి పైపులైను, సీవ రేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఎవెన్యూ ప్లాంటే షన్, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితరాల అభివృద్ధి.

జోన్-8లోని గ్రామాలు

కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కీలకమైన ఎల్‌పీఎస్ లేఅవుట్ల అభివృద్ధికి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి(సీఆర్‌డీ) శాఖ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం జోన్-8లోని గ్రామాల్లో ఏకంగా రూ.1863 కోట్లను ఖర్చు చేయనున్నది. దీంతో లేఅవుట్ల స్వరూపమే మారిపోనున్నది. లేఅవుట్ల అభివృద్ధి ప్రారంభమైతే రాజధానికి వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునే కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని సీఆర్‌డీఏ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతేకాకుండా అమరావతి రాజధాని కోసం భూములు ఇచ్చి సహకరించిన రైతులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నట్లు అవుతుందంటున్నాయి.

రైతులతో ఒప్పందం మేరకు..

ల్యాండ్ పూలింగ్ స్కీమ్(ఎల్‌పీఎస్) కింద భూములు సేకరించే సమయంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్లు ఇస్తామని సీఆర్‌డీఏ ఒప్పందం చేసుకున్నది. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, విద్యుత్ తదితర సౌకర్యాలను అభివృద్ధి చేసి ప్లాట్లు ఇస్తామని గతంలో పేర్కొన్నది. ఆ మేరకు జోన్-8లో ఉన్న గ్రామాలతో పాటు పెనుమాక లేఅవుట్ పరిధిలోనూ అభివృద్ధి చేయ నున్నది. దీంతో ఆయా ప్రాంతాల్లో వేగవం తంగా నివాసాలు, వాణిజ్య సముదాయాలు, భవంతులు నిర్మాణం జరుగుతాయని సీఆర్‌డీఏ వర్గాలు చెబుతున్నాయి.

ఏడీసీఎల్ ద్వారా పనులు

అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏడీసీఎల్) ద్వారా లేఅవుట్ల అభివృద్ధి పనులను సీఆర్‌డీఏ చేయించనున్నది. జోన్-8లోని లేఅవుట్ల పనులను ఒకే ఏజెన్సీకి అప్పగించాలని నిర్ణయించింది. ఆ మేరకు టెండర్లు నిర్వహించి ఏజెన్సీని ఖరారు చేయనుంది. పనులకు పరిమితి రెండేళ్లుగా నిర్ణయించింది. దీంతో లేఅవుట్ల అభివృద్ధి పూర్తి చేసిన తర్వాత రెండేళ్లలో ఏదైనా లోపం తలెత్తితే సంబంధిత ఏజెన్సీనే సరిచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పరిపాలన అనుమతి మంజూరు చేసిన నేపథ్యంలో కొద్ది రోజుల్లోనే టెండర్లు నిర్వహించి ఏజెన్సీని ఖరారు చేస్తారు.

సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు ఏజెన్సీల ఖరారు

జోన్-1, 2, 3, 5, 6లో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను అభివృద్ధి చేసే పనులను మేఘా ఇంజనీరింగ్ సంస్థ దక్కించుకున్నది. రూ.274 కోట్ల 76 లక్షల 30 వేల 470తో ఆ సంస్థ ఈ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించనున్నది. ఏడేళ్ల పాటు ఓఅండ్ఎం కూడా చూసుకోనుంది. జోన్ - 4, 7, 9, 10లో ఎస్‌టీపీలను రూ.304 కోట్ల 60 లక్షల 30 వేల 707తో మేగా ఇంజనీరింగ్ సంస్థ దక్కించుకున్నది. అలానే జోన్-12, 12ఏలలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను రూ.217 కోట్ల 52 లక్షల 53 వేల 567తో నిర్మించ నుంది. వీటిని కూడా ఆ సంస్థ ఏడేళ్ల పాటు నిర్వహించనుంది.

అమరావతి క్వాంటం సెంటర్‌కు టెండర్లు

అమరావతిలో క్వాంటం కంప్యూటేషన్ సెంటర్(ఏక్యూసీసీ)ని నెలకొల్పేందుకు ప్ర భుత్వం సీఆర్‌డీఏకి అనుమతులు మం జూరు చేసింది. దీనిని రూ.99.62 కోట్లతో అభివృద్ధి చేయనుంది. రిక్వెస్టు ఫర్ ప్రపో జల్ (ఆర్ఎఫ్‌పీ) విధానంలో టెండర్లు ఆహ్వానిస్తారు.

వెంకటపాలెం ఏరియల్ వ్యూ





కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న మందు బాబులు

డ్రంకెన్ డ్రైవ్.. ఒకరికి వారం జైలు

- మరో 19 మంది మందుబాబులకు జరిమానా
- కోర్టు పరిసరాలు శుభ్రం చేయాలన్న న్యాయాధికారి

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపరాదు.. అది మీకే కాదు.. తోటి ప్రయాణికులకు కూడా ముప్పే.. అంటూ పోలీసులు హెచ్చరికలను మందుబాబులు బేఖాతరు చేస్తున్నారు. పట్టుబడితే జరిమానా కడతాం.. అంటూ నిర్లక్ష్యంగా మద్యం మత్తులో రయ్‌రయ్ అంటూ దూసుకెళ్లే వారి ఆటలను పోలీసులు కట్టించారు. ఏకంగా వారిని పట్టుకుని కోర్టులో ప్రవేశ పెట్టారు. న్యాయాధికారి ఒకరికి జైలు శిక్ష విధించగా.. మరో 19 మందికి జరిమానాతో పాటు కోర్టు పరిసరాల పరిశుభ్రం చేయాలన్న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పుతో అయినా మందుబాబులు మేల్కొంటారో లేదో చూడాలి. ఇటీవల తూర్పు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. ఈ క్రమంలో పట్టుబడిన మండే రాజేష్ అనే వ్యక్తికి న్యాయస్థానం వారం జైలు శిక్ష విధించింది. అదేవిధంగా మరో 19 మందికి జరిమానాతో పాటు కోర్టు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని న్యాయస్థానం శిక్ష విధించింది. దీంతో గురువారం వారంతా కోర్టు ఆవరణ శుభ్రం చేస్తున్న దృశ్యాలు అటు న్యాయవాదులను, ఇటు కక్షిదారులను ఆకట్టుకున్నాయి. ఆ మందుబాబుల కారణంగా కోర్టు పరిసరాలు శుభ్రంగా మారాయి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లక తప్పదన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఖచ్చితత్వంతో సర్వే చేయాలి

- రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- శ్రీరంగపురం రీసర్వే పరిశీలనలో జేసీ శ్రీవాత్సవ

చేబ్రోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూ సర్వే ప్రక్రియలో ఖచ్చితత్వం పాటించాలని జేసీ అషితోష్‌శ్రీవాత్సవ తెలిపారు. మండలంలోని శ్రీరంగపురంలో జరుగుతున్న రీ సర్వే పనుల పురోగతిని జేసీ సమీక్షించారు. అంతకముందు చేబ్రోలు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత దేవదాయ శాఖకు చెందిన భూములపై రైతులు, దేవాదాయశాఖ మధ్య నెలకొన్న వివాదాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఇరుపక్షాల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యను పరిష్కరించే దిశగా అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.



రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జేసీ శ్రీవాత్సవ

షాక్ నుంచి ఊరట



- యూనిట్‌కు 13 పైసలు తగ్గింపు
- ఈ నెల నుంచే అమల్లోకి ట్రూడౌన్
- విద్యుత్ వినియోగదారులకు రూ.32 కోట్లు లబ్ధి

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గతంలో ట్రూ అప్ చార్జీలతో కరెంటు బిల్లులు షాక్ కొట్టాయి. వినియోగించిన విద్యుత్‌కు వచ్చే బిల్లుకు పొంతన లేక వినియోగదారులు అల్లాడిపోయారు. ఎప్పుడో.. ఎవరో వినియోగించిన విద్యుత్‌కు తమపై ఈ భారం ఏమిటంటూ అద్దె ఇళ్లలోని వారు ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. అయితే ఇలాంటి వారికి కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత ఎన్నికల ప్రచారంలో విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లుగా కొంత ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెలలోనే ట్రూ డౌన్ చేస్తూ బిల్లుల్లో ఆ మేరకు నగదు మినహాయించారు. గతంలో షాక్ కొట్టేలా ఉన్న కరెంటు బిల్లులకు ఇప్పుడు కొంత మేరు ఉపశమనం కల్పిస్తూ ఉన్న బిల్లులను చూసి వినియోగదారులు కొంత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎఫ్‌పీపీసీఏ చార్జీలలో ట్రూ డౌన్ పేరుతో యూనిట్‌కు 13 పైసలు తగ్గింపు ప్రక్రియ ఈ నెల నుంచే అమల్లోకి వచ్చింది. ఇంధన, విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు (ఎఫ్‌పీపీసీఏ) ట్రూ డౌన్ రీఫండ్ అమలు కోసం 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగించిన యూనిట్లకు 13 పైసలను తిరిగి బిల్లుల్లో జమ చేయనున్నారు. వచ్చే ఏడాది అక్టోబరు వరకు ఈ ప్రక్రియ జరగనున్నట్లు ఇంధన సంస్థలు ప్రకటించాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగించిన యూనిట్లకు 13 పైసలు తగ్గించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీఆర్‌డీఏ, గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్ పరిధిలోని డివిజన్‌లలో గణాంకాలు లెక్కించగా రూ.32 కోట్లు వరకు వినియోగదారులకు లబ్ధి జరగనున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి నెలనెలా వినియోగించిన యూనిట్లను లెక్కించనున్నారు. 2024 ఏప్రిల్ నుంచి నెల నెలా లెక్కించి ప్రస్తుత బిల్లుల్లో జమ చేస్తారు. అయితే ఏప్రిల్ 2024 బిల్లులో వినియోగించిన యూనిట్లకు 13 పైసలు చొప్పున కలిపి నవంబరు బిల్లులో జమ చేసి బిల్లులో మైనస్ చేసి బిల్లులు అందజేస్తున్నారు.

అద్దెకు ఉండే వారికి మరింత మేలు..

ఎఫ్‌పీపీసీఏ చార్జీల బాదుడుతో అద్దెలకు ఉండే వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అయితే ఇది గతంలో పరిస్థితి. ప్రస్తుత ట్రూ డౌన్ ఛార్జీతో ఇప్పుడు అద్దెలకు ఉండే వారికి మేలు జరగనున్నది. గతంలో అద్దెకు ఉన్న వారు విద్యుత్ వినియోగం అత్యధికంగా చేసి ఉంటే అదే ఇంట్లో ప్రస్తుతం అద్దెకు ఉండే వారికి బిల్లులో ఊరట కలగనున్నది.



ట్రూ డౌన్ పేరుతో బిల్లుల్లో జమ చేసిన మొత్తం

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు..యువకుడి మృతి

దాచేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి అతివేగంగా ప్రయాణిస్తున్న కారు.. ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందగా.. వెనుక కూర్చున్న మరో యువకుడికి కాలు విరిగిన ఘటన బుధవారం రాత్రి నడికుడి మలుపు వద్ద జరిగింది. పోలీసులు, బంధువుల వివరాల మేరకు.. గుంటూరు నుంచి సిద్ధిపేటకు మితిమీరిన వేగంతో వస్తున్న కారు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తాడిపర్తి విజయ్‌కుమార్‌రెడ్డి (28)ని వేగంగా ఢీకొట్టింది. దీంతో విజయ్‌కుమార్‌రెడ్డి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బండిపై ఉన్న మరో యువకుడు కుడి కాలు విరిగి తీవ్ర రక్తస్రావమైంది. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. విజయ్‌కుమార్‌రెడ్డి మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి దాచేపల్లిలో ఎరువుల కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుమారుడికి వివాహ ప్రయత్నాలు చేస్తుండగా.. ఈలోగా ఈ ఘటన జరగడంతో కుటుంబం తల్లడిల్లిపోతోంది. సీఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దుగ్గిరాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. చింతలపూడి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడి ఆసుపత్రి పాలైన విషయం విధితమే. గాయపడిన వారిలో అంగలకుదురుకు చెందిన దుడ్డి ప్రశాంత్(31)ని 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అనంతరం ప్రశాంత్‌ను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై ఎస్. వెంకటరవి తెలిపారు.

ఏఎన్‌యూ దూరవిద్య

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, నవం బరు 14 (ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగా ర్జున విశ్వ విద్యాలయం దూరవిద్య కేం ద్రం పరిధిలో జూలై, ఆగస్టులో జరిగిన పలు పీజీ కోర్సుల పరీక్ష ఫలితా లను దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయల పాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ గురువారం విడుదల చేశారు. ఎంఏ సంస్కృతం, పొలిటికల్ సైన్స్ మొదటి, ద్వితీయ, తృతీయ, నాల్గవ సెమిస్టర్, ఎమ్మెస్సీ జువాలజీ, బోటనీ, మైక్రో బయాలజీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు ఈ నెల 29 తేదీలోగా అందజేయాలని సూచించారు. పరీక్షల విభాగ డిప్యూటీ రిజిస్ట్రార్ జైనలుద్దీన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కృష్ణవేణి, కోదండపాణి, టంకశాల వెంకటేశ్వర్లు, ఉద్యోగి వలి పాల్గొన్నారు.

రంగు మారిన పత్తిని తీసుకురావొద్దు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుడ్డి, కౌడి, రంగుమారిన పత్తిని జిల్లాలోని పత్తి కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకురావొద్దని వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి సత్యనారాయణ చౌదరి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఏఎంసీల పరిధిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లను ప్రారంభించామన్నారు. పత్తి రైతులందరూ తమ పేర్లను వారికి సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకొని కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. పత్తిని లూజు రూపంలో ఆరబెట్టుకొని తీసుకురావాలని తెలిపారు.

సమర్థంగా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లు

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల అభివృద్ధి కోసం విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లను ఏర్పాటు చేసి సమర్థంగా పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 6 నియోజకవర్గాలకు సంబంధించిన విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ల సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో విజన్ యాక్షన్ ప్లాన్ బాపట్ల నియోజకవర్గ యూనిట్ ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యాలయ ప్రాంగణం మొక్కలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారికి, ఎమ్మెల్యేకు ప్రత్యేక క్యాబిన్‌లు ఏర్పాటు చేశారని.. ఈ విధంగా ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని సూచించారు. అద్దంకి నియోజకవర్గంలో ఎంపీడీఓ కార్యాలయం 2వ అంతస్తులో, పర్చూరు నియోజకవర్గంలో కొల్లావారిపాలెం పంచాయతీ కార్యాలయంలో, చీరాల నియోజకవర్గంలో ఎంపీడీఓ కార్యాలయం, రేపల్లె నియోజకవర్గంలో ఎన్టీఆర్ ప్రాథమిక పాఠశాల మొదటి అంతస్తులో, వేమూరు నియోజకవర్గంలో ఎంపీడీఓ కార్యాలయం నందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో యాక్షన్‌ప్లాన్ యూనిట్ నిర్వాహణకు రూ.10లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో రూ.8 లక్షలు కార్యాలయ ఫర్నీచర్, ఉపకరణాలకు..రూ. 2లక్షలు కార్యాలయ పెయింటింగ్, మరమ్మతులకు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి కార్యాలయానికి ఫర్నీచర్, ఉపకరణాలు సరఫరా చేశారన్నారు. పెయింటింగ్, మరమ్మతులు పది రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. సిబ్బంది పూర్తి బాధ్యత నియోజకవర్గ ప్రత్యేకాధికారిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లను తనిఖీ చేస్తామన్నారు. ఈ సమయంలో అందరు ఐడీ కార్డు ధరించి ఉండాలని, కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఫర్నీచర్, ఉపకరణాలను పరిశీలించి సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళికాధికారి షాలెం రాజు, విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, విద్యుత్ ఈఈలు, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయండి

● అధికారులకు జడ్పీ చెర్‌పర్సన్ ఆదేశం



మాట్లాతున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆదేశించారు. స్థానిక గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం 15 ఆర్థిక సంఘం, సాధారణ నిధులపై జరిగిన సమీక్ష సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఆయా నిధులు కింద చేపట్టిన పనులు ఏ దశలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని పనులు పూర్తి కాగా మరికొన్ని మధ్య దశలో ఉన్నాయని, ప్రారంభించాల్సిన పనులు కూడా మిగిలి ఉన్నాయని అధికారులు తెలిపారు. వాటి వివరాలను తనకు తెలియజేయాలని చైర్‌పర్సన్ కోరారు. 2025 -26 సంవత్సరానికి పనుల అంచనాలు తయారు చేసి, 2026- 27 బడ్జెట్ కూడా తయారు చేయాలని ఆమె అధికారులను కోరారు. అదేవిధంగా శిలాఫలకాల విషయంలో ప్రొటో కాల్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ, ఏఓలు, మూడు జిల్లాల పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీలు, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

● సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాథన్

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా స్థాయిలో పనిచేస్తున్న పాత్రికేయులకు రెండేళ్ల (2026 - 2027) కాలపరిమితికి సమాచార, పౌర సంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్‌లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు అర్హత కలిగిన పాత్రికేయుల దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తారని తెలిపారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 30 నాటికి ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. దరఖాస్తుల నమోదుకు ముందుగా మీడియా సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపరచాల్సి ఉన్నందున సంబంధిత పత్రాలను పెన్‌డ్రైవ్‌లో పొందు పరిచి, కాపీలను గుంటూరు బ్రాడీపేటలోని డీపీఆర్వో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అనంతరం పాత్రికేయులు నవంబర్ 14వ తేదీ నుంచి ఝ్ఛుజీజీఛ్ట్ఛుజ్ఞ్చుజీ.ఞ్చ.జౌఠి.జీ వెబ్‌సైట్‌లో సూచించిన విధంగా సంబంధిత పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని డైరెక్టర్ పేర్కొన్నారు.

‘బర్లీ’ బకాయిలు.. రూ.38 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఖాతాల్లో జమ చేశామని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పలు గ్రామాల్లోని రైతులు మాత్రం ఇంకా తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని చెప్తున్నారు. బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమైన మొదటి వారంలోనే తమ ఉత్పత్తులను అమ్ముకున్న రైతులకు సైతం ఇంకా డబ్బులు జమ కాలేదని తెలుస్తోంది. దాదాపు నాలుగు నెలలుగా బకాయిలు జమ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. బర్లీ బకాయిల డబ్బుల వ్యథ ఇలా ఉంటే మొంథా తుఫాన్ రూపంలో నిల్వ ఉంచిన బేళ్లను మరింత దెబ్బతీసింది. మొంథా మిగిల్చిన నష్టాలకు సంబంధించి అన్ని పంటల గణన జరిగినప్పటికీ సాంకేతిక అంశాలతో ఆ జాబితాలో బర్లీ పొగాకు పేరు లేదు. దీంతో సాగుదారులు నీరుగారిపోయారు. ఇదే విషయాన్ని రైతులు తాజాగా కారంచేడులో పర్యటించిన కేంద్ర బృందం దృష్టికి కూడా తీసుకెళ్లారు.

రైతుల వద్ద ఇంకా 50 వేల క్వింటాళ్లు

క్షేత్రస్థాయిలో నాలుగు జిల్లాల పరిధిలోని రైతుల వద్ద ఇంకా 50,000 క్వింటాళ్ల బర్లీ నిల్వలు ఉంటాయనేది అంచనా. కాగా మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా రైతులు కలిసి పొగాకు కొనుగోళ్లపై అభ్యర్థించారు. ఈ క్రమంలో 20,000 క్వింటాళ్ల అదనపు బర్లీ కొనుగోళ్లపై జిల్లా అధికారులు మార్క్‌ఫెడ్‌కు పంపిన ప్రతిపాదనలపై ఇప్పటికీ కదలికలేదు. రోజులు గడుస్తున్నాయే కానీ అదనపు కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ నుంచి స్పందన లేకపోవడంతో ఆశలు వదులుకోవడమే మేలనే అభిప్రాయానికి దాదాపు రైతులు వచ్చారు. ఇందులో దాదాపు 10,000 క్వింటాళ్ల వరకు మొంథా తుఫాన్ దెబ్బకి పూర్తిగా నాణ్యత దెబ్బతిని లోగ్రేడ్ రకంలో చేరిపోయింది. అటు అదనపు కొనుగోళ్ల లేక, ఇటు మొంథా నష్ట పరిహార జాబితాలో తమకు చోటు దక్కక, బకాయిలకు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి బర్లీ రైతాంగానిది.

మెడికల్ షాపుల యజమానులకు బెదిరింపులు

తెనాలి క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నట్లు.. ఫేక్ ఫోన్ కాల్స్ చేస్తూ.. మందుల షాపుల యజమానులపై ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. సదరు అపరిచిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తెనాలి మెడికల్ అసోసియేషన్ సభ్యులు గురువారం డీఎస్పీ జనార్దనరావును ఆశ్రయించారు. సంజయ్ నాయుడు అనే వ్యక్తి ఫోన్ నంబరుతో(9885816566) తెనాలి ప్రాంతంలోని పలు మెడికల్ షాపులకు ఫోన్ చేసి.. తాను డ్రగ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేస్తున్నానని.. షాపునకు సంబంధించిన లైసెన్స్ రెన్యువల్ చేయించలేదుని, బిల్‌బుక్స్ సరిగా లేవని, ఫార్మాసిస్టు లేదు అంటూ పలు రకాలుగా బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఈ లెక్కల అవకతవకలను సరి చేయాలంటే వెంటనే ఫోన్ పే నంబరు 9154797584కు నగదు పంపాలని బెదిరిస్తున్నాడని వివరించారు. అదే వ్యక్తి మరికొందరికి 9491596093 నెంబర్‌తో కూడా బెదిరింపులకు దిగుతున్నాడని వెల్లడించారు. మూడు నెలల నుంచి ఈ విధంగా ఫోన్ చేస్తూ నగదు కోసం బెదిరిస్తున్నాడని అసోసియేషన్ సభ్యులు డీఎస్పీకి వివరించారు.

సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ స్పెషల్ ట్రైన్‌ని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07619 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 16న రాత్రి 7.40కి బయలుదేరి 10.28కి నడికుడి, 10.58కి పిడుగురాళ్ల, 11.38కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.35కి గుంటూరు, 17వ తేదీ ఉదయం 9.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందన్నారు.

అక్రమ లేఅవుట్లపై సీఆర్డీఏ కొరడా



అమరావతి మండలంలో అనధికార లేఅవుట్‌ను చదును చేయిస్తున్న సీఆర్డీఏ అధికారులు

తుళ్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లపై సీఆర్డీఏ కొరడా ఝులిపించింది. గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా సీఆర్డీఏ పరిధిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెంచర్లను ఏర్పాటు చేశారు. అందులో ప్లాట్లు కొన్నవాళ్లు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. వారం నుంచి సీఆర్డీఏ కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ అక్రమ లేఅవుట్‌లను గుర్తించి ధ్వంసం చేస్తోంది. గురువారం కృష్ణాజిల్లా నందిగామ జోన్ పరిధిలోని జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామ సర్వే నంబరు 120బై 1ఏ2(పీ)లో 5.00 ఎకరాల లేఅవుట్‌ను సీఆర్డీఏ అధికారులు పొక్లెయిన్‌తో తొలగించారు. అలాగే ఉంగుటూరు మండలంలోని సర్వే నంబరు 141(పీ)లోని 1.50 ఎకరాలు, గుంటూరు జిల్లా అమరావతి మండలంలోని డోర్ నంబరు 78బైఏ2ఐ, ఐ2సీలోని అనధికార లేఅవుట్లను ధ్వంసం చేయించారు. అనధికార లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని రాయపూడి రెవెన్యూలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం ఓ ప్రకటనలో హెచ్చరించింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

47,533 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 48,406 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 47,533 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,564 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	17500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	15000	334	10500	17000
273	10500	14200	నెంబరు. 5	---	---
341	10000	17000	273	----	----
4884	----	---	341	10000	17400
సూపర్ 10	----	----	4884	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	16000	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	17500
బ్యాడిగి	10500	17000	దేవనూరు డీలక్స్	10500	16300
దేవనూరు డీలక్స్	10500	16400	తాలుకాయలు	5000	8800

గుంటూరు సిటీ వార్తలు

కల్తీలను పక్కదారి పట్టించేందుకే ఆందోళనలు



మాట్లాడుతున్న రామకృష్ణ, పాల్గొన్న చెరుకూరి తిరుపతిరావు

గుంటూరు(తూర్పు), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి, కల్తీ మద్యం నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు వైసీపీ మెడికల్ కళాశాలపై ఆందోళనలు చేపడుతోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ తాడువాయి రామకృష్ణ ఆరోపించారు. స్థానిక రాజేంద్రనగర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 17 కళాశాల నిర్మాణానికి ప్రధాని మోదీ ఇచ్చిన నిధులను నాటి ముఖ్యమంత్రి జగన్ పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఆ కళాశాలల నిర్మాణాలను పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం పీపీపీ ద్వారా పనులను ప్రారంభించిందన్నారు. దీనిని జీర్ణించుకోలేక వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ లక్ష్యంగా వైసీపీ విష ప్రచారాలు చేస్తోందన్నారు. మంత్రిపై ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు

ఎర్రజెండాలతోనే సమసమాజ నిర్మాణం

• సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

గుంటూరు (తూర్పు), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణం ఎర్రజెండాలతోనే సాధ్యమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ నగర సమితి సమావేశం నగర నాయకుడు దేవానాయక్ అధ్యక్షతన స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ, దేశంలో సామాజిక విప్లవం తీసుకురావడంలో సీపీఐను మించిన శక్తి మరొకటి లేదన్నారు. రాజారామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం దగ్గర నుంచి కమ్యూనిస్టు ఉద్యమ అగ్రగణ్యులు చండ్ర రాజేశ్వరరావు, ఎస్ఏ డాంగే, ముఖర్జీ, ఇంద్రజిత్ గుప్తాలతో పాటు వేలాది మంది విద్యార్థి నాయకులు భారత సమాజాన్ని అభ్యుదయం వైపు నడిపించారని గుర్తుచేశారు. ఆర్థిక దోపిడీ, కులపీడన లేని సమాజ నిర్మాణం కోసం లక్షలాది మంది కమ్యూనిస్టు యోధులు తమ జీవితాలను అంకితం చేశారన్నారు. సీపీఐ శత వసంతాల మహోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగా డిసెంబరు 26న ఖమ్మంలో లక్షల మందితో ముగింపు సభ కూడా జరుపబోతున్నామని చెప్పారు. వందేళ్ళ కాలంలో సీపీఐ సాధించిన విజయాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి అయ్యప్ప స్వాములకు చద్ది

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బ్రాడీపేటలోని శ్రీ బడాబానల ప్రతాప వీరఆంజనేయ స్వామి, శ్రీ లలితా పరమేశ్వరీ, శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో ఈ నెల 16నుంచి అయ్యప్ప దీక్ష స్వాములకు, భవానీలకు చద్ది, భజన అనంతరం బిక్ష కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు పీవీ భావన్నారాయణ, అయితి సతీష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 16 నుంచి 2026 జనవరి 5వ తేదీ వరకు సద్ది, బిక్ష, భజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అన్నదాన ప్రభువు శ్రీఅయ్యప్ప స్వామి ఆశీస్సులతో గురుస్వాములు అంబటిపూడి భానుమూర్తి స్వామి, పీవీ కృష్ణమూర్తిస్వామి, కాకాని శివాజీస్వామి, శ్రీ పన్నాల విశ్వనాథం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అప్పారావు, రాజగోపాల్, ఆదిరాజు శ్రీధర్, సాయితేజ, శంకర్‌శాస్త్రీ, సాయి, వంశీకృష్ణ కిరణ్, శివరామ్య, స్వామి తదితరులున్నారు.

శాలివాహన సమావేశానికి చైర్మన్ ఈశ్వర్

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ ఈ నెల 16వ తేదీన పేరేచర్ల సమీపంలో జరిగే సమావేశంలో పాల్గొంటారని శాలివాహన సమన్వయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజవరపు శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో శాలివాహనులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి ప్రభుత్వానికి నివేదిస్తారని చెప్పారు. వేలాది మంది సమక్షంలో వన సమారాధన కార్యక్రమం కూడా అక్కడే నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా శాలివాహనులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాజీవ్ గృహకల్ప సమస్యలు వారంలో పరిష్కరించాలి

• కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ అడవితక్కెళ్లపాడులోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను వారంలో పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులకు ఆదేశించారు. గురువారం కమిషనర్ రాజీవ్ గృహకల్ప సముదాయాన్ని, పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో అసంపూర్తిగా ఉన్న రోడ్లను, విద్యా నగర్, అంకిరెడ్డిపాలెంలో అభివృద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెళ్లపాడు రాజీవ్ గృహకల్ప సముదాయాల్లో తాగునీటి ట్యాంక్, సెప్టిక్ ట్యాంక్, వ్యర్థాల సమస్యలను పరిష్కరించాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డిఈఈలు రమేష్ బాబు, సతీష్ కుమార్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

• వీధి కుక్కలకు ఆపరేషన్లు

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో వీధి కుక్కలకు శాస్త్రీయ పద్ధతిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నామని కమిషనర్ తెలిపారు. ఈ మేరకు పొన్నూరు రోడ్‌లో ఏబీసీ సెంటర్



రాజీవ్ గృహకల్ప వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. జీఎంసీకి ప్రత్యేకంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌ను కేటాయించాలని పశుసంవర్ధకశాఖకు లేఖ రాస్తున్నామన్నారు. జంతు ప్రేమికులు కూడా వీధి కుక్కల సమస్యల పరిష్కారానికి జీఎంసీ చేపట్టే చర్యలకు సహకరించాలని కోరారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ, ఏడి చక్రవర్తి, వీఏఎస్ ఈశ్వరరెడ్డి, జీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ పి.శాంతి కళ, ఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు ప్రదీప్ జైన్, ప్రజారోగ్య విభాగ సూపరిండెంట్ పోలేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటర్ల మ్యాపింగ్ మూడు రోజుల్లో పూర్తి చేయాలి

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) 2025లో భాగంగా నిర్వహిస్తున్న ఓటర్ల మ్యాపింగ్‌ను 3 రోజుల్లో పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. గురువారం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్‌పై గుంటూరు పశ్చిమ (94), తూర్పు (95) నియోజకవర్గాల బీఎల్‌వోలకు స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, 2002 తర్వాత ఇప్పుడే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) జరుగుతుందన్నారు. బిఎల్‌వోలు 2002 ఓటర్ జాబితాలోని ఓటర్లలో ప్రస్తుతం ఉన్న ఓటర్లతో, ప్రోజన్సీ (సంతతి) మ్యాపింగ్‌కు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రతి బీఎల్‌వో తమకు కేటాయించిన ప్రాంతాల్లో మ్యాపింగ్‌ను వేగంగా చేయాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ (94) నియోజకవర్గ ఈఆర్‌వో, నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఏఈఆర్‌ఓలు బి.శ్రీనివాసరావు, రాంబాబు, సూరజ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు, బిఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

అనువాదం క్లిష్టమైన ప్రక్రియ

• జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాదు



డాక్టర్ వెన్నా వల్లభరావును సత్కరిస్తున్న జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్

గుంటూరు (తూర్పు), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనువాదం అనేది చాలా కష్టమైన ప్రక్రియ అని జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాదు అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో అన్నమయ్య కళావేదికపై గురువారం ఆచార్య గంగప్ప స్మారక పురస్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణప్రసాదు మాట్లాడుతూ, సాహిత్యంలో ఒక భాష నుంచి మరొక భాషలోకి అనువదించేటప్పుడు భావం తప్పనిసరిగా రావాలని అన్నారు. ఇతర భాషల్లోని మహత్తర కావ్యాలను అనువదించేందుకు రచయితలు ముందుకు రావాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ, పురస్కార గ్రహీత వెన్నా వల్లభరావు ఆకాశవాణిలో 50 నాటికలు, నాటకాలు ప్రదర్శించారని తెలిపారు. నల్లనివాడు అనే రేడియో నాటకానికి జాతీయ అవార్డు అందుకున్నారన్నారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, డాక్టర్ వల్లభరావు కేంద్రసాహిత్య అకాడమీ అనువాద పురస్కారం పొందారన్నారు. త్రిపురనేని రామస్వామి, పింగళి వెంకయ్య జీవితాలను తెలుగులోను, హిందీలోను రాశారన్నారు. జస్టిస్ రామకృష్ణప్రసాదు పురస్కర గ్రహీతను ఘనంగా సత్కరించి రూ.5 వేల నగదు అందజేశారు. సభలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కందిమళ్ళ సాంబశివరావు, వెన్నిశెట్టి సింగారావు, చిట్టినేని శివకోటేశ్వరరావు, అశోక్‌రెడ్డి, షేక్ మస్తాన్, ఎస్.మురళి, సుబ్రహ్మణ్యం, సుష్మా తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ ఎస్వీ కృష్ణారావు వందన సమర్పణ చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్, అధ్యాపకులు తదితరులు

బాలోత్సవంలో సీతారామయ్య విద్యార్థుల ప్రతిభ

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు బాలల పండుగ సందర్భంగా ఈ నెల 7, 8, 9వ తేదీలలో నిర్వహించిన వీవీఐటీయూ బాలోత్సవ్‌లో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ చాటారని పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ గురువారం తెలిపారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో వాద్య సంగీత కార్యక్రమం తాళప్రదానం పోటీలలో జైనీల్ జైన్, రాగ ప్రదానంలో కొర్ల వెంకట సాయి చరణ్ ప్రథమ బహుమతిని, మున్నంగి జగన్ మోహన్ రెడ్డి కన్సోలేషన్ బహుమతిని సాధించాడని చెప్పారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, సీనియర్ కోఆర్డినేటర్ జి.రాధామాధవి, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్ జహన్, ప్రీప్రైమరీ కోఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇంచార్జి కె.హరిప్రియ పాల్గొన్నారు.

సంపత్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంపత్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. లెక్చరర్‌గా పని చేస్తున్న అవ్వారు అప్పయ్య శాస్త్రి కుటుంబంతో ఈ నెల 8న తిరుపతి వెళ్ళారు. గురువారం ఇంటికి వచ్చిచూడగా తలుపు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలోని 142 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.92 వేల నగదు చోరీకి గురైనట్లు కనుగొన్నారు. ఈ మేరకు ఆయన లాలాపేట పోలీసుల ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ భవన్ పనులను ప్రారంభించాలి



దీక్షలో పాల్గొన్న విల్సన్

గుంటూరు (తూర్పు), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ పనులను వెంటనే ప్రారంభించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం లాడ్జి సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ, 2014లో కూల్చివేతకు ముందు ఈ భవన్‌లో నాగార్జున స్టడీ సెంటర్ ఉండేదన్నారు. నూతనభవనాన్ని ప్రారంభిస్తామని శిలా ఫలకాలు వేసిన ప్రభుత్వాలు ఇంత వరకు ఆ దిశగా అడుగు ముందుకు వేయలేదన్నారు. అందుకే ఈ దీక్షను చేపట్టామని చెప్పారు. ఈ సందర్భంగా త్వరలోనే భవనాన్ని పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆయన దీక్షను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు కిషోర్, జయసుధ, బత్తుల అనిల్, మద్దు ప్రేమ జ్యోతి బాబు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

• పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కె.భాస్కర్, పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు

గుంటూరు (తూర్పు), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ డిమాండ్ చేశారు. గుంటూరు అరండల్‌పేటలో గురువారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలను పీపీపీ విధానంలో నిర్వహిస్తామని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించడం సరికాదన్నారు. ఇటువంటి అనాలోచిత నిర్ణయాలతో వైద్య విద్యను కార్పొరేట్ కబంధహస్తాల చేతులలో పెడుతున్నారని ఆరోపించారు. గూగుల్ కంపెనీలకు రాయితీలిచ్చి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తున్నారని, కానీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నడపడానికి డబ్బులు లేవని అనడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహర్షి, సహాయ కార్యదర్శి రాజేశ్, జిల్లా కార్యదర్శి మానస, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధి కారు ధ్వంసం కేసులో ట్విస్ట్

• తన కారుపై తనే దాడి చేయించుకొని సీఐపై నెపం
• 11 మంది నిందితుల్లో ఐదుగురి అరెస్ట్
• నిందితుల్లో ఇరువురు వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు
• ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరిక

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణ నగర్ రెండో లైన్‌లో ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి కన్నెగంటి అరుణ్ బాబు ఇంటిపై దాడికి యత్నించి ఆయన కారు అద్దాలు ధ్వంసంచేసిన కేసు మలుపు తిరిగింది. తన అనుచరులతో తన కారుపై తానే దాడి చేయించుకొని ఆ నెపం తుళ్లూరు-2 సీఐ మాతంగి శ్రీనివాసరావుపై నెట్టే ప్రయత్నం చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ కేసులో ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి కన్నెగంటి అరుణ్ బాబు ప్రధాన నిందితుడు కాగా మరో 10 మంది నిందితులను గుర్తించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. 11 మందిలో ఐదు గురు నిందితులను అరెస్టు చేశామని వారిని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. అరెస్టు అయిన వారిలో స్వర్ణ భారతి నగర్ 28వ లైన్‌కి చెందిన వైసిపి విద్యార్థి విభాగం నాయకుడు బడే జగదీష్, ఓ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న బృందావన్ గార్డెన్స్ 7వలైనుకు చెందిన మేడా సంపత్ కుమార్, వినుకొండ ఇందిరానగర్ కి చెందిన బీటెక్ విద్యార్థి వెలిశెట్టి ఆదర్శ బాబు, మరో బీటెక్ విద్యార్థి సాయి అదేవిధంగా హైదరాబాదులో బీటెక్ చదువుతున్న ప్రసన్న రెడ్డి ఉన్నారన్నారు.

• సీఐను ఇరికించడమే లక్ష్యంగా కుట్ర

సీఐ మాతంగి శ్రీనివాసరావును కేసులో ఇరికించడమే కాకుండా ఆయన పరువు ప్రతిష్ఠలు దెబ్బతినేలా కన్నెగంటి అరుణ్ బాబు కుట్ర పన్నినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. కన్నెగంటి అరుణ్ బాబు తన స్నేహితుతో కలిసి కుట్ర పన్నారన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు వెలిశెట్టి ఆదర్శ బాబు, సాయి, ప్రసన్నారెడ్డి ఇటువంటి నేరంలో పాల్గొని తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్, పక్కన వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు, వెనుక నిందితులు

• మీడియా ముసుగులో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

మీడియా ముసుగులో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. అరుణ్ బాబు గతంలో పలు పత్రికల్లో పని చేసినప్పుడు పోలీస్ అధికారులతో పాటు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులను అదే విధంగా ప్రజలను బ్లాక్మెయిల్ చేసి రూ.లక్షలు దండుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా మరికొందరు కూడా మీడియా ముసుగులో బ్లాక్మెయిల్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి ధోరణికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలో అరుణ్‌బాబు బాధితులుంటే నేరుగా పోలీసులను సంప్రదిస్తే తగు చర్యలు తీసుకొని వారికి న్యాయం చేస్తామన్నారు.

పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక దాడులు నిర్వహించారు. చేబ్రోలు మండలంలోని శేకూరు గ్రామ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడి చేసి పేకాట ఆడుతున్న 5 గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 7,500 నగదు, 6 సెల్ ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే తాడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రావెల గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి 7గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6 సెల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు, రూ.5,700 నగదు స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

వీవీఐటీ విశ్వవిద్యాలయానికి ఇస్రో ప్రాజెక్టు నిధులు

పెదకాకాని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు అంతరిక్ష శాస్త్రం, అనువర్తనాలకు సంబంధించిన పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఇస్రో సంస్థ రెస్పాండ్ కార్యక్రమం ద్వారా అందించే నిధులు 20లక్షల రూపాయలు వీవీఐటీ విశ్వవిద్యాలయానికి అందించినట్లు వీవీఐటీ విశ్వవిద్యాలయం ప్రో ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ గురువారం తెలిపారు. ఈసీఈ విభాగానికి చెందిన డాక్టర్ ఎన్.దుర్గారావు ప్రధాన పరిశోధకుడిగా, డాక్టర్ ఎమ్.వై.భానుమూర్తి, డాక్టర్ శేషు చక్రవర్తి సహ పరిశోధకులుగా 'లో నాయిస్ టైమ్ అండ్ ఫ్రీక్వెన్సీ ట్రాన్స్ఫర్ యూజింగ్ ఆప్టికల్ మీడియమ్' అనే ప్రాజెక్ట్‌ను ఇస్రో బెంగళూరు కేంద్రానికి పంపగా ఇస్రో రెస్పాండ్ కార్యక్రమానికి అమోదించిందని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌కు ఇస్రో 20 లక్షల నిధులు అందిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆప్టికల్ ఫైబర్ ఆధారిత వ్యవస్థ ద్వారా దీర్ఘదూరాలకు తక్కువ శబ్దంతో అధిక స్థిరత్వం కలిగిన ఫ్రీక్వెన్సీ ప్రసార సాంకేతికతను అభివృద్ధి చేయడం దీని ప్రధాన లక్ష్యం అని తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ నాని, దేగల ప్రభాకర్

పదవి పెత్తనం కాదు.. బాధ్యత

• ఎమ్మెల్యే మాధవి

• ఘనంగా టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పదవి అంటే పెత్తనం కాదని, అది ఒక బాధ్యతని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. నాయకత్వం అంటే అహంకారం కాదు ఆశయమని ఆమె పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం మాధవి అధ్యక్షతన టీడీపీ డివిజన్, క్లస్టర్, యూనిట్ కమిటీలు, బూత్ ఇంచార్జీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే గళ్ళా మాధవి కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్, మల్లె ఈశ్వర్ రావు, నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి తదితరులు హాజరయ్యారు. తొలుత తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ ప్రజల ఆశయాలు, విలువలు, ప్రజాసేవకు కట్టుబడి పనిచేసే పార్టీ అని అన్నారు. పార్టీ దిశానిర్దేశం మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, కొత్త నాయకత్వాన్ని తీసుకువచ్చామని చెప్పారు.

పాఠశాలల్లో ఈ-కేవైసీ క్యాంపులు

• డిప్యూటీ సీఈవో కృష్ణ



నల్లపాడు లయోలా పాఠశాలలో ఈ-కేవైసీ, బయోమెట్రిక్ అప్‌డేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ-కేవైసీ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి చొప్పర కృష్ణ తెలిపారు. గురువారం నల్లపాడు లయోలా పాఠశాలలో ఈ-కేవైసీ, బయోమెట్రిక్ అప్‌డేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లయోలా పాఠశాలలో 4,800 విద్యార్థులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇళ్ల వద్ద తల్లితండ్రులకు చెప్పినా ఈ-కేవైసీ, బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించే పరిస్థితి లేకపోవడంతో 18 మంది సచివాలయ సిబ్బందితో పాఠశాలలోనే క్యాంపును ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక రోజు 810 మంది విద్యార్థులకు ఈ-కేవైసీ, బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించామని తెలిపారు. జిల్లాలో ఉన్న మిగిలిన వారు కూడా సచివాలయం వద్దకు వెళ్లి ఈ-కేవైసీ, బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించుకోవాలని డిప్యూటీ సీఈవో కృష్ణ పిలుపునిచ్చారు.

యువత ఆరోగ్య సమస్యల్ని నిర్లక్ష్యం చేయొద్దు



కేహెచ్‌ఐటీ అధ్యాపకురాలికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు (విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యువత ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేహెచ్‌ఐటీ డైరెక్టర్ ఎం.ఉమా శంకరెడ్డి సూచించారు. చౌడవరంలోని కళాశాలలో కొనాక్ డయాగ్నస్టిక్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు, అధ్యాపకులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఉమాశంకరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు, అధ్యాపకులకు తరచూ ఆరోగ్య పరీక్షలు అవసరమని తెలిపారు. సుమారుగా 150 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కొనాక్ డయాగ్నస్టిక్ ఇన్‌చార్జి డీటీ సాయిబాబా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అసోసియేట్ ప్రొఫెసర్ దోరశిల శ్రీనివాసులు రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పీఎల్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొరిటెపాడుకు చెందిన ఓ యువతికి ఏడాది క్రితం విజయవాడకు చెందిన వెంకట దుర్గా రావుతో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నట్లుగా నమ్మించి రూ.8 లక్షల 50 వేల నగదు, బంగారు ఆభరణాలు కట్నం గా తీసుకున్నాడు. పెళ్ళయిన నాటి నుంచి అతను ఉద్యోగానికి వెళ్ళటం లేదు. ఈ విషయమై భర్తను భర్తను నిలదీయగా, అతనితో పాటు అత్త మామ, బంధువులు అదనపు కట్నం తీసుకొరమ్మని తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతిని వేధించ వద్దన్నందుకు ఆకతాయిల దాడి

తనను వేధించ వద్దన్నందుకు కొందరు ఆకతాయిలు యువతితో పాటు అతని స్నేహితుడిపై దాడికి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, బ్రాడిపేటలోని ఒక ప్రైవేటు లేడీస్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న యువతి ఈ నెల 10న బయటకు రాగా అరుణ్ అనే యువకుడు ఆమె ఫోన్ నంబర్ అడిగాడు. అదే విషయం బాధిత యువతి తన బంధువయిన కన్నల్‌కి తెలిపింది. అతను వెళ్లి అరుణ్‌ను ప్రశ్నించాడు. దాంతో కోపోద్రిక్తుడైన అరుణ్ మరికొంత మందితో కలిసి కన్నల్‌ను, బాధిత యువతినిని కొట్టి గాయపరిచారు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వేధింపులు

మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భర్త తనను వేధిస్తున్నాడని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. నాయుడుపేటకు చెందిన ఇరుగుల శిరీషకు పదమూడేళ్ల క్రితం వినుకొండకు చెందిన కాశీరెడ్డితో వివాహమైంది. కాశీరెడ్డి వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని కొంత కాలంగా తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని పేర్కొంటూ శిరీష పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్ పేట పోలీసులు తెలిపారు.

కార్డులు తీసుకోకపోతే అంతే..!

- మిగిలిన వాటిని వెనక్కి పంపనున్న అధికారులు
- లబ్ధిదారులు రేషన్ కార్డులు కోల్పోయే పరిస్థితి
- ఇప్పటికే 85 శాతం స్మార్ట్ కార్డుల పంపిణీ



సత్తెనపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన నేపథ్యంలో పాత రేషన్ కార్డులకు స్వస్తి పలికింది. ఇదే క్రమంలో రాజముద్రతో క్యూఆర్ కోడ్, కుటుంబ పెద్ద ఫోటో తదితర సమగ్ర వివరాలతో కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. పల్నాడు జిల్లాలో ఇప్పటికే 85 శాతానికి పైగా స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తయింది. ఇంకా 85,993 కార్డుదారులకు కార్డులు అందాల్సి ఉంది. కార్డుదారులు త్వరపడి తమ కార్డులను తీసుకోకపోతే అవి వెనక్కి వెళ్ళే అవకాశం ఉంది. ఈ నెలాఖరుకు మిగిలిన కార్డుదారులు ఆయా స్మార్ట్‌కార్డులు తీసుకోవాలి, వివిధ కారణాల నేపథ్యంలో ఎవరైనా తీసుకోకపోతే అధికారులు వాటిని వెనక్కి పంపుతారు. దీంతో లబ్ధిదారులు కార్డును కోల్పోయే అవకాశం ఉంది. ఇప్పటికీ 85 శాతం స్మార్ట్‌కార్డుల పంపిణీ పూర్తి కాగా మరో 15 శాతం మందికి కార్డులు అందజేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కొందరు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలస వెళ్లారని, కొన్ని ఇతర కారణాల వల్ల పంపిణీలో కొంత జాప్యం జరిగిందని అంటున్నారు. కార్డులోని లబ్ధిదారుల్లో ఎవరైనా వచ్చి కార్డు తీసుకునే వెసులుబాటును కల్పించామని అధికారులు చెబుతున్నారు. కాగా, లబ్ధిదారులు స్మార్ట్ కార్డులు తీసుకోకపోతే అధికారులు వాటిని వెనక్కి పంపుతారు. భవిష్యత్తులో ఆయా లబ్ధిదారులు రేషన్ కార్డులు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. లబ్ధిదారులు వీలైనంత త్వరగా స్మార్ట్‌కార్డులను తీసుకువెళ్ళటం మంచిదని అధికారులు చెబుతున్నారు. ఇటు అధికారులు, అటు లబ్ధిదారులు అప్రమత్తమై స్మార్ట్‌కార్డుల పంపిణీ వంద శాతం పూర్తయ్యేలా చూడాల్సిన అవసరం ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

చేబ్రోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాల గ్రామం అడ్డరోడ్డు వద్ద పోలీసులు తెల్లవారు జామున వాహనాలను తనిఖీ చేస్తుండగా భారీగా రేషన్ బియ్యం పట్టుబడింది. పొన్నూరు మండలం కసుకూరు గ్రామానికి చెందిన డీలర్ నుంచి 79 బస్తాల రేషన్ బియ్యాన్ని ట్రాలీ వాహనంలో చుండూరు మండలంలోని సుబ్బారావుకు చెందిన రైస్ మిల్‌కు తరలిస్తుండగా చేబ్రోలు ఎస్ఐ వీరనారాయణ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ ఘటనలో డ్రైవర్ కె. రమేష్, వాహన యజమాని కత్తి రమేష్, బియ్యం కొనుగోలు దారుడు పొన్నూరుకు చెందిన రబ్బాని, విజయ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల యార్డులో గురువారం జరిగిన వేలంలో 831 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ. 11,900, గరిష్ఠధర రూ. 13,521, మోడల్‌ధర రూ.12,350 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,900, గరిష్ఠధర రూ.13,521, మోడల్‌ధర రూ. 12,350 పలికాయి.

గుంటూరు విద్యార్థి ఆత్మహత్య ఘటనలో

8 మంది సీనియర్లపై కేసు

- క్యాంపస్‌లో తల్లిదండ్రులు, విద్యార్థుల ఆందోళన
- బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, పోలీసుల జోక్యం
- ఆ ఎనిమిది మంది విద్యార్థుల సస్పెన్షన్


ఆందోళన చేస్తున్న సృజన్ కుటుంబ సభ్యులు, విద్యార్థులు


విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ఎచ్చెర్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురంలోని ఆర్జీయూకేటీ (శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్) బీటెక్ విద్యార్థి ఆత్మహత్య ఘటనలో ఎనిమిది సీనియర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని క్యాంపస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గుంటూరుకు చెందిన ప్రత్తిపాటి సృజన్(20) ఇక్కడ ఇంజనీరింగ్ ఈఈఈ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతూ.. బుధవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సృజన్ తల్లిదండ్రులు జ్యోతి, శివకృష్ణప్రసాద్ గురువారం ఉదయం 6 గంటలకు క్యాంపస్‌కు చేరుకున్నారు. తన కుమారుడి మృతికి క్యాంపస్‌లో పర్యవేక్షణ లోపమే కారణమని బోరున విలపించారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. విద్యార్థులు కూడా వారిని ఓదార్చే ప్రయత్నం చేస్తూ.. క్యాంపస్ డైరెక్టర్ కార్యాలయం బయట బైటాయించి ఆందోళన చేపట్టారు. 'కొంతమంది సీనియర్ విద్యార్థుల వేధింపుల వల్లే మా కుమారుడు మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలను పూర్తిస్థాయిలో వెలికితీయాలి. బాధ్యులను కఠినంగా శిక్షించాల'ని సృజన్ తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐలు వి.సందీప్‌కుమార్, జి.లక్ష్మణరావు, వై.మధుసూదనరావు పోలీసు బలగాలతో క్యాంపస్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డీఎస్పీ వివేకానంద మాట్లాడుతూ మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, చట్టం ముందు అందరూ సమానమేన్నారు.

● సృజన్ ఆత్మహత్యకు కారణమని ఆరోపిస్తూ మృతుడి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు నాలుగో సంవత్సరం చదువుతున్న వివిధ బ్రాంచ్‌లకు చెందిన 8 మంది విద్యార్థులను పోలీసులు ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీరిపై 108 బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో ఆందోళనకారులు కొంతమేరకు శాంతించారు. ఉదయం 11 గంటల తర్వాత విద్యార్థులు ఎవరి తరగతులకు వారు వెళ్లిపోయారు.

నిజనిర్ధారణకు అంతర్గత కమిటీ

ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో విద్యార్థి సృజన్ ఆత్మహత్యపై విచారణకు యూనివర్సిటీ అధికారులు అంతర్గత కమిటీని నియమించారు. కమిటీ సూచనల మేరకు 8 మంది విద్యార్థులను తక్షణమే సస్పెన్షన్ చేశామని వర్సిటీ అధికారులు ప్రకటించారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ డాక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ క్యాంపస్‌కు చేరుకుని విద్యార్థులు, అధికారులు, అధ్యాపకులతో మాట్లాడి పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చేశారు.

న్యాయం చేయాలి

గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయని, ఈ సంఘటనకు బాధ్యులైనవారిపై చర్యలు చేపట్టాలని ఆర్జీయూకేటీ క్యాంపస్ అధికారులను కలిసి కోరామని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డి.చంద్రశేఖర్, చిత్రిరాజు తెలిపారు. దళిత సంఘ నేతలు ముంజేటి కృష్ణమూర్తి, వై.గురుమూర్తి, జి.యోగేశ్వరరావు, బి.శశిభూషణరావు తదితరులు మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులను కోరారు.

నవభారత నిర్మాత నెహ్రూపై విమర్శలు తగవు

● మాజీ ఎంపీ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ తులసిరెడ్డి, వేదికపైన లక్ష్మణరావు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): భారత్ సమగ్రాభివృద్ధికి పునాదులు వేసిన నవభారత నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూపై విమర్శలు చేయడం తగదని, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవించే ఆర్.ఎస్.ఎస్ లాంటి సంస్థలు సోషల్ మీడియాలో నెహ్రూను వ్యక్తిగతంగా తప్పు పట్టడం దురదృష్టకరమని మాజీ ఎంపీ, ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో దేశ ప్రగతిలో నెహ్రూజీ పాత్ర అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ప్రధాన వక్తగా ఆయన పాల్గొన్నారు. నెహ్రూ మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టి.. పంచవర్ష ప్రణాళికలను అమలు చేసి, అతి పేదరికంలో ఉన్న భారత్‌ను ముందుకు నడిపిన మహనీయుడని కొనియాడారు. అమెరికా, రష్యా కూటముల వైపు మొగ్గకుండా అలీన ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రపంచ నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. సామాజిక మధ్యమాలలో నెహ్రూ గురించి 79 తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారన్నారు. నెహ్రూకు షేక్ అబ్దుల్లా, మహారాజ హరిసింగ్‌తో గల సత్సంబంధాల వల్ల నేడున్న జమ్మూ కశ్మీర్ ను కాపాడుకోగలిగామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఐఐటీ, ఐఐఎం, ఇస్రో, ఎయిమ్స్ , సీఎస్ఐఆర్, డీఆర్డీఓ, ఆర్ఈసీ లాంటి విద్య పరిశోధన సంస్థలను, నాగార్జునసాగర్, హీరాకుడ్, భాక్రానంగల్ లాంటి బహుళార్థ సాధక నీటి ప్రాజెక్టులను, బీహెచ్ఈఎల్, ఐడీపీఎల్, సెయిల్, కోల్ ఇండియా లాంటి పారిశ్రామిక సంస్థలను ప్రారంభించి అభివృద్ధి చేసి దేశం వేగంగా పయనించడానికి నెహ్రూ కారణ భూతుడైనాడని తెలిపారు. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఏఎన్‌యూ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రంగయ్య, కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు కొండవీటి చిన్నయసూరి, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్ కుమార్, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు , రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాల్, తెలుగు సాహితీవేత్త వి. సింగారావు, సీనియర్ జర్నలిస్ట్ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించిన కలెక్టర్


భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ బంగ్లా రోడ్డులో ఉన్న పరివర్తన ఎస్సీ విద్యార్థినుల సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సందర్శించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'హాస్టల్‌లో.. ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని తొలుత తనిఖీ చేశారు. స్వయంగా తిని రుచిని, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. మంచి ఆశయంతో లక్ష్య సాధన దిశగా జీవిత లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలని అందుకు తగిన ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ కీలకమైందని ఇటువంటి సమయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. చదువుపై దృష్టి పెట్టడం వల్ల ఉన్నత స్థానాలకు చేరవచ్చని, సమాజంలో మంచి హోదాతో పాటు సమాజ హితానికి పాటు పడే అవకాశం కలుగుతుందని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యూ.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ

గుంటూరు (విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించనునట్లు వెల్లడించారు. గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 15న పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి పుస్తక పఠన ప్రాముఖ్యత వివరణ, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల జీవిత చరిత్రల వివరణ, 17న కవి సమ్మేళనం, పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి రచయితల ద్వారా వివరణ, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం వ్యాసరచన, క్రీడా పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అక్క కొడుకుని కాపాడబోయి..యువతి మృతి


కోటా మల్లేశ్వరి (ఫైల్ ఫోటో)

వినుకొండటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్క కొడుకుని కాపాడే క్రమంలో చెరువులో పడి యువతి మృతి చెందిన ఘటన.. విష్ణుకుండి నగర్ సమీపంలోని గాయత్రి నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం మేరకు పదేళ్ల క్రితం తెలంగాణకు చెందిన మృతురాలు తండ్రి కోటా రాములుతో పాటు మరో నాలుగు కుటంబాలకు చెందిన వారంతా వినుకొండ వచ్చి గాయత్రి నగర్‌లో పరదాలు వేసుకుని, మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకలను మేపుతూ చేతులకు అయిన మట్టిని కడుక్కునేందుకు గాయత్రీ నగర్‌లోని చెరువులోకి దిగి చితకాయల శివ ప్రమాదశాత్తు జారి పడిపోయాడు. బహిర్భూమికి వెళ్లిన కోటా మల్లేశ్వరి (19) (శివకు పిన్ని వరుస) ఇది గమనించి తన చున్ని సాయంతో శివను కాపాడే ప్రయత్నం చేసింది. అయితే.. మల్లేశ్వరి జారి చెరువులో పడిపోవడంతో.. నీటిలో మునిగి బయటకు రాలేకపోయింది. ప్రమాదం నుంచి బయట పడిన శివ కేకలు వేయడంతో సమీపంలోని స్థానికులు వచ్చి కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి యువతిని రక్షించి.. చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. అప్పటికే యువతి పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. నీరు అధికంగా తాగడంతో మల్లేశ్వరి మృతి చెందినట్లు వైద్యలు తెలపడంతో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్నీ పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అచ్చంపేట పీఏసీఎస్‌లో..

రూ.2.60 లక్షల నగదు మాయం

అచ్చంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రూ.2.60 లక్షల నగదు మాయమైన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత శనివారం కౌంటర్‌లో ఉన్న ఎరువు, పొదుపు నగదు మాయమైంది. ఈ నేపథ్యంలో గత సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో వచ్చి పీఏసీఎస్ కార్యాలయంలో విచారించారు. మాయమైన నగదులో కొంతమేర నగదు వసూలు చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు కొప్పురావూరి కోటేశ్వరరావు గురువారం తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు విచారిస్తున్నారు.

ప్రీ ఆర్డీసీకి ఏఎన్‌యూ విద్యార్థిని

ఏఎన్‌యూ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సీఎస్ఈ మూడవ సంవత్సరం ఎన్‌సీసీ క్యాడెట్ ఎస్.హర్షిత శివాని సికింద్రాబాద్‌లో జరగనున్న ప్రీ ఆర్డీసీ(రిపబ్లిక్ డే క్యాంప్) శిబిరానికి ఎంపికైంది. గుంటూరు గ్రూప్ తరపున 25(ఏ) బెటాలియన్ ఇంటర్ గ్రూప్ పోటీల్లో (ఐజీసీ) కేటగిరీలో ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ శివరామ్ ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం హర్షిత శివానిని అభినందించారు.

రైల్వే డీసీఎం కమలాకర్‌బాబు విజయవాడకు బదిలీ



డీసీఎం కమలాకర్‌బాబుని సత్కరిస్తున్న కమర్షియల్ విభాగం ఉద్యోగులు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.కమలాకర్‌బాబు విజయవాడ డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు నుంచి ఉత్తర్వులు జారీ కాగా ఆయన గురువారం తన బాధ్యతల నుంచి రిలీవింగ్ అయ్యారు. ఈ సందర్భంగా పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో ఆయనకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ డీసీఎంగా కమలాకర్‌బాబు డివిజన్‌లో రెవెన్యూ అభివృద్ధికి, ప్రయాణీకుల సౌకర్యాలు మెరుగుపరచడానికి విశేషంగా కృషి చేశారన్నారు. కమలాకర్‌బాబు మాట్లాడుతూ తనకు విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, ఉద్యోగులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎం వినయ్‌కాంత్, కమర్షియల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలను

పది రోజుల్లో పరిష్కరించాలి

● లేదంటే జడ్పీ కార్యాలయం ఎదుట ఆందోళన:ఏపీటీఎఫ్


జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు


గుంటూరు సిటీ/ గుంటూరు (విద్య) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ క్యాడర్ల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండలవిద్యాశాఖాధికారుల పీఎఫ్ సమస్యలు పది రోజుల్లో పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు డిమాండ్ చేశారు. పది రోజుల్లో పీఎఫ్ సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డిప్యూటీ సీఈవో కృష్ణను కలిసిన ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బసవలింగారావు మాట్లాడుతూ, గత తొమ్మిది నెలలుగా పీఎఫ్ సమస్యలు పరిష్కరించకుండా ఫైల్స్ పక్కన పడేశారని ఆరోపించారు. క్లోజర్స్ క్లీయరెన్స్, మిసింగ్ క్రెడిట్స్ అప్‌డేషన్‌లో కార్యాలయ సిబ్బంది జాప్యం వల్ల పదవీ విరమణ చేసిన, చేయబోయే ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. మిస్సింగ్ క్రెడిట్స్‌ను అప్డేట్ చేయకుండా ఖాతాలో ఉన్నవరకు ఇస్తే సరిపోతుందని అన్నారు. కాని భవిష్యత్తులో తేడా అమౌంట్‌కు క్లెయిమ్ చేయబోమని సెల్ఫ్ డిక్లరేషన్‌ను ఉపాధ్యాయుల నుంచి బలవంతంగా తీసుకుంటున్నారని, అలాంటి అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, డిప్యూటీ సీఈవో కృష్ణ ఉపాధ్యాయ సంఘం నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, జిల్లా కార్యదర్శి జి.దాస్, జిల్లా పూర్వ ప్రధానకార్యదర్శి ఎమ్.హనుమంతరావు, జిల్లా కౌన్సిలర్లు ఆర్.బాలరాజు, కృష్ణారావు, జహంగీర్, కుంబా శ్రీనివాస్, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య రత్నషీలామణికి ఘన సత్కారం


రత్నషీలామణిని సత్కరిస్తున్న వర్సిటీ సిబ్బంది

ఏఎన్‌యూ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉన్నత విద్యామండలి నూతన ఉపాధ్యక్షురాలిగా ఎంపికైన ఆచార్య కె.రత్నషీలామణికి ఏఎన్‌యూలో గురువారం ఘనంగా సత్కారం జరిగింది. సన్మాన కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య గంగాధరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు ఏఎన్యూ పరీక్షల నియంత్రణ అధికారి ఏ.శివప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కే.గంగాధరరావు మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అభివృద్ధిలో ఆచార్య కే.రత్నషీలామణి కీలకపాత్ర పోషించారన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఏఎన్యూ తాత్కాలిక రెక్టర్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, మరొక గౌరవ అతిథి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఏఎన్యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఏఎన్యూ పాలకమండలి సభ్యుడు ఆచార్య జగదీష్ నాయక్, ఆచార్య సుమంత్ కుమార్, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తేజోమూర్తి, పరీక్షల నియంత్రణ అధికారి ఏ.శివప్రసాదరావు, ఉద్యోగులు నాగలక్ష్మి, డిఈఈ వెంకటేశ్వరరావు, కనకరాజు, పరిశోధకులు ఆచార్య రత్నషీలామణిసేవలను కొనియాడారు.

ప్రకాశం బ్యారేజి వద్ద తగ్గిన వరద ఉధృతి


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు ప్రధాన వాగుల నుంచి 17,731 క్యూసెక్కుల వరద నీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదవుతుండగా 7,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 5,246 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,009 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్ ప్రాజెక్టులో 305.68 టీఎంసీలు..

విజయపురిసౌత్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 587.30 అడుగులు ఉంది. ఇది 305.68 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,160 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 12,627 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సి ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 27,687 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 27,687 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 43.06 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్ట్ ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 10,544 క్యూసెక్కుల నీరు పులిచింతలకు వచ్చి చేరుతోందని చెప్పారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 7,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తంగా 8 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

వితండ వివాదం!


- మిర్చి లారీల అడ్డగించిన.. యూనియన్ నాయకులు
- సౌత్ డీఎస్పీ, మిర్చి యార్డు సెక్రటరీకి ఎక్స్‌పోర్టర్ల ఫిర్యాదు


లాల్‌పురం వై-జంక్షన్ సమీపంలో మిర్చి లారీని అడ్డుకొన్న యూనియన్ నాయకులు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ బోర్డర్‌కు గుంటూరు నుంచి లోడింగ్ అయిన మిర్చి లారీలను యూనియన్ నాయకులు అడ్డుకొన్నారు. గురువారం రాత్రి యూనియన్‌కు చెందిన కొంతమంది కార్లలో వచ్చి లాల్‌పురం వైజంక్షన్, అంకిరెడ్డిపాలెం రోడ్డు సమీపంలో రెండు లారీలను అడ్డుకొని లారీ బ్రోకర్లు, డ్రైవర్లను పరుష పదజాలంతో దూషించారు. బయట నుంచి వచ్చిన లారీలను కిరాయికి పెట్టడానికి మీరెవరూ అంటూ వితండవాదం చేశారు. బంగ్లాదేశ్ బోర్డర్‌కు తమ యూనియన్ లారీలనే కిరాయికి పెట్టుకోవాలని హుకూం జారీ చేసి.. రెండు లారీలను కదలనీయకుండా అడ్డుపడ్డారు. దీంతో మిర్చి ఎగుమతిదారులు చేసేది ఏమి లేక సౌత్ డీఎస్పీతో పాటు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక దృష్టికి తీసుకెళ్లారు. ఇలాగైతే తాము జీఏంసీ పరిధిలో వ్యాపారం చేయలేమని చెప్పారు.

'ది వైల్డ్ ఈస్ట్' పుస్తకం

- సహజ వనరుల దోపిడీకి దర్పణం
- వ్యవస్థ కళ్లముందే దోచుకున్న తీరును బహిర్గతం చేస్తుంది: పవన్ కల్యాణ్



అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవులు, తూర్పు కనుమల్లోని ఎర్ర చందనం సహా విలువైన సహజ వనరుల దోపిడీకి సాక్ష్యంగా 'ది వైల్డ్ ఈస్ట్' అనే పుస్తకం నిలుస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన గురువారం ఈమేరకు 'ఎక్స్'లో స్పందించారు. "కొంత కాలం క్రితం నేను ది వైల్డ్ ఈస్ట్ అనే పుస్తకాన్ని చదవడం ప్రారంభించాను. అందులోని వివరాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ గ్రంథం ఎర్రచందనం సహా విలువైన సహజ వనరులను వ్యవస్థ కళ్లముందే ఎలా దోచుకుపోయారో బహిర్గతం చేస్తుంది. కొంతమంది రాజకీయ నేతలు మాఫియా డానుల్లా వ్యవహరించిన తీరు ఇందులో బయటపడింది. చిన్న స్థాయి కాంట్రాక్టర్‌గా ఉన్న వ్యక్తి... మాఫియాలో కింగ్‌పిన్‌గా ఎదిగి, ఎలా ఎర్రచందనం అక్రమ రవాణా సామ్రాజ్యానికి అధిపతిగా మారాడో అన్నదాన్ని దాదాపు సినిమా సన్నివేశంలా చూపించారు. లోభం, అధికారం కోసం అతడు నిర్మించిన నేర సామ్రాజ్యం పుస్తకంలో స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. ప్రజలు ఈ పుస్తకాన్ని చదివినప్పుడు, మీరు నేరాన్ని మాత్రమే అర్థం చేసుకోరు... భూమి, అరణ్యాలు, ప్రకృతి, ప్రజలపై జరిగిన విశ్వాసఘాతకాన్ని కూడా లోతుగా అనుభూతి చెందుతారు" అని పేర్కొన్నారు.

రవికుమార్ అప్పీల్‌కు సుమోటో వ్యాజ్యం జతచేయండి

- ఒకే అంశంపై రెండు వేర్వేరు ధర్మాసనాలు విచారణ జరపాల్సిన అవసరం లేదు
- పరకామణిలో చోరీ, లోక్ అదాలత్‌లో రాజీపై రిజిస్ట్రీకి హైకోర్టు ధర్మాసనం ఆదేశం

అమరావతి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ, లోక్‌అదాలత్‌లో కేసు రాజీ వ్యవహారంపై సీఐడీ విచారణకు ఆదేశించడంతో పాటు తన ఆస్తులపై ఏసీబీ విచారణకు ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నిందితుడు సీవీ రవికుమార్ దాఖలుచేసిన అప్పీల్‌పై హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ఇదే వ్యవహారానికి సంబంధించి లోక్ అదాలత్ అవార్డు చట్టబద్ధతను తేల్చేందుకు నమోదైన సుమోటో వ్యాజ్యాన్ని మరో ధర్మాసనం విచారణ జరుపుతోందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఒకే అంశంపై రెండు వేర్వేరు ధర్మాసనాలు విచారణ జరపాల్సిన అవసరం లేదని, లోక్ అదాలత్ అవార్డు చట్టబద్ధతను తేల్చేందుకు నమోదైన సుమోటో వ్యాజ్యాన్ని ప్రస్తుత అప్పీల్‌కు జతచేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది.



తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణిలో చోరీకి సంబంధించిన కేసును టీటీడీ బోర్డు తీర్మానం, ఈవో అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద ఏవీఎస్‌ఓ వై.సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్న వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని సీఐడీని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇటీవల ఆదేశాలిచ్చారు. రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల స్థిర-చర ఆస్తులతో పాటు బ్యాంకు ఖాతాలను పరిశీలించాలని, వారి ఆదాయానికి తగ్గట్లే ఈ ఆస్తులు ఆర్జించారా..? అనే కోణంలో లోతైన దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ నిందితుడు రవికుమార్ తాజాగా ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. తాను టీటీడీ ఉద్యోగిని కానని, పెద్ద జీయర్‌మఠంలో క్లర్క్‌గా పనిచేస్తున్నాని అందులో పేర్కొన్నారు. ప్రైవేటు మఠంలో పనిచేస్తున్న తాను పబ్లిక్ సర్వెంట్ నిర్వచనం పరిధిలోకి రానన్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

సజ్జల శ్రీధర్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ 17కు వాయిదా

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో తాను దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌కు నెంబర్ కేటాయించి విచారణ జరిపేలా ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరుతూ నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఈనెల 17వ తేదీకి వాయిదా వేసింది. వ్యాజ్యంలో లేవనెత్తిన అన్ని అంశాలను ఆ రోజు పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. సజ్జల శ్రీధర్‌రెడ్డి(ఏ6) బుధవారం హైకోర్టులో వేసిన ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా శ్రీధర్‌రెడ్డి తరపున న్యాయవాది అభయ్ సిద్ధాంత్ వాదనలు వినిపించారు. కేసులోని ఇతర నిందితులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా మెరిట్స్ ఆధారంగా వారి బెయిల్ పిటిషన్లపై విచారణ జరపాలని చెప్పిందని, ఈ నేపథ్యంలో తాను డిఫాల్ట్ బెయిల్ కోరుతూ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశానని తెలిపారు. అయితే, రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను మాత్రమే విచారించాలని సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపలేమంటూ ఏసీబీ కోర్టు తన పిటిషన్‌ను రిటర్న్ చేసిందన్నారు. విచారణ జరిపేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో గురువారం ఉదయం 9 గంటలకు కూడా వీడని మంచు... సూర్యుడు చందమామలా దర్శనమిస్తున్న దృశ్యం

ఉత్తరాంధ్ర గజగజ

- జి.మాడుగులలో 7.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాయవ్య భారతం నుంచి మధ్యభారతం మీదుగా శీతలగాలులు వీస్తుండడంతో ఉత్తరాంధ్రలో చలి తీవ్రత పెరిగింది. దక్షిణ కోస్తా, రాయలసీమల్లోని పలు ప్రాంతాల్లోనూ చలి పెరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గురువారం తెల్లవారుజాము నుంచి దట్టంగా మంచు కురవడంతోపాటు చలి తీవ్రత కొనసాగింది. శీతాకాలంలో మొదటిసారిగా అల్లూరి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. జి.మాడుగులలో 7.6, ముంచంగిపుట్టు మండలం కిలగడలో 7.8, డుంబ్రిగుడలో 9.4 డిగ్రీలు, మైదాన ప్రాంతంలోని కళింగపట్నంలో 16.5, జంగమహేశ్వరపురంలో 17.5, విశాఖ ఎయిర్‌పోర్టులో 19 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా.. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. రానున్న రెండు, మూడు రోజులపాటు మధ్యభారతం, ఉత్తరకోస్తా, తెలంగాణ సరిహద్దునున్న కోస్తా ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, రాష్ట్రంలో మిగిలిన చోట్ల పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

వదంతులు నమ్మొద్దు
పాసులు ఉంటేనే ప్రవేశం

-రాజమౌళి



మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఎస్ఎస్ఎంబీ 29'. గ్లోబ్‌ట్రోటర్ ఈవెంట్ పేరిట ఈనెల 15న హైదరాబాద్ రామోజీ ఫిల్మ్‌సిటీలో చిత్రబృందం భారీ కార్యక్రమం నిర్వహించబోతోంది. ఈ సందర్భంగా 100 అడుగుల ఎల్ఈడీ స్ర్కీన్‌పై సినిమా టైటిల్‌ను ఆవిష్కరించడం, టీజర్‌ను విడుదల చేయడంతో పాటు సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలను అభిమానులతో పంచుకోనున్నారు. అయితే ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనల నేపథ్యంలో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు.

● ఇది ఓపెన్ ఆడిటోరియం ఫంక్షన్, పాసులతో సంబంధం లేకుండా ఎంతమందైనా వెళ్లొచ్చు, మొబైల్ పాసులు చూపించి వెళ్లొచ్చు అంటూ పలు రకాలుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై రాజమౌళి ఓ వీడియో ద్వారా స్పందించారు. అలాంటి పుకార్లను నమ్మొద్దని తెలిపారు. గ్లోబ్‌ట్రోటర్ ఈవెంట్ పూర్తిగా ఇండోర్‌లో జరుగుతుందని, ఫిజికల్ పాసులు ఉన్నవాళ్లకు మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. పోలీసులు కఠిన ఆంక్షలు విధించిన నేపథ్యంలో అభిమానులంతా విధిగా వాటిని పాటించాలని సూచించారు. కార్యక్రమం ఆద్యంతం పోలీసుల కనుసన్నల్లో జరుగుతుందని, అభిమానులు సహకరించాలని కోరారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న అసత్యాలను నమ్మి ఇబ్బందులు పడొద్దు అని హెచ్చరించారు. పిల్లలు, వృద్ధులకు ప్రవేశం లేదు, కార్యక్రమానికి రాలేనివారు డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చూడొచ్చు అని తెలిపారు.

కొదమసింహం.. మళ్లీ వస్తోంది!



మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచిన 'కొదమసింహం' మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నెల 21న 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా ముస్తాబై రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి రీ రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. చిత్రనిర్మాత కైకాల నాగేశ్వర రావు మాట్లాడుతూ 'ఈ సినిమాను తిరిగి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం సంతోషాన్ని ఇస్తోంది. రీ రిలీజ్ చిత్రాల్లో ఎక్కువ కాలం గుర్తుండిపోయే అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. వింటేజ్ చిరు యాక్టింగ్, సంభాషణలు, డ్యాన్సులు థియేటర్లో అభిమానుల్ని ఉర్రూతలూగించేలా ఉన్నాయి. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ ట్రైలర్ అదిరిపోయింది. టాప్ క్లాస్ విజువల్స్, అద్భుతమైన సౌండింగ్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇటీవల రీ రిలీజ్ అవుతున్న సినిమాల్లో చూడనంత చక్కటి క్వాలిటీ ఇందులో ఉందని నెటిజన్లు అభినందిస్తున్నారు.

'చెవాలియర్' అవార్డు ప్రదానం



ప్రముఖ కళా దర్శకుడు తోట తరణికి ఫ్రెంచ్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన 'చెవాలియర్' అవార్డును ప్రదానం చేసింది. గురువారం చెన్నైలోని రష్యన్ కల్చర్ సెంటరులో జరిగిన ఈ కార్యక్రమంలో భారత్‌లోని ఫ్రాన్స్ రాయబారి తెర్రీ మాథౌ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా తోట తరణి విలేకరులతో మాట్లాడుతూ.. 'ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు. నాకు మాత్రమే కాదు తమిళనాడుకే గర్వకారణం. చిత్రపరిశ్రమలోని దర్శకులందరూ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు' అని అన్నారు.

-చెన్నై(ఆంధ్రజ్యోతి)

తప్పుకొంటున్నా.. క్షమించండి

దర్శకుడు సి.సుందర్



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించే 173వ చిత్రం దర్శకత్వ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు సుందర్ ప్రకటించారు. ఈ ప్రకటనను ఆయన సతీమణి, నటి ఖుష్బూ ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారు. 'సుదీర్ఘకాలం తర్వాత రజనీకాంత్, కమల్ హాసన్‌లతో కలిసి పనిచేసే అవకాశం లభించింది. ఈ అరుదైన అవకాశాన్ని కల్పించిన వారిద్దరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా. అదేసమయంలో నేను సూపర్‌స్టార్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నట్టు తెలుసుకుని ఎంతో సంతోషపడిన అభిమానులను క్షమాపణలు కోరుతున్నాను. అనివార్య పరిస్థితుల దృష్ట్యా 'తలైవర్ 173' నుంచి తప్పుకోవాలన్న కఠిన నిర్ణయం తీసుకున్నాను. ఈ ఇద్దరితో కలిసి పనిచేయడం నాకు ఒక కల. కానీ, మన కోసం నిర్దేశించిన మార్గాన్ని మనం అనుసరించాల్సిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఇద్దరు గొప్ప వ్యక్తులను అత్యున్నతంగా గౌరవిస్తాను. వారు నాకు ఎన్నో అమూల్యమైన పాఠాలు నేర్పారు. ఈ అరుదైన అవకాశానికి దూరమైనప్పటికీ ఎల్లవేళలా వారి మార్గదర్శకత్వాన్ని కోరుకుంటాను' అని పేర్కొన్నారు. కాగా, ఈ ప్రకటన పోస్ట్ చేసిన కొన్ని నిమిషాల్లోనే ఎక్స్ వేదిక నుంచి ఖుష్బూ తొలగించారు.

-చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఇది కవరేజ్ కాదు.. అమర్యాద

-కరణ్ జోహార్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యి ఇంట్లో చికిత్స తీసుకుంటున్న సంగతి తెలిసిందే. అయితే కొందరు ఫొటోగ్రాఫర్స్ ఆయన ఇంట్లో బెడ్‌పై చికిత్స తీసుకుంటున్న దృశ్యాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో ధర్మేంద్ర ఆరోగ్య పరిస్థితి దీనంగా ఉంది. ఆయన కదల్లేని స్థితిలో ఉన్నారు. ధర్మేంద్ర ఇద్దరు కొడుకులు సన్నీ డియోల్, బాబీ డియోల్ కూడా అక్కడే ఉన్నారు. నెట్టింట వైరల్ అవుతున్న ఈ వీడియోపై దర్శకుడు కరణ్ జోహార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆ కుటుంబానికి కాస్త ప్రైవసీ ఇవ్వండి. వాళ్లు ఇప్పటికే ఎంతో బాధలో ఉన్నారు. భారతీయ సినిమా కోసం ఎంతో చేసిన ఓ గొప్ప నటుడి విషయంలో ఫొటోగ్రాఫర్స్, మీడియా ఇలా ప్రవర్తించడం హృదయాన్ని ముక్కలు చేస్తోంది. ఇదెంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది కవరేజ్ కాదు.. అమర్యాద' అని పేర్కొన్నారు.



సామాజిక ప్రయోజనం ఉన్న చిత్రం

- మధుర శ్రీధర్‌రెడ్డి



మనం చేసే సినిమాకు సామాజిక ప్రయోజనం ఉండాలని నమ్మే దర్శక నిర్మాతను నేను. 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రాన్ని కూడా వినోదం, సందేశం మేళవింపుగా తెరకెక్కించాం. ప్రేక్షకులు కుటుంబంతో కలసి ఆస్వాదించేలా మా సినిమా ఉంటుంది' అని మధుర శ్రీధర్ రెడ్డి చెప్పారు. ఆయన నిర్వి హరిప్రసాద్ రెడ్డితో కలసి నిర్మించిన చిత్రమిది. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించారు. సంజీవ్ రెడ్డి దర్శకుడు. నేడు విడుదలవుతోన్న సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ 'మంచి కంటెంట్ ఇవ్వాలనే లక్ష్యంతో ఈ సినిమా చేశాను' అని చెప్పారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలతో తెరకెక్కిన చిత్రమిది అని విక్రాంత్ చెప్పారు.


'అర్జున్‌రెడ్డి' కన్నా ఎక్స్ట్రీమ్‌గా తీశారు

- సందీప్‌రెడ్డి వంగా



'జిగ్రీస్ లాంటి సినిమా చేయాలంటే యూనిట్ అందరికీ ఒక పిచ్చి కావాలి. ప్రచార చిత్రాలు చూస్తుంటే నిజాయితీగా చేసిన ప్రయత్నం అనిపించింది. నేను తీసిన 'అర్జున్‌రెడ్డి' చిత్రం కన్నా ఎక్స్ట్రీమ్‌గా తీశారు' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. రామ్‌నితిన్, కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ ప్రధాన పాత్రల్లో దర్శకుడు ఉప్పుల హరీశ్‌రెడ్డి తెరకెక్కించిన చిత్రమిది. కృష్ణ వోడపల్లి నిర్మాత. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం గురువారం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు మాట్లాడుతూ 'నిర్మాత కృష్ణగారు కథను నమ్మి ఈ సినిమా చేశారు' అని చెప్పారు. కృష్ణ వోడపల్లి మాట్లాడుతూ 'అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు.







విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు డోలా, పయ్యావుల, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం, తదితరులు



ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు చూపుతున్న తైవాన్ కంపెనీ ప్రతినిధులు, రాష్ట్ర అధికారులు

3.65 లక్షల కోట్లు!

విశాఖ సదస్సుకు ముందురోజే పెట్టుబడుల ఒప్పందాలు: సీఎం

- వీటితో 1.26 లక్షల ఉద్యోగాలకు చాన్సు
- 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు
- విశాఖ.. ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానం
- విశాఖ ఎకనామిక్ రీజియన్.. తూర్పుతీర గేట్‌వే! అంచనాలకు మించి పెట్టుబడులు
- భోగాపురంలో ఏరో సిటీ: సీఎం
- నీతి ఆయోగ్ సీఈవోతో కలిసి రీజియన్ డాక్యుమెంట్ విడుదల

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భాగస్వామ్య సదస్సు ప్రారంభానికి ముందురోజే రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. వీటితో 1.26 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశముందని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురాగలిగామని తెలిపారు. గురువారం నోవాటెల్ హోటల్‌లో నీతిఆయోగ్ సీఈవో బీవీఆర్.సుబ్రహ్మణ్యంతో కలిసి విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు అదే హోటల్‌లో ఇండియా-యూరప్ బిజినెస్ పార్ట్నర్‌షిప్ రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరస్పర సహకారంపై చర్చించారు. అనంతరం ఆయా దేశాల ప్రతినిధులతో ముచ్చటించారు. పోర్టు అతిథిగృహం ఆవరణలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ.. దేశంలో తూర్పు తీరానికి విశాఖ ఎకనామిక్ రీజియన్ గేట్‌వేగా పనిచేస్తుందన్నారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ తొమ్మిది జిల్లాలతో ఏర్పాటుచేస్తున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ భవిష్యత్ ఆర్థికశక్తిగా ఎదుగుతుందని తెలిపారు. 'ఈ రీజియన్ పరిధిలోని విశాఖ జిల్లాలో గూగుల్ డేటా సెంటర్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో వస్తోంది. అనకాపల్లి జిల్లాలో రూ.లక్ష కోట్లతో ఆర్సెలార్ మిట్టల్ ఉక్కు కర్మాగారం ఏర్పాటుకాబోతోంది. గత పాలకులు రాష్ట్రాన్ని, విశాఖను సర్వనాశనం చేశారు. ఇప్పుడు అంచనాలకు మించి విశాఖకు పెట్టుబడులు వస్తున్నాయి. గూగుల్ డేటా సెంటర్‌తోపాటు గిగావాట్ సామర్థ్యంలో మరో పెద్ద సంస్థ విశాఖలో డేటా సెంటర్ నెలకొల్పబోతోంది. వాటికి అనుబంధంగా మరికొన్ని పరిశ్రమలు వస్తుండడంతో విశాఖ రూపురేఖలు మారనున్నాయి. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ గమ్యస్థానంగా, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతాం. ఎకనామిక్ రీజియన్ అథారిటీ చైర్మన్ హోదాలో అభివృద్ధి, ఇతర కార్యకలాపాలను నేనే స్వయంగా పర్యవేక్షిస్తా' అని ప్రకటించారు. విశాఖను మోస్ట్ లివబుల్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక విజన్ తయారుచేసుకుని అమలుచేస్తున్నామని.. ప్రధాని మోదీ సహకరిస్తున్నారని తెలిపారు. భోగాపురంలో అంతర్జాతీయం విమానాశ్రయం చెంతనే ఏరో సిటీని అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖ-శ్రీకాకుళం కారిడార్‌ను నౌకా నిర్మాణానికి హబ్‌గా మారుస్తామన్నారు. స్కిల్ విశాఖ పేరుతో లక్ష మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తామని, తద్వారా వారికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు.

పెట్టుబడులకు ఏపీ అనుకూలం

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చేవారికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద 45 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 'ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించడానికి ఏపీ గేట్‌వేగా ఉపయోగపడుతుంది. అరకు కాఫీ ఇప్పుడు గ్లోబల్ బ్రాండ్‌గా మారింది. మా రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలం. ప్రాధాన్య రంగాలకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దేశంలో తొలి క్వాంటమ్ వ్యాలీని అమరావతిలో నెలకొల్పుతున్నాం. రాష్ట్రాన్ని డ్రోన్ల తయారీ కేంద్రంగా మారుస్తున్నాం. స్పేస్ సిటీ కూడా ఏర్పాటు చేస్తున్నాం. 2047 నాటికి భారత్ ప్రపంచంలో అగ్రస్థాయిలో ఉంటుంది. అందులో ఏపీ ముందుంటుంది' అని చెప్పారు. ఇండియా-యూరప్ రౌండ్ టేబుల్ భేటీలో ఆర్మీనియా ఆర్థిక మంత్రి గివార్డ్ పొపాయాన్, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల ప్రతినిధులు, భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్ కల్యాణి, వివిధ కంపెనీల చైర్మన్లు, సీఈవోలు, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

> భారతదేశం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. అందులో 160 గిగావాట్లు ఏపీలోనే ఉత్పత్తికి ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రం త్వరలోనే గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుతుంది. పెద్ద సంఖ్యలో తరలివస్తున్న డేటా సెంటర్లకు గ్రీన్ ఎనర్జీనే సరఫరా చేస్తాం.
>
> ప్రతి 50 కి.మీ.కు ఒక పోర్టు ఆధారిత పరిశ్రమ ఏర్పాటుచేస్తూ రైల్వే, విమానాశ్రయాలతో రవాణా నెట్‌వర్క్ అభివృద్ధి చేస్తున్నాం. దేశంలో ని ప్రధాన నగరాలకు రాష్ట్ర పోర్టులను అనుసంధానం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. - సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో ఇటాలియన్ క్లస్టర్!

- ఇటలీ రాయబారితో సీఎం చర్చ

ఇటాలియన్ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా చూడాలని ఆ దేశ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలీని ముఖ్యమంత్రి కోరారు. ఏపీ-ఇటలీ మధ్య దీర్ఘకాలిక వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇక్కడ ఇటాలియన్ పారిశ్రామిక క్లస్టర్‌ను ఏర్పాటుచేసే అంశంపై చర్చించారు. విశాఖలో వివిధ దేశాల రాయబారులతో సీఎం భేటీ అవుతున్నారు. ఈ క్రమంలో గురువారం భారత్‌లోని ఇటలీ రాయబారితో సమావేశమయ్యారు. కీలక రంగాలైన ఆటోమోటివ్, ఆటో విడి భాగాలు, యంత్రాల తయారీ, ఇంధన, ఫ్యాషన్, ఆహార శుద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై చర్చలు జరిపారు. వ్యవసాయ యంత్రాలు, నౌకా నిర్మాణ రంగాల్లో భాగస్వాములు కావాలని ఆ కంపెనీలను సీఎం ఆహ్వానించారు.

కుప్పంలో ఇండో-తైవాన్ పార్కు

- రూ.400 కోట్లతో ఏర్పాటుకు అలీజియన్స్ గ్రూపు సంసిద్ధత
- అక్కడే పాదరక్షల తయారీ కంపెనీ
- ఓర్వకల్లులో సెన్సార్లు, సెమీ కండక్టర్లు, అడ్వాన్స్‌డ్ బ్యాటరీల తయారీ పరిశ్రమలు
- సీఎం సమక్షంలో పలు ఒప్పందాలు

విశాఖపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇండో-తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను కుప్పంలో ఏర్పాటుచేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం వెల్లడించింది. రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసేందుకు అలీజియన్స్ గ్రూపు సిద్ధమని సీఎం చంద్రబాబుకు తెలియజేసింది. పాదరక్షల తయారీ కంపెనీ పౌ చెన్ గ్రూపు సైతం కుప్పంలో ఫుట్‌వేర్ యూనిట్‌ను ఏర్పాటుచేసేందుకు సంసిద్ధత తెలిపింది. పెట్టుబడుల సదస్సులో భాగంగా భారత్‌లో తైపీ ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృత్వంలోని తైవాన్ ప్రతినిధి బృందం గురువారం విశాఖలో చంద్రబాబును కలిసింది. తైవాన్ కంపెనీల పెట్టుబడులకు రాష్ట్రప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తయారీ, తదితర రంగాల్లో తమతో కలిసి పనిచేయాలని ఆహ్వానించారు. కాగా.. ఓర్వకల్లులో ఇమేజ్ సెన్సార్లను ఉత్పత్తి చేసేందుకు తైవాన్‌కు చెందిన క్రియేటివ్ సెన్సార్ ఇంక్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సెమీకండక్టర్ మిషన్ కింద ప్రోత్సాహకాలు అందించేందుకు సహకరించాలని సీఎంను కోరింది. ఓర్వకల్లు సమీపంలోనే ఇ జౌల్ ఇండియా జాయింట్ వెంచర్ సంస్థ అడ్వాన్స్‌ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. 2.2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 23 గిగావాట్ల సామర్థ్యంతో సాలిడ్ స్టేట్ బ్యాటరీ, కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతిపాదించింది. వీటికి సంబంధించి సీఎం సమక్షంలో తైవాన్ కంపెనీ ప్రతినిధులు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి బోర్డు (ఈడీబీ) ఒప్పందాలు చేసుకున్నాయి. కర్ణాటక, ఏపీ, తమిళనాడు రీజియన్లను కలుపుతూ పారిశ్రామిక పార్కులకు వివిధ రహదారులను అనుసంధానిస్తామని చంద్రబాబు తెలిపారు. తైవాన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా రాష్ట్రంలో ఏర్పాటుచేయాలని కోరారు. పరిశ్రమలు, పెట్టుబడులకు సంబంధించిన అంశాల్లో రాష్ట్రప్రభుత్వ సహకారం బాగుందని ఆ దేశ బృందం కొనియాడింది.

బాపట్లలో 'రెన్యువబుల్ ఎనర్జీ' జోన్

- వెయ్యికరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం
- కర్నూలులో 250 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక ఇంధన రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా సుమారు వెయ్యి ఎకరాల్లో రెన్యువబుల్ ఎనర్జీ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (ఆర్‌ఈఎంజెడ్) ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బాపట్ల జిల్లా బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, కుందూరు గ్రామాల్లో ఈ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ సోలార్ ఫొటో వోల్టాయిక్ ప్లేట్లు, విండ్ టర్బయిన్లు, విద్యుత్తు నిల్వకు ఉపయోగించే బ్యాటరీ, ఎలక్ట్రొలైజర్ల తయారీని చేపడతారు. ఈమేరకు గురువారం ప్రభుత్వం జీవో 92 విడుదల చేసింది. అలాగే, ఎస్ఏఈఎల్ సోలార్ పీ6 ప్రైవేటు లిమిటెడ్ సంస్థ కర్నూలు జిల్లా హోళగుంద, ఆలూరు మండలాల పరిధిలో 250 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెకు ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ ప్రతిపాదనకు న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) ఆమోదం తెలిపింది. ఈమేరకు ప్రభుత్వం జీవో 93 విడుదల చేసింది.

నవయుగ పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యం పెంపునకు ఓకే

నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ అల్లూరి సీతారామరాజు జిల్లా చిట్టమ్మవలసలో ప్రస్తుతం చేపట్టిన 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టును 1800 మెగావాట్లకు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రైవాడ రిజర్వాయర్ నుంచి 26.40 ఎంసీఎం నీటిని అందిస్తారు.

రాంబిల్లి వద్ద 'యాక్షన్ టెసా'కు 18.70 ఎకరాల కేటాయింపు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి పారిశ్రామిక పార్కులో పార్టికల్ బోర్డ్ ప్లాంట్ ఏర్పాటు కోసం బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ (యాక్షన్ టెసా)కు ప్రభుత్వం 18.70 ఎకరాల అదనపు విస్తీర్ణాన్ని ఎకరం రూ. 40 లక్షల చొప్పున ఏపీఐఐసీ ద్వారా కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 (2024-29) ప్రకారం యాక్షన్ టెసా సంస్థకు టైలర్ మేడ్ ఇన్సెంటివ్స్ ప్రొవిజన్ కింద మొదటి దశలో 60.06 ఎకరాలు, రెండో దశలో 46.21 ఎకరాలు కేటాయించడానికి ఆమోదం తెలిపింది. ఆ 106.27 ఎకరాల పక్కనే ప్లాట్ నంబర్ 1, రాంబిల్లి ఫేజ్ 1 వద్ద ఉన్న ఆ కంపెనీ ప్రాంగణానికి అనుకుని ఉన్న 18.70 ఎకరాల అదనపు విస్తీర్ణాన్ని కేటాయించాలని కోరుతూ యాక్షన్ టెసా సంస్థ ప్రతిపాదనలు సమర్పించింది. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడి ప్రమోషన్ కమిటీ (ఎస్ఐపీసీ), రాష్ట్ర పెట్టుబడి ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ)ల సిఫారసుల మేరకు 18.70 ఎకరాల అదనపు విస్తీర్ణాన్ని కేటాయిస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

జగన్ ఎవరినైనా బలిచేస్తారు: నక్కా ఆనంద్

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జగన్ తన అధికార దాహానికి ఎవరినైనా బలిస్తారని, అందులో తరతమ భేదాలు ఉండవని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్ బాబు అన్నారు. జగన్ అధికారదాహానికి రక్తసంబంధీకులు, స్నేహితులు, బంధువులు ఎవరైనా బలికావాల్సిందేనన్నారు. తన తండ్రి అధికారంలో ఉన్నప్పుడే లక్ష కోట్లు దోచేశారని, చట్టాన్ని ఉల్లంఘించడం, అధికారులను కూడా ఉల్లంఘించేలా చేయడం జగన్ నైజమని పేర్కొన్నారు. జగన్ అనే విషవృక్షాన్ని మళ్లీ బతకనీయకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజల మీద ఉందన్నారు.

స్వామి ఆగ్రహిస్తే అడ్రస్ లేకుండా పోతారు

- అప్రూవర్‌గా మారినా శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు: వర్ల

తిరుపతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి విషయంలో ఎవరైనా తప్పు చేసి, ఆయన ఆగ్రహానికి గురైతే అడ్రస్ లేకుండా పోతారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య అన్నారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'పరకామణి చోరీ, కల్తీ నెయ్యి వ్యవహారం అత్యంత దారుణమైనవి. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకుంటూ ప్రభుత్వం పైనే బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. వారు మెక్కిందంతా కక్కిస్తాం. అప్రూవర్‌గా మారతామని చెప్పినంత మాత్రాన వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అక్రమాలకు పాల్పడ్డ వారందరూ శ్రీకృష్ణ జన్మస్థానానికి పోవాల్సిందే. స్వామితో పెట్టుకున్న వారు గతంలో శరీర అవయవాలు కూడా గుర్తుపట్టలేని స్థితికి వెళ్లిన ఘటన మరచిపోవద్దు' అని వర్ల రామయ్య హెచ్చరించారు.

పరకామణి కేసులో సూత్రధారులెవరో తేల్చాలి

- ఆ ముగ్గురిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి: నీలాయపాలెం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'టీటీడీ పరకామణి కేసులో ఇప్పటి వరకు సీఐడీ చీఫ్ పాత్రధారులను మాత్రమే విచారించారు. ఈ కేసులో సూత్రధారులు ఎవరో నిగ్గు తేల్చాలి. నాటి టీటీడీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అప్పటి ఈవో ధర్మారెడ్డిపై నిష్పాక్షికంగా విచారణ జరపాలి. సూత్రధారులపై 409 సెక్షన్ కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి' అని బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ డిమాండు చేశారు. తిరుపతిలో గురువారం ఆయన టీడీపీ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. 'పెద్ద జియ్యంగార్ మఠంలో పనిచేసిన రవికుమార్ ఆస్తులు రాయించుకుని, నిందితుడ్ని వదిలేయాలని ఉచిత సలహా ఇచ్చిన పెద్ద మనుషులు ఎవరో బయట పెట్టాలి. దేవుడ్ని సైతం శాసించే స్థాయికి ఎదిగిన ధర్మారెడ్డికి ఈ విషయాలు తెలియవా? రవికుమార్‌పై నాన్‌బెయిలబుల్ సెక్షన్ 381 పెట్టిన తర్వాత కేవలం 41ఏ నోటీసు ఇచ్చి ఎలా వదిలేస్తారు? సుబ్బారెడ్డి జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలి. తిరుమలలోని పెద్ద జియ్యంగార్ మఠంలోని ఉన్నత స్థాయి అధికారులు, ఉద్యోగులను పిలిచి విచారించాలని సీఐడీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా. చెన్నైకి ఎన్ని సార్లు వెళ్లారు? రవికుమార్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌లో స్టాంపు డ్యూటీ ఎవరు చెల్లించారు? అన్న విషయాలపై కరుణాకరరెడ్డి సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. పరకామణి కేసుతో పాటు కల్తీ నెయ్యి కేసులో భూమన, వైవీ సుబ్బారెడ్డిపై అవినీతి నిరూపణ అయినప్పటికీ ఇప్పటి వరకు వారిని వైసీపీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని నాలెడ్జి సెంటర్ చైర్మన్ మాల్యాద్రి నిలదీశారు. జగన్, చైర్మన్లు, ఈవో కలిసి హిందూత్వాన్ని మంట కలిపారని టీడీపీ నేత ఊకా విజయకుమార్ ఆరోపించారు.

మెడికల్ సీట్లు అమ్ముకున్న జగన్: హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధికారంలో ఉన్న కాలంలో జగన్, ప్రభుత్వ వైద్య కళాశాల సీట్లను అమ్ముకున్నారు. ఆయనకు ఇప్పుడు పీపీపీ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేసే నైతిక హక్కు లేదు' అని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్... అధికారంలో ఉన్నప్పుడు ఐదు వైద్య కళాశాలల్లో సీట్లను ప్రైవేటుగా అమ్ముకున్నది మీరు కాదా..! ఆరోజు మీరు చేసిన తప్పును ఇప్పుడు కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం పేరుతో చేస్తోంది. తప్పు చేసిన మీరు.. అదే తప్పుపై పోరాటం అనడానికి సిగ్గుగా లేదా' అని విమర్శించారు.

అడవి తల్లికి పెద్దిరెడ్డి పోటు!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే నిర్ధారించింది. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మంగళంపేట రిజర్వ్ ఫారెస్ట్‌లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు 32.63 ఎకరాల భూమిని ఆక్రమించినట్లు తేల్చింది. దీనిపై కేసు వేయడం, చార్జిషీట్ దాఖలు చేయడం, ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవడం జరిగాయి. వాటిల్లో చెట్ల పెంపకం కూడా చేపట్టారు. సర్వే నంబర్లు 295/1బీ, సీ, డీ, ఈ, 296/1ఏ, 1బీల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరుతో 15 ఎకరాలు, పెద్దిరెడ్డి ఇందిరమ్మ (భర్త భాస్కరరెడ్డి) పేరుతో 20.8 ఎకరాలు, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేరుతో 21 ఎకరాలు, పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పేరుతో 18.94 ఎకరాలు, డమ్మీ పట్టాతో 1.80 ఎకరాలు ఉంది. అడవికి చెందిన 32.63 ఎకరాల భూమిని ఆక్రమించేశారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు అటవీ భూములను ఆక్రమించినట్లు తీవ్ర ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 29న చిత్తూరు కలెక్టర్, ఎస్పీ, అనంతపురం జిల్లా ఫారెస్ట్ కన్జర్వేటర్‌తో త్రిసభ్య కమిటీని నియమించింది. రెవెన్యూ, అటవీ, సర్వే, ల్యాండ్ రికార్డుల శాఖల అధికారులు జనవరి 31, ఫిబ్రవరి 7, 10 తేదీల్లో పట్టాదారులకు ముందస్తు నోటీసులు జారీచేసి, సంబంధిత భూములపై ఉమ్మడి సర్వే నిర్వహించాయి. పట్టాదారుల అధీనంలో ఉన్న భూమి మంగళంపేట రిజర్వ్ ఫారెస్ట్ గెజిట్‌లో సూచించిన సరిహద్దు లోపలికి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. అటవీ ప్రాంతంలో బోర్‌వెల్ వేయడం, వ్యవసాయ భూమికి నీటి సరఫరా అటవీ వనరుల అనధికార వినియోగం కిందకు వస్తాయని తేల్చారు.



అడవిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్మించిన కట్టడాలు. అడవిలో మాజీ మంత్రి ఆక్రమణలను ఏరియల్ సర్వే ద్వారా వీక్షిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

రూ.1.26 కోట్ల మేర నష్టం చేశారు..

అటవీ భూముల ఆక్రమణలు తొలగించాలని మార్చి 3న పట్టాదారులకు నోటీసులు ఇవ్వాలని, బోర్‌వెల్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించింది. ప్రభుత్వం మార్చి 11న పట్టాదారులకు నోటీసులు ఇచ్చింది. అక్రమణలను ఎందుకు తొలగించకూడదో 15 రోజుల్లో తెలపాలని పేర్కొంది. ఆక్రమిత 32.63 ఎకరాల భూమిలో రూ.1.26 కోట్ల మేర నష్టం చేసినట్లు అటవీ, రెవెన్యూ అధికారులు ఏప్రిల్ 30న తనిఖీల్లో తేల్చారు. అటవీ చట్టాలను ఉల్లంఘించినందుకు నలుగురు నిందితులపై మే 4న చిత్తూరు తూర్పు ఫారెస్ట్ రేంజ్‌లో అటవీ చట్టంతో పాటు పలు ఇతర సెక్షన్ల కేసు నమోదైంది. అధికారులు మే 5న ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు ప్రాథమిక నేర నివేదికను సమర్పించారు. మే 28న ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకున్నారు. మే 29న ఆక్రమణదారులకు నోటీసులిచ్చారు. తహసీల్దారు నుంచి భూముల పత్రాలను తీసుకొని, ప్రతి వ్యక్తి భూమి వివరాలను జూన్ 16న అటవీ అధికారులు పరిశీలించారు. అక్రమిత భూమిలోని 560 చెట్లను జప్తు చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం దర్యాప్తు కోసం పబ్లిక్ ప్రాసిక్యూటర్ అక్టోబరు 4న కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

ఆక్రమిత భూమి స్వాధీనం: పీసీసీఎఫ్

మంగళంపేట రిజర్వ్ ఫారెస్ట్‌లోని భూముల ఆక్రమణ వాస్తవమని విచారణలో తేలిందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) పీవీ చలపతిరావు గురువారం మంగళగిరిలోని అరణ్యభవన్‌లో మీడియాకు వెల్లడించారు. ఈ కేసులో ఏ1గా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఏ2గా రామచంద్రారెడ్డి, ఏ3గా ద్వారకానాథ్‌రెడ్డి, ఏ4గా ఇందిరమ్మ ఉన్నారని చెప్పారు. ఆక్రమణదారుల నుంచి 32.63 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అటవీ చట్టం ప్రకారం ప్రాథమిక నేర నివేదిక మేరకు కోర్టులో కేసు వేసి, చార్జీషీటు దాఖలు చేశామని పేర్కొన్నారు. మంగళంపేట అటవీ ప్రాంతంలో 75.74 ఎకరాలకు పట్టాలుండగా, 32.63 ఎకరాల అటవీ భూమిని కూడా ఆక్రమణదారులు కలుపుకుని, కంచె వేశారన్నారు. ఉద్యాన పంటలు వేసి ఆదాయం పొందారని, చట్ట విరుద్ధంగా బోరు వేసి అటవీ వనరుల్ని దుర్వినియోగం చేశారని, అక్రమంగా రోడ్డు కూడా నిర్మించారని చెప్పారు. రూ.1.26 కోట్ల విలువైన అటవీ సంపదకు నష్టం చేశారని వివరించారు. 32.63 ఎకరాలకు ఆక్రమణదారులు చట్టబద్ధమైన పత్రాలు సమర్పించలేకపోయారని తెలిపారు. కోర్టులో కేసు నడుస్తున్నందున కోర్టు ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో అటవీ భూముల వివరాలన్నీ ఫారెస్ట్ వెబ్‌సైట్‌లో చేర్చుతామని చెప్పారు. ఇటీవల మంగళంపేట రిజర్వ్ ఫారెస్ట్ భూములపై పవన్ ఏరియల్ సర్వే చేపట్టగా.. ఆయన కార్యాలయం గురువారం సంబంధిత వీడియోను 'ఎక్స్‌'లో పోస్టు చేశారు. ఆక్రమణలపై ఆయన ఆదేశాల నేపథ్యంలో పీసీసీఎఫ్ వివరాలు వెల్లడించారు.

ఓఎంసీ సుప్రీం కమిటీ నుంచి అనంత కలెక్టర్ తొలగింపు

- సర్వే ఆర్‌డీడీ, డీడీ మైన్స్ కూడా.. ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ తవ్వకాలను నిర్ధారించేందుకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా కలెక్టర్, రెవెన్యూ, సర్వే, గనుల శాఖ జిల్లా స్థాయి అధికారులను కమిటీ నుంచి ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు (జీఓ193) జారీచేశారు. నిపుణుల కమిటీ ఏర్పాటు విషయంలో సుప్రీం కోర్టు మార్గదర్శకాలు, ఆదేశాలు కచ్చితంగా పాటించాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అనంతపురం కలెక్టర్‌తో పాటు, సర్వే ఆర్‌డీడీ, డీడీ మైన్స్‌లను ఈ కమిటీ నుంచి తొలగించారు. దీంతో కమిటీలో ఆరుగురు సభ్యులు మాత్రమే ఉన్నారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధూలియా నేతృత్వంలోని ఈ నిపుణుల కమిటీ ఓఎంసీ మైనింగ్ కేసులో మైనింగ్‌లీజు ఏరియా, తవ్వకాలు జరిపిన ప్రాంతం, అక్రమంగా తవ్వితీసిన ఖనిజం, అక్రమ తవ్వకాలు జరిగిన మైనింగ్ ఏరియా వంటి అంశాలను నిర్ధారించి సుప్రీంకు నివేదిక ఇవ్వనుంది. సర్వే డైరెక్టర్ కూర్మనాథ్ ఈ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. కాగా.. రాష్ట్రంలో మేజర్ మినరల్స్ వేలానికి ముందు రికార్డుల పరిశీలన, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకునేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గత అధికారులు, చైర్మన్ల పేర్లు చెప్పలేదు

- టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి



తిరుపతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో సిట్ విచారణ సందర్భంగా టీటీడీలో గతంలో పనిచేసిన అధికారులు, చైర్మన్ల పేర్లు తాను చెప్పలేదని టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టీటీడీ గత అధికారులను విచారించినట్లుగానే తనను కూడా సిట్ అధికారులు విచారించారని అన్నారు. టీటీడీలో నెయ్యి కొనుగోలుకు సంబంధించిన వివరాలు, విధానాలు, అధికారుల బాధ్యతల గురించి వారు ప్రశ్నించారని, అందుకు సంబంధించిన సమాధానాలు వివరంగా చెప్పానన్నారు. ఆ సందర్భంగా తాను సహనం కోల్పోయి గతంలో పనిచేసిన అధికారులు, చైర్మన్ల పేర్లు చెప్పాననడం వాస్తవం కాదన్నారు. సిట్ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో.. విచారణ విషయాలను బహిర్గతం చేయడం బాధ్యతారాహిత్యం అవుతుందని పేర్కొన్నారు.

18న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు: సీపీఐ

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం-ఆత్మగౌరవం కోసం ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. తెలంగాణ తరహాలో ఏపీలో కూడా కులగణన చేపట్టాలని, దాని ప్రాతిపదికనే బీసీలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.



పారామోటారింగ్‌ను ప్రారంభిస్తున్న ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ



సాహసం చేసేద్దామా!

విశాఖలో అందుబాటులోకి అడ్వంచర్ టూరిజం.. పారామోటారింగ్, స్కూబా డైవింగ్ ప్రారంభం

విశాఖపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అడ్వంచర్ టూరిజానికి విశాఖ కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. సాహసాలు చేసేవారికి అద్భుత గగన విహార అనుభవాన్ని అందించే పారామోటారింగ్, సముద్రం లోపల మరో లోకాన్ని చూపించే స్కూబా డైవింగ్‌లను ఏపీటీడీసీ ప్రారంభించింది. రుషికొండలో ఈ రెండు సాహసోపేత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. విహంగ్ అడ్వంచర్స్ సంస్థతో కలిసి పారామోటారింగ్ ప్రారంభించింది. సాగర్‌నగర్‌లో డైవ్ అడ్డా స్కూబా డైవింగ్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిని గురువారం ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడ్వంచర్ టూరిజంలో భాగంగా పారామోటారింగ్, స్కూబా డైవింగ్ సెంటర్‌లకు అనుమతులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఈడీ శేషగిరి, జీఎం చందన నాంచారయ్య, డైవ్ అడ్డా ప్రతినిధి శ్రీనివాస్, విహంగ్ అడ్వంచర్స్ ప్రతినిధి సూర్య తదితరులు పాల్గొన్నారు.

పునరుత్పాదక రంగంలో రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడి

సీఎం సమక్షంలో ఏబీసీ క్లీన్‌టెక్, యాక్సిస్ ఎనర్జీ ఒప్పందాలు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక విద్యుత్తు రంగంలో రూ.1,10,250 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఏబీసీ క్లీన్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్(ఎవరెన్), యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ముందుకొచ్చాయి. గురువారం విశాఖలో సీఎం చంద్రబాబు సమక్షంలో, ఎన్ఆర్ఈడీసీపీ వీసీఎండీ ఎం.కమలాకర్ బాబు.. ఏబీసీ క్లీన్‌టెక్ చైర్మన్ కటారు రవికుమార్ రెడ్డి, యాక్సిస్ ఎనర్జీ సీఈవో ఎస్. శ్రీమురళితో ఈమేరకు ఒప్పందాలు చేసుకున్నారు. ఒప్పందంలో భాగంగా 6500 మెగావాట్ల విండ్, 6500 మెగావాట్ల సోలార్, 6500 మెగావాట్ల ఎనర్జీ స్టోరేజీ, 1.25 ఎంటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నారు.

'కార్బోనాటిక్ ఎల్ఎల్‌సీ' 31,500 కోట్ల పెట్టుబడి

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన కార్బోనాటిక్ ఎల్ఎల్‌సీ సంస్థ రాష్ట్రంలో రూ.31,500 కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఏవియేషన్, ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మారిటైమ్, మైనింగ్, టెక్నాలజీ రంగాల్లో ఈ సంస్థకు అనుభవం ఉంది. విశాఖపట్నంలో జరుగుతున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో 3.75 బిలియన్ డాలర్ల (రూ.31,500 కోట్లు) పెట్టుబడి కోసం ఏపీ ప్రభుత్వంతో సంతకం చేసింది. సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో కంపెనీ అధ్యక్షుడు ట్రెండన్ టి.ఫిట్జ్‌పాట్రిక్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆనంద్ మలైమేగం, ఏపీ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. మూడు కీలక వ్యూహాత్మక రంగాల్లో ఈ పెట్టుబడులు వస్తాయి. రాష్ట్రంలోని వివిధ నదులు, కాలువల మీదుగా రో-పాక్స్ సేవలకు రూ.5,300 కోట్లు, దేశంలోనే అతి పెద్ద ఏవియేషన్ ఎంఆర్‌ఓ (నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్) స్థాపనకు రూ.7,100 కోట్లు, ఏపీలో తూర్పు తీరం వెంబడి యాచ్ యార్డులు, బాండెడ్ వేర్‌హౌస్‌లు, 5జీ టెక్నాలజీతో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు అభివృద్ధికి రూ.19,100 కోట్లు కేటాయించారు.

2 వేల కోట్లతో కోరమాండల్ ఎరువుల కర్మాగారం

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.2 వేల కోట్లతో మరో ఎరువుల కర్మాగారం ఏర్పాటుకు కోరమాండల్ (మురుగప్ప గ్రూపు) ముందుకొచ్చింది. కోరమాండల్‌కు ఇప్పటికే విశాఖపట్నం, కాకినాడల్లో ఎరువుల కర్మాగారాలు ఉన్నాయి. వీటికి కొనసాగింపుగా రూ.2 వేల కోట్లతో మరో ఎరువుల తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో రూ.2 వేల కోట్లతో ఎరువుల కర్మాగారం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సమక్షంలో గురువారం ఒప్పందం జరిగింది.



విశాఖలో భాగస్వామ్య సదస్సు వేదిక

పెట్టుబడుల పండగ

విశాఖ భాగస్వామ్య సదస్సుకు సర్వం సిద్ధం

నేటినుంచి రెండు రోజులపాటు నిర్వహణ

గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు హాజరు.. ఎనిమిది హాళ్లు సిద్ధం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశ, విదేశాల నుంచి మంత్రులు, దిగ్గజ కంపెనీలు తరలివస్తున్న ఈ సదస్సును శుక్రవారం ఉదయం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభిస్తారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్, ఇంకా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు పారిశ్రామిక దిగ్గజాలు, సీఐఐ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు. సదస్సులో ప్రధాన వేదిక (హాల్ నంబర్ 5)గా ఏపీ ప్రభుత్వ పెవిలియన్ ప్లీనరీ ఉంటుంది. మరో ఏడు హాళ్లలో వేర్వేరుగా సదస్సులు, గోష్ఠుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సీఎం, కేంద్ర వాణిజ్య మంత్రికి చాంబర్లు, శంకుస్థాపనకు ఒక హాలు సిద్ధం చేశారు. ప్రధాన వేదికపై ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. తొలిరోజు రాత్రి 8 గంటల వరకూ పలు ప్లీనరీలు నిర్వహించనున్నారు. రెండోరోజు శనివారం ఉదయం 9.30 గంటలకు తిరిగి ప్లీనరీలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 5 గంటల నుంచి 5.45 గంటల వరకూ జరగనున్న ముగింపు సభ ఉంటుంది. ఈ సదస్సుఉ 35 దేశాలకు చెందిన మంత్రులు, ప్రతినిధులు పాల్గొంటున్నారు.

ముందే మొదలైన పెట్టుబడుల సందడి

భాగస్వామ్య సదస్సులో పారిశ్రామిక సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం విశాఖ నోవాటెల్ హోటల్‌లో చంద్రబాబు సమక్షంలో పరిశ్రమల శాఖ తొమ్మిది, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మూడు, ఇంధన శాఖ ఆరు, సీఆర్‌డీఏ 8 ఒప్పందాలు చేసుకున్నాయి. ఆహార శుద్ధి రంగంలో మరో 4 ఒప్పందాలు కుదిరాయి. కాగా, శుక్రవారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రధాన వేదిక వద్ద పరిశ్రమల శాఖ నుంచి 14, ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ 15, ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) ఆరు, ఇంధన శాఖ నుంచి 21 ఒప్పందాలు జరగనున్నాయి. మొత్తం ఒప్పందాల మేరకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రధాన వేదికపై 21 మంది..

భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ ప్రధాన వేదిక (హాల్ నంబరు-5)పై ముందువరుసలో 21 మంది వరకు ఆశీనులవుతారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు పీయూశ్ గోయల్, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, టీజీ భరత్, నాదెండ్ల మనోహర్, సీఐఐ అధ్యక్షుడు రాజేంద్ర మోమాని, ఉపాధ్యక్షురాలు సుచిత్ర ఎల్లా, డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, జీఎంఆర్ గ్రూపు చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు తదితరులు కూర్చుంటారు.

ఆరంభానికి ముందే అదిరింది!

సదస్సుకు ఒక రోజు ముందుగానే రూ.3,65,304 కోట్ల ఒప్పందాలు

సీఎం చంద్రబాబు సమక్షంలో సంతకాలు చేసిన 35 సంస్థలు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విశాఖలో సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు శుక్రవారం ప్రారంభం కానుంది. రెండు రోజులు కొనసాగనున్న ఈ సదస్సుకు ఒక రోజు ముందుగానే బెనిఫిట్ షో తరహాలో సన్నాహకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో చేపట్టిన అవగాహనా ఒప్పందాల బదలాయింపునకు భారీ స్పందన వచ్చింది. ఐదు ప్రభుత్వ శాఖలు 35 పారిశ్రామిక సంస్థలతో రూ.3,65,304 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఒప్పందాల ద్వారా 1,24,371 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. కాగా... భాగస్వామ్య సదస్సును ప్రకటించాక వివిధ దేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ పర్యటించి చేసుకున్న 410 ఎంఓయూలతో రూ.9,78,248 కోట్ల పెట్టుబడులు, 7,48,427 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. 2019-24 మధ్యకాలంలో అప్పటి సీఎం జగన్ అనుసరించిన పారిశ్రామిక వ్యతిరేక విధానాల కారణంగా చాలా కంపెనీలు ఏపీ పేరెత్తితేనే హడలిపోయాయి. ముఖ్యంగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో చంద్రబాబు ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను జగన్ హఠాత్తుగా రద్దు చేశారు. ఆ ఒప్పందాలన్నీ కేంద్రం చొరవతో చంద్రబాబు ప్రభుత్వం చేసుకుంది. వాటిని రద్దు చేస్తానంటే చట్టపరంగా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని జగన్‌ను కేంద్రం హెచ్చరించింది. అయినా.. జగన్ లెక్కచేయలేదు. వాటి రద్దు ఫలితం అంతర్జాతీయ పారిశ్రామిక సమాజంపై పడింది. ఏపీలో పరిశ్రమలను ప్రోత్సహించడం అలా ఉంచితే.. తరిమి కొడతారన్న అభిప్రాయం పారిశ్రామిక దిగ్గజ సంస్థల్లో బలంగా నాటుకుంది. కేంద్రం హెచ్చరించినట్లుగానే పీపీఏల రద్దు నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. దీంతో పీపీఏల మేరకు విద్యుత్ కొనుగోళ్ల కోసం దాదాపు రూ.6,500 కోట్లు, కోర్టు ఉత్తర్వులు వచ్చేలోగా బహిరంగ మార్కెట్లో మరో రూ.3,500 కోట్ల మేర కరెంటు కొనుగోళ్ల ద్వారా మొత్తంగా రూ.10,000 కోట్లను జగన్ ప్రభుత్వం ప్రజలపై 'ట్రూఅప్ భారం' వేసింది. వీటికితోడు అమర్‌రాజా బ్యాటరీస్‌ను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టింది. జాకీ అండర్ గార్మెంట్స్ కంపెనీ రాష్ట్రానికి రాకుండానే వెళ్లిపోయింది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక పారిశ్రామికవేత్తలో విశ్వాసం పెరిగింది. దీంతో ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరుగనున్న పారిశ్రామిక సదస్సుకు పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. ఒక రోజు ముందుగా గురువారం సీఎం చంద్రబాబు సమక్షంలో 35 సంస్థలు చేసుకున్న ఒప్పందాలు ఇలా ఉన్నాయి.



కంపెనీ	కార్యకలాపాలు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉద్యోగాల సంఖ్య
మణిపాల్ గ్రూప్	యూట్యూబ్ మీడియా టెక్నాలజీ హబ్	15,000	1,000
బెర్జాయా గ్రూప్	రెసిడెన్షియల్, కమర్షియల్, థీమ్‌పార్కు, వేస్ట్ మేనేజ్‌మెంట్	8,300	-
అమరావతి లైఫ్ సైన్సెస్	బయోటెక్ పార్కు	2,000	
మైసిటీ/ మలేసియా సిటీ	సిటీ విత్ ఇన్ సిటీ	2,000	
విబ్వెన్స్ గ్రూప్ విక్టోరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	అంతర్జాతీయ విద్యా సంస్థలు	2,000	5,000
పెఫ్-ఫ్యాషన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఫండ్	వెంచర్ స్టుడియో అండ్ ఎకో సిస్టమ్ బిల్డర్ ఫర్ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ రిటైల్ అండ్ మీడియా	1,200	600
ఫిరా బార్సిలోనా ఇంటర్నేషనల్	కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్	-	-
ఏస్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రై.లి.	మైస్ హబ్	1,800	600
ఏబీసీ క్లీన్‌టెక్ ప్రై.లి. అండ్ యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా	రెన్యూవబుల్ ఎనర్జీ-డేటా సెంటర్-హాస్పిటాలిటీ	1,10,250	13,500
రెన్యూ ప్రై.లి.	పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులు	25,000	10,000
రెన్యూ ఇ-ఫ్యూయల్స్	గ్రీన్ హైడ్రోజన్, వాటి ఆధారిత ఉత్పత్తులు	17,000	1,100
రెన్యూ ప్రై.లి.	గ్రీన్ హైడ్రోజన్	12,500	3,250
రెన్యూ ఫొటోవోల్టిక్స్	6 గిగావాట్ పీవీ ఇన్‌గోట్	6,451	3,800
నవయుగ ఇంజనీరింగ్	పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ఎనర్జీ	15,455	3,600
నవయుగ ఇంజనీరింగ్	పీఎస్పీ	7,972	2,700
చింతా గ్రీన్ ఎనర్జీ	పంప్డ్ స్టోరేజ్ హైడల్ ఎనర్జీ	15,050	3,600
చింతా గ్రీన్ ఎనర్జీ	పంప్డ్ స్టోరేజ్	12,905	3,000
ఫోర్‌స్క్వేర్ గ్రీన్ ఎనర్జీ	పవన, సౌర హైబ్రీడ్ విద్యుదుత్పత్తి, బీఈఎస్ఎస్	10,905	1,750
ఫోర్‌స్క్వేర్ గ్రీన్ ఎనర్జీ	పవన విద్యుత్	4,900	1,300
ఫోర్‌స్క్వేర్ గ్రీన్ ఎనర్జీ	సౌర విద్యుత్	6,750	5,200
ఇండోసోల్	పవన విద్యుత్	8,900	1,300
ఇండోసోల్	రెన్యూవబుల్ ఎనర్జీ స్టోరేజీ	6,750	5,200
ఇండోసోల్	డైరెక్ట్ ట్రాన్స్‌మిషన్	2,500	300
ఇండోసోల్	టెక్నాలజీ	500	50
షిర్డీసాయి	ట్రాన్స్‌ఫార్మర్ తయారీ	5,000	5,000
వమనోవా ఆగ్రో ఫుడ్‌పార్కు	డెయిరీ ఉత్పత్తులు	1,440	7,000
ఐటీసీ ఫుడ్ లిమిటెడ్	సుగంధ ద్రవ్యాలు	400	500
గోద్రేజ్ ఆగ్రోవెట్	క్రూడ్ పామ్	209	66
బిస్లరీ	బేవరేజెస్	200	500
ఐఎస్‌టీసీ-విశాఖ	కరిక్యులమ్ డెవలప్‌మెంట్	-	-
క్రాన్ ఎల్ఎన్‌జీ	ఎల్ఎన్‌జీ టెర్మినల్	10,649	-
ఆర్‌సీఆర్‌టీ	కార్గో టెర్మినల్	1,815	1,300
వైజాగ్ ప్రొఫైల్స్ లాజిస్టిక్స్	పోర్టు ఆధారిత రవాణా	1,000	1,250
వైజాగ్ ప్రొఫైల్స్	గ్రీన్ మెటల్స్ అండ్ మెరైన్ మాన్యుఫాక్చరింగ్	5,000	4,000
స్టీల్‌ఎక్స్ఛేంజి ఇండియా	స్టీల్ తయారీ	3,450	3,000
స్టీల్‌ఎక్స్ఛేంజి ఇండియా	మల్టీ మోడల్ పార్కు అభివృద్ధి	1,200	2,400
విరూపాక్ష ఆర్గానిక్స్	ఏపీఐ తయారీ	1,189	2,000
అనంత్ టెక్నాలజీస్	మిసైల్ ప్రొడక్ట్స్ తయారీ	1,000	1,000
ఏటీఆర్ వేర్‌హౌసింగ్	ఇండస్ట్రియల్ పార్కు	1,000	5,000
ఏటీఆర్ వేర్‌హౌసింగ్	ప్రీకాస్ట్ కాంక్రీట్ తయారీ	100	2,000
లారస్ ల్యాబ్స్	బల్క్ డ్రగ్ తయారీ	1,000	500
మారుతీ ఇస్పాత్ అండ్ పైప్స్	ఇండస్ట్రియల్ మెటీరియల్ తయారీ	1,000	1,800
ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్	అమ్యూనిషన్ తయారీ	1,000	500
మల్లాది ఫార్మా	ఏపీఐ తయారీ	353	355
హీరో ఫ్యూచర్	ఎనర్జీ	15,000	15,400
ఇ-జోల్	బ్యాటరీ అండ్ ఈవీ చార్జింగ్ తయారీ	19,000	1,800
కోరమండల్ ఇంటర్నేషనల్	ఎరువులు, ఆగ్రో కెమికల్ తయారీ	2,000	500
తైవాన్ ప్రై. ఇండస్ట్రియల్ పార్క్	మల్టీ సెక్టార్ ఇండస్ట్రియల్ పార్కులు	1,200	1,000
జూల్	సామిల్ - ఉడ్ ప్రాసెసింగ్	1,500	1,000
	మొత్తం	3,65,304	1,26,471

నెలాఖరులోగా గూగుల్‌కు శంకుస్థాపన

త్వరలోనే టీసీఎస్, కాగ్నిజెంట్ కార్యకలాపాలు.. ఇన్ఫోసిస్ మరింత విస్తరణ

ఏపీని 'కాలిఫోర్నియా ఆఫ్ ఈస్ట్'గా తీర్చిదిద్దుతాం: లోకేశ్

ఎండాడ, రుషికొండల్లో వరల్డ్ ట్రేడ్ సెంటర్, ఐటీ కంపెనీల ఏర్పాటుకు శంకుస్థాపన

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్‌కు విశాఖపట్నంలో ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ప్రకటించారు. సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో పాల్గొనడానికి గురువారం విశాఖ వచ్చిన ఆయన.. ఎండాడలోని పనోరమ హిల్స్ వెనుక వరల్డ్ ట్రేడ్ సెంటర్ (కపిల్ చిట్స్ గ్రూపునకు చెందిన బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేటు లిమిటెడ్)కు, రుషికొండపై ఫినోమ్ పీపుల్స్ లిమిటెడ్, సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విశాఖపట్నంలో త్వరలోనే టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు కార్యకలాపాలు ప్రారంభిస్తాయన్నారు. ఇన్ఫోసిస్ మరింత విస్తరణకు వెళ్తుందని... ఇవి కాకుండా మరిన్ని ఐటీ సంస్థలు రాబోతున్నాయని చెప్పారు. ఇప్పుడు శంకుస్థాపనలు చేసిన సంస్థల పెట్టుబడుల ద్వారా రాబోయే మూడేళ్లలో 30 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 'కాలిఫోర్నియా ఆఫ్ ఈస్ట్'గా తీర్చిదిద్దుతామని.. ఈ ప్రయాణంలో అంతా భాగస్వాములు కావాలని పిలుపిచ్చారు. ఫినోమ్ సహవ్యవస్థాపకుడు హరి బైరెడ్డి మాట్లాడుతూ.. రెండు దశల్లో విస్తరణ పనులు చేపడతామని రూ.207.5 కోట్ల పెట్టుబడితో 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

విశాఖకు టిల్‌మాన్ డేటా సెంటర్.. టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ రూ.15000 కోట్లతో 250-300 మెగావాట్ల సామర్థ్యంలో విశాఖలో డేటా సెంటర్‌ను ఏర్పాటుకు ముందుకొచ్చింది. 40 ఎకరాల్లో స్థాపించే ఈ డేటా సెంటర్‌లో 200 నుంచి 300 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయని సంస్థ ప్రకటించింది. ఈమేరకు మంత్రి లోకేశ్ సమక్షంలో బుధవారం రాత్రి ఢిల్లీలో టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్‌తో రాష్ట్ర ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఒప్పందం చేసుకుంది.



ఎండాడలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్మాణానికి సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి లోకేశ్. చిత్రంలో పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, లోకం మాధవి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, కాటమనేని భాస్కర్ తదితరులు



సీఎం చంద్రబాబుతో ఇండియా-యూరప్ పారిశ్రామికవేత్తలు



సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలతో కోరమండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శంకర సుబ్రమణియన్



సైఫ్ట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్, కంపెనీ ప్రతినిధులు

రెన్యూ పవర్

82 వేల కోట్ల పెట్టుబడి!

ఇందులో రూ. 22వేల కోట్ల పెట్టుబడికి గతంలోనే అంగీకారం

తాజాగా మరో రూ. 60వేల కోట్లు పెట్టేందుకు 4 ఒప్పందాలు



సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలతో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సీఎండీ రాహుల్ ముంజల్, తదితరులు

4 గిగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి హీరో గ్రూప్ ఎంవోయూ

పునరుత్పాదక విద్యుత్తు రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 4 గిగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేలా రూ.15వేల కోట్ల వ్యయంతో అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఈ సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ సీఎండీ రాహుల్ ముంజాల్ గురువారం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. సీఎం సమక్షంలో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ - ఈడీబీ ఒప్పందాలు చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఈ సంస్థ సీఎండీకి సీఎం హామీ ఇచ్చారు. గ్రీన్ ఎనర్జీ, హైబ్రిడ్ సొల్యూషన్స్ రంగాల్లో పెట్టుబడులతో ముందుకురావాలని, డెడికేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ పార్కును ఏర్పాటు చేయాలని సూచించారు.

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు కంటే ముందుగానే రాష్ట్రప్రభుత్వం భారీ ఎత్తున ఎంవోయూలను కుదుర్చుకుంటోంది. గత ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. పునరుత్పాదక విద్యుత్తు రంగంలో దేశంలోనే ప్రముఖ సంస్థగా ఉన్న రెన్యూ పవర్ ఏపీలో రూ.82వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. గురువారం ఆ కంపెనీ చైర్మన్ సుమంత్ సిన్హా.. సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీ ముందంజలో ఉందని, పర్యావరణ పరిరక్షణతోపాటు వినియోగదారులకు విద్యుత్తును తక్కువ ధరకు అందించడమే తమ లక్ష్యమని సీఎం వివరించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమక్షంలో రెన్యూ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎకానమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ)తో రూ.60వేల కోట్ల విలువైన 4ఎంవోయూలను కుదుర్చుకుంది. కాగా, ఒప్పందంలో భాగంగా 6 గిగావాట్ ఫొటోవోల్టాయిక్(పీవీ) ఇంగోట్-వేఫర్ ప్లాంట్, 2 గిగావాట్ పంప్డ్ హైడ్రో ప్రాజెక్టు, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా సౌకర్యం, విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ వంటి వాటిల్లో 5 గిగావాట్ హైబ్రిడ్ ప్రాజెక్టులను రెన్యూ సంస్థ ఏర్పాటు చేయనుంది. తాజా ఎంవోయూల ద్వారా 10వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధికి అవకాశముంది.

రైతులతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు

రాష్ట్రంలో వ్యవసాయానికి యోగ్యం కాని భూములు, బీడు భూముల్లో రైతులు స్వయంగా సోలార్, విండ్ విద్యుదుత్పత్తి చేస్తే ఎంతమేర లాభదాయకంగా ఉంటుంది... ఎకరానికి ఎంత ఆదాయం వస్తుందనే దానిపై రెన్యూ పవర్ చైర్మన్ సుమంత్ సిన్హాతో సీఎం చర్చించారు. సౌర పలకల ధరలు అధికంగా ఉన్నందున వాటి తయారీ యూనిట్లను ప్రోత్సహిస్తామని సీఎం వెల్లడించారు.

సదస్సుకు వస్తే పెట్టుబడులు వచ్చినట్టా..!

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 2023 మార్చి 3న విశాఖపట్నంలో ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించింది. ఈ సమ్మిట్‌కు రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీతోసహా పలువురు పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. రెన్యూ సంస్థ చైర్మన్ సుమంత్ సిన్హా ఈ సమావేశానికి హాజరై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కానీ ఆ తర్వాత సుమంత్ సిన్హా సహా ఒక్క పారిశ్రామికవేత్త కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టలేదు. కానీ వైసీపీ మాత్రం....రెన్యూ సంస్థను తామే తీసుకొచ్చామని ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటోంది.

గతంలో 22వేల కోట్లు పెట్టుబడి..

రెన్యూ సంస్థ ఈ ఏడాది మే 16న అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో రూ.22వేల కోట్లతో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టుకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఇది దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక శక్తి ప్రాజెక్టు. ఇందులో 1.8 గిగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్, 2 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ను రెన్యూ సంస్థ ఏర్పాటు చేస్తోంది.

ఏపీ అప్రోచ్ చాలా బాగుంది!

రెన్యూ ఎనర్జీ చైర్మన్, సీఈవో సుమంత్ సిన్హా



విశాఖపట్నం/అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవ, ప్రాజెక్టులపై చూపించే ఆసక్తి తమను ఎంతో ఆశ్చర్యానికి గురిచేశాయని రెన్యూ ఎనర్జీ చైర్మన్ అండ్ సీఈవో సుమంత్ సిన్హా సంతోషం వ్యక్తం చేశారు. అందుకే వెనక్కి వెళ్లిపోయిన తాము తిరిగి ఏపీకి పెట్టుబడులు పెట్టేందుకు వచ్చామని వెల్లడించారు. విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో సుమంత్ సిన్హా విలేకరులతో మాట్లాడారు. తాము ఏపీలో పెట్టుబడులు పెట్టాలనే ఆసక్తితో గతంలో ముందుకువస్తే అప్పటి ప్రభుత్వం నుంచి తగిన సహకారం లభించలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మరోసారి సంప్రదిస్తే చంద్రబాబు, లోకేశ్ నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని చెప్పారు. వారు అత్యంత వేగంగా స్పందించి, ఆయా ప్రాజెక్టులు అతి తక్కువ కాలంలో సాకారమయ్యేలా పూర్తి సహకారం అందించారని, ఇందుకోసం ప్రత్యేక అధికారులను తమకు కేటాయించారని వివరించారు. వారి చొరవ వల్లే తాము ఈ రోజు అదనంగా రూ.60 వేల కోట్లకు ఎంవోయూ చేశామన్నారు. కాగా, అమెరికాకు చెందిన కార్బోనాటిక్ ఎల్ఎల్‌సీ సంస్థ రాష్ట్రంలో రూ.31,500 కోట్ల పెట్టుబడులకు చంద్రబాబు సమక్షంలో ఎంవోయూ చేసుకుంది. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు ట్రెండన్ టి.ఫిట్జ్‌పాట్రిక్ మాట్లాడుతూ తాము పెట్టుబడులకు ప్రతిపాదనలు పంపగానే సీఎం అత్యంత వేగంగా స్పందించారని, ఒక అధికారిని పంపించి సంప్రదింపులు చేశారని, అక్కడి నుంచి అన్నీ చాలా వేగంగా ముందుకు కదిలాయని వివరించారు.

పర్యాటకంలో 98 సంస్థలతో ఒప్పందాలు!

ఇప్పటి వరకు రూ.12వేల కోట్ల పెట్టుబడులు: మంత్రి దుర్గేశ్

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా, నూతన పర్యాటక పాలసీ 2024-29తో పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నట్లు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. ఇందులో భాగంగా విశాఖలో జరుగుతున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో, ఒక్క పర్యాటక రంగంలోనే 98 సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు వెల్లడించారు. సదస్సులో పాల్గొనడానికి గురువారం విశాఖపట్నం వచ్చిన ఆయన గ్రీన్‌పార్క్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిల్లో ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులు పెట్టి ఔత్సాహికులను ఆహ్వానించామన్నారు. ఇప్పటివరకూ సుమారు రూ.12వేల కోట్ల విలువైన పెట్టుబడులు సాధించినట్లు తెలిపారు. సముద్రతీరాన వెల్‌నెస్ సెంటర్లు, ఎకో టూరిజం పార్కుల ఏర్పాటు అంశాల్లో సమూల మార్పులు తీసుకువస్తున్నామని చెప్పారు. మెగా, ఆల్ట్రా మెగా ప్రాజెక్టులతో స్టార్ హోటళ్లు రానున్నాయని మంత్రి తెలిపారు.

చిన్న పిల్లలకు పెద్ద ప్రశ్నలు..!

- ఎస్ఏ-1లో రెండో తరగతికి 8 పేజీల ప్రశ్నపత్రం
- కఠినంగా ప్రశ్నల సరళి... టీచర్లలో ఆందోళన
- బాలల దినోత్సవం సందర్భంగా నేటి పరీక్ష వాయిదా

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల ప్రశ్నపత్రాలపై ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మంగళవారం ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభమయ్యాయి. 1 నుంచి 5 తరగతుల ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఏకంగా 8 పేజీలతో ప్రశ్నపత్రాలు ఇచ్చారు. గతేడాది వరకూ ఎస్ఏ-1 పరీక్షలు ఒక్కో సబ్జెక్టు 50 మార్కులతో జరిగేవి. ఈ ఏడాది దాన్ని 80 మార్కులకు పెంచారు. అలాగే ప్రశ్నల సరళిని పాఠశాల విద్యాశాఖ చాలా వరకు మార్చింది. గతంలో ప్రశ్నలు చిన్నవిగా ఉండేవి. ఇప్పుడు వాటిని సుదీర్ఘ విధానంలోకి తీసుకొచ్చింది. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చినట్లుగా ప్రాథమిక తరగతులకూ ప్రశ్నలు రూపొందించారని టీచర్లు అంటున్నారు. అందులోనూ ప్రశ్నలు సంక్లిష్టంగా ఉన్నాయని, వాటిని చిన్న పిల్లలు అర్థం చేసుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా టీచర్లే ఆ ప్రశ్న ఏమిటనేది వారికి వివరించినా సమాధానాలు రాయలేని పరిస్థితి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం జరిగిన రెండో తరగతి గణితం పరీక్షలో ఓ ప్రశ్నకు సమాధానం తప్పుగా ఇచ్చారు. 'రవి వద్ద రూ.75, రాజు వద్ద రూ.25 ఉన్నాయి. అయితే రవి కంటే రాజు వద్ద ఎంత ఎక్కువ ఉన్నాయి?' అనే మల్టిపుల్ చాయిస్ ప్రశ్న అడిగారు. రవి కంటే రాజు వద్ద ఎలా ఎక్కువ ఉంటాయి? పోనీ సమాధానాల్లో మైనస్ ఆప్షన్ ఇచ్చినా ప్రశ్నలో అర్థం ఉండేదని టీచర్లు అంటున్నారు. ఇప్పటివరకూ జరిగిన తెలుగు, ఇంగ్లీషు, గణితం మూడు పరీక్షలు క్లిష్టంగానే ఉన్నాయని, మారిన ప్రశ్నల సరళిని చూసి విద్యార్థులు భయపడుతున్నారని టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. పైగా విద్యార్థులకు తక్కువ మార్కులు వస్తే దానికి టీచర్లనే బాధ్యులను చేస్తారని ఆందోళన చెందుతున్నారు. కాగా.. బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జరగాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ధర్మవరంలో మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్

- లీజుకు భూమి కేటాయిస్తూ ఉత్తర్వులు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటుకానుంది. అందుకోసం వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని 9.84 ఎకరాల భూమిని నెలకు రూ.10 వేల చొప్పున అద్దెకు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈమేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏసీబీ పేరుతో సబ్ రిజిస్ట్రార్‌కు టోకరా

- రెండు లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

మొగల్తూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో ఓ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ చిక్కుకున్నారు. ఏసీబీ రైడ్ పేరుతో రూ.రెండు లక్షలు కొట్టేశారు. సబ్బితి శ్రీనివాసులు పశ్చిమ గోదావరి జిల్లాలోని మొగల్తూరులో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. గత వారం రాష్ట్రంలో పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు జరిగిన విషయం తెలిసిందే. వాటి నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు జిల్లాలోని కొంతమంది సబ్ రిజిస్ట్రార్‌లకు ఫోన్లు చేశారు. బుధవారం సబ్బితి శ్రీనివాసులుకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. 'మీ కార్యాలయంపై ఏసీబీ ఆకస్మిక దాడులు జరగనున్నాయి. రైడ్ జరగకుండా ఉండాలంటే రూ.3 లక్షలు మేం సూచించిన బ్యాంకు ఖాతాకు తక్షణమే బదిలీ చేయండి. లేకుంటే రైడ్ తప్పదు' అంటూ బెదిరింపులకు దిగాడు. వచ్చిన ఫోన్ ఏసీబీ కార్యాలయం నుంచే అనుకున్న సబ్బితి శ్రీనివాసులు... తన బ్యాంకు ఖాతా నుంచి రూ.ఒక లక్ష, ఇతరుల నుంచి సేకరించి మరో రూ.లక్ష వారు సూచించిన ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఆ నేరగాడు మరలా ఫోన్‌చేసి 'మిగిలిన రూ.లక్ష కూడా బదిలీ చేయండి'అంటూ బెదిరింపునకు దిగడంతో ఆ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌కు అనుమానం వచ్చింది. తనకు తెలిసిన వారిని సంప్రదించడంతో మోసపోయినట్టు అర్థమయింది. లబోదిబోమంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదుచేశారు.

ఆర్టీసీ గేర్ మారింది



మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీకి కళ

- 66 శాతం నుంచి 88 శాతానికి ఆక్యుపెన్సీ
- పదిన్నర లక్షల వరకు పెరిగిన ప్రయాణికులు
- రద్దీతో బస్సులు, బస్టాండ్లు నిత్యం కిటకిట
- 'స్త్రీ శక్తి'కి 400 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- ఆగస్టు నుంచి అక్టోబరు వరకు రీయింబర్స్‌మెంట్
- హర్షం వ్యక్తం చేసిన యూనియన్లు

ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం మహిళల ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గిస్తోంది. విద్యార్థినులతో పాటు ఉద్యోగ, ఉపాధికి రాకపోకలు సాగించేవారికి 'స్త్రీ శక్తి' పథకం ఎంతగానో ఉపయోగ పడుతోంది. మహిళల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి దోహదపడుతోంది. అంతేకాదు.. ఆర్టీసీకి ప్రయాణికుల కళ తెచ్చింది. ఎక్కడ చూసినా బస్టాండ్లు, బస్సులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి.

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రవాణా వాహనాలతో పోటీపడలేక ఇబ్బంది పడుతున్న ఏపీఎస్ ఆర్టీసీకి 'స్త్రీ శక్తి' పథకం నూతనోత్తేజాన్ని ఇచ్చింది. సంస్థ రికార్డుల ప్రకారం ప్రయాణికుల సంఖ్యలో వృద్ధి భారీగా నమోదైంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మూడు నెలల క్రితం విజయవాడలో ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం ప్రజా రవాణా సంస్థకు కళ పెంచింది. అంతేకాకుండా కూటమి ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రంలోని లక్షలాది మంది మహిళలకు ప్రయాణాల్లో ఆర్థిక భారం పూర్తిగా లేకుండా చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. 66 శాతం నుంచి 88 శాతానికి ఆక్యుపెన్సీ పెరిగింది. 2024 సెప్టెంబరులో రోజువారీ ప్రయాణికుల సగటు 35.70 లక్షలు ఉండగా, ఈ ఏడాది సెప్టెంబరులో ఆ సంఖ్య 46.24 లక్షలకు చేరుకుంది. దీంతో అదనంగా 10.54 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పెరుగుదలకు మహిళా ప్రయాణికులే కారణమని ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంత బస్సులు కిటకిట

ఉచిత ప్రయాణ పథకం గ్రామీణ ప్రాంత బస్సుల్లో దాదాపుగా నూరు శాతం ఆక్యుపెన్సీ వచ్చేలా చేసింది. గతంలో 55 నుంచి 62 శాతం మధ్య కొనసాగిన ఆక్యుపెన్సీ రేటు గ్రామీణ బస్సు సర్వీసులకు ఇప్పుడు 95 నుంచి 100 శాతం వరకు ఉంటోంది. పల్లెల నుంచి పట్టణ ప్రాంతాలకు మహిళా ప్రయాణికులు పెద్ద సంఖ్యలో వచ్చి వెళుతున్నారు. నగరాలలో ఉపాధి, ఉద్యోగం కోసం వెళ్లే మహిళలు ఎక్కువగా ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఈ బస్సులు పట్టణాలు, నగరాలకు అత్యంత రద్దీగా రాకపోకలు సాగిస్తున్నాయి.

బ్రేక్ జర్నీతో దూర ప్రాంతాలకు..

మహిళల ఉచిత ప్రయాణం పథకంలో భాగంగా సరికొత్త కోణం ఆవిష్కృతం అవుతోంది. దూరప్రాంతాలకు నడిచే ఏసీ, సూపర్ లగ్జరీ తదితర బస్సుల్లో ఉచిత ప్రయాణం లేకపోవటంతో మహిళలు బ్రేక్ జర్నీని ఆశ్రయిస్తున్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నం, తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే మహిళలు మధ్యలో బస్సులు మారుతూ వెళుతున్నారు.

ఏసీ బస్సులు, సూపర్ లగ్జరీ బస్సులు నేరుగా విశాఖపట్నం వెళ్తాయి. వీటిలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది గనుక మహిళలు ఎక్స్‌ప్రెస్ బస్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. కిటకిటలాడుతూ ఉండాల్సిన హయ్యండ్ బస్సుల్లో ఇటీవల ఆక్యుపెన్సీ తగ్గిపోతుండటాన్ని మొదట్లో ఆర్టీసీ అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత ఆరా తీయగా.. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో బ్రేక్ జర్నీ చేస్తూ మహిళలు ప్రయాణిస్తున్నట్లు తెలుసుకున్నారు.

మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి 400 కోట్లు

మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ఆర్టీసీకి భారీ ఊరట లభించింది. స్త్రీ శక్తి పథకం కోసం ప్రభుత్వం రూ. 400 కోట్లు మంజూరు చేసింది. పథకం ప్రారంభమైన ఆగస్టు నుంచి అక్టోబరు వరకు రీయింబర్స్‌మెంట్ కోసం ఈ నిధుల విడుదలకు పాలన అనుమతులు ఇచ్చింది. దీంతో మహిళల ఉచిత ప్రయాణ పథకానికి ఖర్చయిన మొత్తం ప్రభుత్వం చెల్లించింది. దీనికి సంబంధించి ఆర్టీసీ ఎండీ తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి మహిళల ప్రయాణ భారం తగ్గిందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల ప్రయాణం పెరిగిందని ఈ సందర్భంగా పేర్కొంది.

స్త్రీ శక్తికి నిధుల విడుదల భేష్

- నేషనల్ మజ్దూర్, ఎంప్లాయీస్ యూనియన్ల కృతజ్ఞతలు

విజయవాడ (బస్‌స్టేషన్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన స్త్రీశక్తి పథకానికి ప్రభుత్వం రూ. 400 కోట్లు విడుదల చేయటంపై యూనియన్లు హర్షం వ్యక్తం చేశాయి. ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదరరావు, జి.వి.నరసయ్య గురువారం ఒక ప్రకటనలో సంతోషం వెలిబుచ్చారు. ఆగస్టు 15 నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు 75 రోజులకు రూ. 400 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావులకు యూనియన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. స్త్రీ శక్తి పథకానికి నిధుల విడుదల ఆర్టీసీ ఎండీ ద్వారా పలుమార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు అందచేసినట్టు ఈయూ నేతలు తెలిపారు. స్త్రీశక్తి పథకం విజయవంతంగా నడవాలంటే 3 వేల బస్సులు కొనుగోలు చేసి, 10 వేల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు.

భారం ఎక్కువై బస్సులు బ్రేక్ డౌన్

గ్రామీణప్రాంతాల సర్వీసులన్నీ ప్రతి ట్రిప్పులోనూ ఫుల్ అవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో కిక్కిరిసి పోతున్నాయి. దీంతో ముందుకు కదల్లేక తరచూ బస్సులు బ్రేక్ డౌన్ అవుతున్నాయి. బస్సులో 55 సీట్ల కెపాసిటీ ఉంటే 100 మందికి పైగా ఒక్కోసారి బస్సులోకి ఎక్కుతున్నారు. ఆర్టీసీలో గ్రామీణ సర్వీసులన్నీ దాదాపు కాలం చెల్లినవే. మరోవైపు మైలేజీ కూడా రావట్లేదని, టైర్లు కూడా అరిగి పోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. అద్దె బస్సుల యజమానులు సైతం రద్దీ పెరగడంతో మైలేజీ పడిపోయి నిర్వహణభారం అవుతోందని యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు.తమకు అద్దెపెంచాలని లేదంటే బస్సులు వెనక్కి తీసుకుంటామని అంటున్నారు.

వివేకా హత్యపై తదుపరి దర్యాప్తు జరగాలి

- లేదంటే అసలు దోషులు తప్పించుకునే ప్రమాదం
- హత్య విషయం జగన్, భారతిలకు ముందే ఎలా తెలుసు?
- ఎవరు కాల్ చేశారు? ఏం చెప్పారు?
- దర్యాప్తు పూర్తికాకుండా ట్రయల్‌తో ఉపయోగం లేదు
- సునీత తరపున సిద్ధార్థ లూథ్రా వాదనలు
- విచారణ శుక్రవారానికి వాయిదా



హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం కచ్చితంగా ఉందని వివేకా కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతా రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు తదుపరి దర్యాప్తు చేపట్టే విధంగా సీబీఐకి ఆదేశాలు జారీచేయాలని కోరుతూ ఆమె నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై గురువారం సీబీఐ కోర్టు న్యాయమూర్తి టి.రఘురాం విచారణ చేపట్టారు. సునీతారెడ్డి తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా.. న్యాయవాది ఎస్.గౌతమ్ ప్రత్యక్షంగా వాదనలు వినిపించారు. తదుపరి దర్యాప్తు కోసం సంబంధిత ట్రయల్ కోర్టులోనే పిటిషన్ దాఖలు చేసుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు సూచించిందని గుర్తుచేశారు. వివేకా హత్య కేసులో లోతైన తదుపరి దర్యాప్తు జరగకపోతే అసలు వ్యక్తులు తప్పించుకునే ప్రమాదం ఉందని.. ఇప్పటికే తండ్రిని కోల్పోయిన పిటిషనర్‌కు పూరించలేని విధంగా మరింత అన్యాయం జరుగుతుందని సిద్ధార్థ లూథ్రా పేర్కొన్నారు. తదుపరి దర్యాప్తు జరిగితే ఇప్పటికీ వెలుగుచూడని అసలు వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. దర్యాప్తు సంపూర్ణంగా జరగకుండా ట్రయల్ చేపట్టడం వల్ల ఉపయోగం లేదని.. అలా చేస్తే న్యాయం జరిగినట్లు కాదని తెలిపారు. 'వివేకా హత్య విషయం ఆరోజు ఉదయం 5.30 గంటలకే భారతి, జగన్‌లకు తెలిసిందని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి రిటైర్ అయిన ఐఏఎస్ అజేయ కల్లం తన స్టేట్‌మెంట్‌లో తెలిపారని గుర్తు చేశారు. 'ఉదయం 5.30 గంటల ప్రాంతంలో అటెండర్ వచ్చి అమ్మ (వైఎస్ భారతి) పైకి పిలుస్తున్నారని తెలుపగా.. జగన్ వెళ్లి పది నిమిషాల తర్వాత వచ్చి చిన్నాన్న (వైఎస్ వివేకా) ఇక లేరు అని చెప్పారు. దీంతో మేమంతా షాక్‌కు గురయ్యాం' అని అజేయ కల్లం తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. అయితే.. భారతి, జగన్‌లకు ఈ విషయం ముందే ఎలా తెలిసింది? ఎవరు కాల్ చేశారు? ఏం చెప్పారు? అనే విషయాలపై సీబీఐ దర్యాప్తు చేయలేదని పేర్కొన్నారు. ఈ విషయాలు బయటికి వస్తేనే దర్యాప్తులో మిగిలి ఉన్న ప్రశ్నలకు సమాధానాలు దొరకడమే కాకుండా అసలు దోషులతోపాటు వాస్తవాలు బయటికొస్తాయని లూథ్రా పేర్కొన్నారు. సిద్ధార్థ లూథ్రా వాదనలు పూర్తికావడంతో నిందితుల తరపు వాదనల కోసం కోర్టు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

'పోస్టర్' లాగితేే ఉగ్రకుట్ర భగ్నం!

- పోస్టర్‌పై రాతల ఆధారంగా దర్యాప్తు.. సీసీ కెమెరాల జల్లెడ
- హరియాణా, యూపీ పోలీసుల సాయంతో అనేక ప్రాంతాల్లో సోదాలు
- జమ్ముకశ్మీర్‌లో ఉగ్ర కుట్ర భగ్నంలో తెలుగు అధికారి కీలకపాత్ర
- దేశమంతా మార్మోగుతున్న కర్నూలు వాసి చక్రవర్తి పేరు



సందీప్ చక్రవర్తి

కర్నూలు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అది శ్రీనగర్‌లోని నౌగామ్ ప్రాంతం.. ఈ ఏడాది అక్టోబరులో ఈ ప్రాంతంలో కొన్నిచోట్ల పోలీసులు, భద్రతా దళాలను హెచ్చరిస్తున్నట్టుగా పోస్టర్లు వెలిశాయి. ఆ ప్రాంతంలో అప్పుడప్పుడూ ఇలాంటి పోస్టర్లు కనిపిస్తూనే ఉంటాయి. కాబట్టి అందరూ దీన్నో సాధారణ విషయంగా భావించారు..! కానీ.. ఒక పోలీస్ అధికారి మాత్రం ఆ పోస్టర్లను నిశితంగా పరిశీలించారు. ఆ రాతల వెనుక ఉద్దేశం ఉగ్రకుట్రకు సంకేతమై ఉండొచ్చని అనుమానించి దర్యాప్తు ప్రారంభించారు. తీగ లాగుకుంటూ వెళితే... 2,900 కిలోల ఐఈడీ.. స్లీపర్ సెల్స్ లింకులతో పాటు దేశాన్ని విచ్ఛిన్నం చేసే భారీ ఉగ్రకుట్ర బయటపడింది. ఇంతకీ ఆ పోస్టర్ వెనుక దాగి ఉన్న ఉగ్ర కుట్రను ఛేదించిన అధికారి ఎవరో కాదు. మన తెలుగు తేజం డాక్టర్ జీవీ సందీప్ చక్రవర్తి.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలునగరానికి చెందిన ఆయన శ్రీనగర్ సీనియర్ ఎస్పీగా పనిచేస్తున్నారు. ఇప్పుడు ఆయన పేరు దేశమంతా మారుమ్రోగిపోతోంది.

ఉగ్రకుట్ర భగ్నం చేశారిలా...

అక్టోబరు 19న శ్రీనగర్‌లోని బన్‌పోరా నౌగామ్‌లోని వివిధ ప్రదేశాల్లో జేషే మహమ్మద్ పోస్టర్లను వెలిశాయి. ఆ పోస్టర్ల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. జమ్మూకశ్మీర్ పోలీసులు... శ్రీనగర్, అనంతనాగ్, గండర్‌బాల్, షోపియన్‌లలోని అనేక ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. హరియాణా పోలీసులతో కలిసి ఫరీదాబాద్‌లో, ఉత్తరప్రదేశ్ పోలీసుల సాయంతో సహరాన్‌పూర్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పాకిస్థాన్, ఇతరదేశాల నుంచి పని చేస్తున్న విదేశీ హ్యాండ్లర్లతో సంబంధాలు కలిగి ఉన్న తీవ్రవాద భావాలున్న నిపుణులు, డాక్టర్లు, విద్యార్థులతో కూడిన వైట్ కాలర్, ఉగ్ర వ్యవస్థను గుర్తించారు. నేరారోపణలకు సంబంధించిన పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఐఈడీ తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కుట్రలో నిషేధిత ఉగ్రవాద సంస్థలు, జైషే మొహమ్మద్ (జేఈఎం), అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ (ఏజీయుహెచ్)లతో సంబంధం ఉన్న అంత రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్రవాద మాడ్యూల్‌ను ఛేధించడంలో పోలీసులు విజయం సాధించారు.

విద్రోహశక్తుల పీచమణచడంలో చక్రవర్తి దిట్ట..!

కర్నూలు నగరానికి చెందిన రిటైర్డు డాక్టర్ జీవీ రామగోపాల్‌రావు, పీసీ రంగమ్మ (ఆరోగ్యశాఖ రిటైర్డు అధికారి) దంపతుల మూడో సంతానం సందీప్ చక్రవర్తి. కర్నూలు మెడికల్ కళాశాల (కేఎంసీ)లో ఎంబీబీఎస్ పూర్తిచేసి డాక్టర్ పట్టా అందుకున్నారు. తొలి ప్రయత్నంలోనే సివిల్స్-2014లో మంచి ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం శ్రీనగర్ సీనియర్ ఎస్పీగా పని చేస్తున్నారు. 2017లో తొలిసారిగా రాష్ట్రపతి శౌర్య పతకం అందుకున్నారు. ఆ తర్వాత ఎక్కడా వెనుదిరిగి చూడలేదు. ఇప్పటివరకు ఆరు సార్లు రాష్ట్రపతి శౌర్య పురస్కారాలు, నాలుగు సార్లు జమ్ముకశ్మీర్ పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ సహా పలు అవార్డులు అందుకున్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం నేడు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు శుక్రవారం వెల్లడవనున్నాయి. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 4.01 లక్షల ఓటర్లున్న నియోజకవర్గంలో 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నవీన్ యాదవ్, మాగంటి సునీతా గోపీనాథ్, లంకల దీపక్‌రెడ్డిలకు మద్దతుగా నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. 11న జరిగిన పోలింగ్‌లో 48.49 ఓటింగ్ శాతం నమోదైంది.

డీఫార్మసీలో 454 సీట్లు భర్తీ

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డీఫార్మసీలో 454 సీట్లు భర్తీ అయ్యాయని సాంకేతిక విద్యాశాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇటీవల డీఫార్మసీ కౌన్సెలింగ్ నిర్వహించి, గురువారం సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిచేసింది. రాష్ట్రంలో 45 కాలేజీల్లో 2,813 సీట్లు కన్వీనర్ కోటాలో ఉండగా 454 భర్తీ అయ్యాయి. ప్రభుత్వ కాలేజీల్లో 301, ప్రైవేటు కాలేజీల్లో 2,058 సీట్లు మిగిలాయి.

15న అగ్రి, ఈఏపీ సెట్ అభ్యర్థులకు చివరి విడత మాన్యువల్ కౌన్సెలింగ్

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ(హాన్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశానికి చివరి విడత కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. ఈ నెల 15న మాన్యువల్ పద్ధతిలో దీనిని నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఎంవీ రమణ తెలిపారు. పూర్తి వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.

కొండా సురేఖ క్షమాపణ.. నాగార్జున కేసు వాపస్

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తన కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా, పరువునష్టం కలిగించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలంగాణ మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం కేసును సినీహీరో నాగార్జున ఉపసంహరించుకున్నారు. దీంతో విచారణను ముగిస్తూ నాంపల్లి ప్రత్యేక కోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కొండా సురేఖపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నాగార్జున గతేడాది న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే సురేఖ బుధవారం తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తంచేస్తూ.. వాటిని ఉపసంహరించుకుంటున్నట్లు ఎక్స్‌లో తెలిపారు. ఆమె క్షమాపణలను అంగీకరించిన నాగార్జున.. పరువునష్టం కేసును ఉపసంహరించుకున్నారు.

నకిలీ మద్యం నిందితుల రిమాండ్ పొడిగింపు

విజయవాడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యంతయారీ కేసులో నిందితులకు బెజవాడలోని ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఈనెల 25వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగించింది. నెల్లూరు జైలులోని మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రాము, ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావుతోపాటు విజయవాడ జిల్లా జైల్లో ఉన్న ఏడుగురు నిందితులను గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. వారికి రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఉత్తర్వులు ఇచ్చారు. మరోవైపు మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి లఖ్‌నవూ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.